RNI No. APTEL/2006/17880 www.bharathasakthi.com



# భారత శక్తి®

తెలుగు దినపత్రిక

VOICE OF INDIAN



Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి: 19 సంచిక:176 హైదరాబాద్, శనివారం, 11జనవరి 2025 పేజీలు: 12 వెల: 1.00

## బయోటెక్నాలజీ పరిశోధనల్లో మైలురాయి

న్యూఢిల్లీ, జనవరి 9: భారత ప్రధాని నరేంద్ర మోదీ 10వేల మంది భారతీయుల జన్యుక్రమ విశ్లేషణ(జీనోమ్ సీక్వెన్సింగ్) సమాచారాన్ని గురువారం విడుదల చేశారు. జీనోమ్ ఇండియా డేటాలోని ఈ సమాచారం విడుదల బయోటెక్నాలజీ పరిశోధనల్లో ఓ మైలురాయిని పేర్కొన్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ ఆధ్వర్యంలో జరిగిన జీనోమ్ కాన్‌క్లేవ్‌లో వర్చువల్‌గా పాల్గొన్న మోదీ ఈ సమాచారాన్ని విడుదల చేశారు. ఇండియన్ బయోలాజికల్ డేటా సెంటర్(ఐబీడీసీ) అధీనంలో ఉండే ఈ సమాచారాన్ని పరిశోధన సంస్థలు అనుమతితో వినియోగించుకోవచ్చు. అయితే, ఈ కార్యక్రమానికి వీడియో సందేశం పంపిన మోదీ.. ఐఐటీలు, కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్(సీఎస్ఐఆర్), బయోటెక్నాలజీ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్(బీఆర్ఐసీ) వంటి 20 ప్రఖ్యాత సంస్థల కృషి వల్ల ఈ సమాచార సేకరణ జరిగిందని తెలిపారు. జన్యుపరమైన వ్యాధులు, అంటువ్యాధుల చికిత్సకు అధునాతన వైద్య విధానాల రూపకల్పనకు, వివిధ వర్గాలకు చెందిన ప్రజల జీవన విధానాలు,



అలవాట్ల అధ్యయనానికి ఈ జీనోమ్ సీక్వెన్సింగ్ డేటా ఉపయోగపడుతుందని మోదీ పేర్కొన్నారు.

## ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు.. 41 స్థానాలు ఖరారు చేయనున్న బీజేపీ..

న్యూఢిల్లీ: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మిగిలిన 41 స్థానాలకు బీజేపీ శుక్రవారం అభ్యర్థులను ఖరారు చేయనుంది. ఇప్పటికే 29 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన కమలదళం ఈరోజు ఉదయం 10.30 గంటలకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా (, కోర్ ఢిల్లీ గ్రూప్ నేతలతో సమావేశమవుతారు. ఈ భేటి జేపీ నడ్డా నివాసంలో జరగనుంది. సాయంత్రం 6.30 గంటలకు బీజేపీ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ సమావేశం కానుంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సహా బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ నేతలంతా ఈ భేటీకి హాజరవుతారు. ఈ రోజు రాత్రి లేదా శనివారం ఉదయం ఢిల్లీలో బీజేపీ అభ్యర్థుల జాబితా విడుదల చేసే అవకాశమున్నట్లు తెలియవచ్చింది.

కాగా ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు-2025 షెడ్యూల్‌ను భారత ఎన్నికల కమిషన్ మంగళవారం (జనవరి 7వ తేదీ)నాడు ప్రకటించింది. 70 అసెంబ్లీ స్థానాలకు ఫిబ్రవరి 5న ఒకే విడతలో ఎన్నికలను నిర్వహించనున్నట్లు తెలిపింది. ఫలితాలు ఫిబ్రవరి 8న వెలువడుతాయని పేర్కొంది. ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్ ప్లీనరీ హాలులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ ఆ వివరాలను వెల్లడించారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం జనవరి 10న ఎన్నికల నోటిఫికేషన్ వెలువడుతుంది. జనవరి 17వ తేదీతో నామినేషన్ల గడువు ముగుస్తుంది. 18న నామినేషన్ల పరిశీలన ఉంటుంది, 20వ తేదీతో నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగుస్తుంది. ఫిబ్రవరి 5వ తేదీ బుధవారం పోలింగ్ నిర్వహిస్తారు. ఫిబ్రవరి 8న ఓట్లు లెక్కించి ఫలితాలు ప్రకటిస్తారు.




ఢిల్లీలో 1.55 కోట్ల ఓటర్లు ఉన్నారని, వీరిలో 83.49 లక్షల పురుష ఓటర్లు, 71.74 లక్షల మహిళా ఓటర్లు ఉన్నారని, ఐదోసారి ఓటింగ్‌లో పాల్గొంటున్న వారు 2.08 లక్షల మంది ఉన్నారని చెప్పారు. 25.89 లక్షల మంది యువ ఓటర్లు (20-29) ఉన్నట్టు తెలిపారు. ఢిల్లీలో13,033 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

నిర్దిష్ట గ్రూపులను టార్గెట్ చేసుకుని ఓటర్ల జాబితాలో వారి పేర్లు తొలగించడం, కొందరి పేర్లు చేర్చడం జరిగిందని కొందరు (రాజకీయ పార్టీలు) చేస్తున్న దుష్ప్రచారాన్ని రాజీవ్ కుమార్ తోసిపుచ్చారు. ఈవీఎంల గురించి సమాధానం ఇచ్చిన తర్వాత కూడా కొందరు ఈవీఎంల అవకతవకలపై మాట్లాడుతున్నారని అన్నారు. ఈవీఎంలలో వైరస్, బగ్ కానీ, చెల్లని ఓట్లు కానీ ఉండవని, రిగ్గింగ్‌కు అవకాశం లేదని స్పష్టం చేశారు. ఇండియాలో 99 కోట్ల రిజిస్టర్డ్ ఓటర్లు ఉన్నారని, ఓటింగ్, మహిళా పార్టిసిపేషన్‌లో ఎన్నికల సంఘం కొత్త రికార్డులు సృష్టించిందని, త్వరలో 100 కోట్ల రిజిస్టర్డ్ ఓటర్లతో సరికొత్త రికార్డు నమోదు కానుందని చెప్పారు. మహిళా ఓటర్ల సంఖ్య 48 కోట్లు దాటడం దేశంలో మహిళా సాధికారతను బలంగా చాటుతోందన్నారు.

## షాకింగ్ న్యూస్.. పది అడుగుల లోతులో పడ్డ భారీ ట్రక్

హైదరాబాద్, జనవరి 10: నగరంలోని ఓ ప్రాంతంలో పదే పదే రోడ్డు కుంగుబాటుకు గురవుతోంది. ఎన్ని సార్లు రోడ్డు వేసినప్పటికీ అదే ప్రాంతంలో వరుసగా రోడ్డు కుంగుబాటుకు గురవడంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఆ ప్రాంతంలో నడిచి వెళ్లాలంటేనే ప్రజలు వణికిపోయే పరిస్థితి.. ఎక్కడ రోడ్డు కుంగుబాటుకు గురవుతుందో.. ఎలాంటి ప్రమాదం జరుగుతుందో అని స్థానికులు భయపడిపోతున్నారు. తాజాగా ఈరోజు (శుక్రవారం) కూడా భారీ శబ్దంతో రోడ్డు కుంగిపోయింది. దీంతో ప్రజలు భయంతో అక్కడి నుంచి పరుగులు తీశారు. ఇంతకీ ఆ రోడ్డు ఎక్కడ.. అక్కడ పరిస్థితి ఏంటి.. తాజాగా జరిగిన ఘటన ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం. నగరంలోని గోషామహల్‌లో ఎరోసారి చాక్నావాడికి నాలా కుంగుబాటుకు గురైంది. దారుసలామ్ రోడ్డు నుంచి చాక్నావాడికి వెళ్లే రోడ్డులో ప్లైవుడ్ దుకాణాల ముందు నాలా కుంగింది. గతంలో కుంగిన నాలా పనులు కొనసాగుతుండగా ప్రక్కనే ఉన్న మరో నాలా కుంగుబాటుకు గురైంది. ఈ సమయంలో నాలాపై ఉన్న క్రషర్ లారీ అందులో



పడిపోయింది. దాదాపు పది అడుగుల లోతులో భారీ ట్రక్కు దిగబడిపోయింది. అయితే ట్రక్కులో ఉన్న లారీ డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డారు. పెను ప్రమాదం తప్పడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. ఇప్పటికే చాక్నావాడికి నాలా కుంగుబాటుకు గురవడం ఇది మూడో సారిగా చెప్పుకోవచ్చు. అయితే ప్రతీసారి ఇలా నాలా కుంగుబాటుకు గురవడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.అ

## ఆటో మొబైల్ రంగంపై ప్రత్యేక దృష్టి: సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్: సీఐఐ జాతీయ కౌన్సిల్ సమావేశం శుక్రవారం హైదరాబాద్ ( లో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ( ముఖ్య అతిథి గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐఐ ప్రతినిధులతో ముఖ్యమంత్రి ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. హైదరాబాద్‌ను కాలుష్య రహిత నగరంగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నామని, చంద్రమండలానికి వెళ్తున్నాం.. కానీ భూమిపైన ఎలా ఉండాలో మాత్రం తెలుసుకోలేకపోతున్నామని అన్నారు. కాలుష్యకారక వాహనాలను అవుటర్ రింగ్ రోడ్డు అవతలికి తరలిస్తున్నామన్నారు. తెలంగాణలో స్వయం సహాయక సంఘాల్లో 67 లక్షల మంది మహిళలు సభ్యులుగా ఉన్నారని, ప్రభుత్వ కార్యాలయాల్లో స్వయం సహాయక మహిళా సంఘాలతో క్యాంటీన్లు ఏర్పాటు చేయించామన్నారు. మహిళా సంఘాలతో సోలార్ పవర్ స్టేషన్లు ఏర్పాటు చేయిస్తున్నామన్నారు. వెయ్యి మెగావాట్ల సోలార్ పవర్ ఉత్పత్తి చేసేలా మహిళా సంఘాలను ప్రోత్సహిస్తున్నామని, హైటెక్ సిటీ పక్కనే మహిళా సంఘాల ఉత్పత్తులను విక్రయించుకునేందుకు మూడున్నర ఎకరాల స్థలంలో స్టాల్స్ ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో చదువుకునే విద్యార్థులకు 40 శాతం డైట్ చార్జీలు, 200 శాతం కాస్మొటిక్ ఛార్జీలను పెంచామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.



రాష్ట్రంలో మహిళాభివృద్ధి ధ్యేయంగా అడుగులు వేస్తున్నామని, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. గ్రామీణ మహిళల సాధికారత కోసం ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. తెలంగాణలో ఆటో మొబైల్ రంగంపై ప్రత్యేక దృష్టి సారించామని, మచిలీపట్నం పోర్ట్‌ను అనుసంధానం చేస్తు రోడ్లు రైలు మార్గాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. రీజనల్ రింగ్ రైల్వే లైన్ మంజూరు చేయాలని ప్రధాని మోదీని కోరామని చెప్పారు.

చైనా తరహాలో క్లస్టర్లు ఏర్పాటు..

చైనా తరహాలో క్లస్టర్లు ఏర్పాటు చేస్తామని, అవుటర్ రింగ్ రోడ్డు, రీజనల్ రింగ్ రోడ్డు మధ్య రేడియల్ రోడ్లు నిర్మిస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణలో ప్రతి యేడాది లక్షా పదివేల మంది ఇంజనీరింగ్ విద్యార్థులు ఉత్తీర్ణత సాధిస్తున్నారన్నారు. ఎక్కువ మంది విద్యార్థుల్లో స్కిల్ ఉండటం లేదని, టాటా గ్రూప్‌తో కలిసి 2400 కోట్లతో రాష్ట్రంలోని ఐటీఐలను ఐటీసీలుగా మారుస్తున్నామన్నారు. నైపుణ్యాల పెంపు కోసం ప్రత్యేకంగా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామని, ఐఎస్ బీ తరహాలో స్కిల్ యూనివర్సిటీ కోసం ఆనంద్ మహీంద్రా చైర్మన్‌గా బోర్డు ఏర్పాటు చేశామని తెలిపారు. స్కిల్ యూనివర్సిటీ కార్పస్ ఫండ్ కోసం సీఐఐ ప్రతినిధులు మద్దతు ఇవ్వాలని, స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ హబ్ కూడా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. సీఐఐ ప్రతినిధులు ఎప్పుడైనా వచ్చి తనను కలవచ్చు.. తమ ప్రభుత్వం అన్ని రకాలుగా సహకరిస్తుందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

హైదరాబాద్‌లో ఫోర్త్ సిటీ, ఫ్యూచర్ సిటీ..

కాగా హైదరాబాద్‌లో ఫోర్త్ సిటీ, ఫ్యూచర్ సిటీని నిర్మించాలని నిర్ణయించుకున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రపంచంలో హైదరాబాద్‌ను చైనాకు ప్లస్ సిటీగా మార్చే వ్యూహంతో ముందుకు వెళ్తున్నామని అన్నారు. న్యూయార్క్, లండన్, టోక్యో, సియోల్ , దుబాయ్ వంటి నగరాలతో ఫ్యూచర్ సిటీ పోటీ పడుతుందని వివరించారు. భారతదేశంలోనే గొప్ప నగరాన్ని నిర్మించాలని అనుకుంటున్నాం.. ఇందులో సేవారంగం మాత్రమే ఉంటుందని అన్నారు. ఎలక్ట్రిక్ వాహనాలకు రిజిస్ట్రేషన్, రోడ్డు పన్నును తొలగించామని ప్రకటించారు. ఫ్యూచర్ సిటీ కాలుష్య రహిత నెట్ జీరో సిటీగా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. 3,200 ఈవీ బస్సులను ఆర్టీసీలోకి తీసుకువస్తున్నామని అన్నారు. భారతదేశంలోనే ఎలక్ట్రిక్ వాహనాలు అత్యంత వేగంగా తెలంగాణలో అమ్ముడవుతున్నాయని ముఖ్యమంత్రి వివరించారు.

## ఏసీబీ విచారణలో బీఎల్ఎన్ రెడ్డి కీలక విషయాలు వెల్లడి..

హైదరాబాద్: ఫార్ములా-ఈ కార్ రేస్ కేసు (లో హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి ఏసీబీ ( విచారణ కొనసాగుతోంది. ఇవాళ (శుక్రవారం) దాదాపు 6 గంటలుగా బీఎల్ఎన్ రెడ్డిని ఏసీబీ అధికారులు ప్రశ్నిస్తున్నారు. ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ రికార్డులను పరిశీలించిన ఏసీబీ అధికారులు వాటిని బీఎన్ఎల్ రెడ్డి ముందు ఉంచి ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. హెచ్ఎండీఏ బోర్డు ఖాతా నుంచి ఎఫ్ఈవోకు రూ.55 కోట్లు రిలీజ్ చేయడంలో బీఎల్ఎన్ రెడ్డి కీలకంగా వ్యవహరించినట్లు ఏసీబీ భావిస్తోంది. ఈ మేరకు నేడు విచారణ చేపట్టింది.

అయితే ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ ఆదేశాలతోనే నగదు రిలీజ్ చేసినట్లు విచారణలో బీఎల్ఎన్ రెడ్డి చెప్పినట్లు తెలుస్తోంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే తాను ప్రొసీడింగ్స్ అన్ని పూర్తి చేశానని రెడ్డి చెప్పినట్లు తెలుస్తోంది. ఇందులో తన సొంత ప్రయోజనాలు ఏమీ లేవని ఏసీబీ అధికారులకు బీఎల్ఎన్ రెడ్డి వివరించినట్లు సమాచారం. ఒకవైపు మంత్రి కేటీఆర్.. మరోవైపు




పైఅధికారి ఒత్తిడి వల్లే రూ.55 కోట్లకు సంబంధించి తాను ప్రొసీడింగ్స్ చేసినట్లు బీఎల్ఎల్ రెడ్డి విచారణలో చెప్పారు.

నగదు బదిలీ చేస్తే భవిష్యత్తులో ఇరుక్కుపోతామని తనకు ముందే తెలుసని ఏసీబీ అధికారులకు బీఎల్ఎన్ రెడ్డి చెప్పినట్లు తెలుస్తోంది. అయినా అప్పటి పరిస్థితుల వల్లే నిబంధనలకు విరుద్ధంగా ముందుకు వెళ్లాల్సి వచ్చినట్లు చెప్పినట్లు సమాచారం.

## కేటీఆర్‌కు భారీ షాక్ ఇచ్చిన బంజారాహిల్స్ పోలీసులు..

హైదరాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ( కు బంజారాహిల్స్ పోలీసులు షాక్ ఇచ్చారు. అనుమతి లేకుండా ర్యాలీ చేశారంటూ అందిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కేటీఆర్‌పై కేసు నమోదు అయ్యింది. నిన్న (గురువారం) ఫార్ములా-ఈ కార్ రేస్ కేసులో భాగంగా ఏసీబీ అధికారులు కేటీఆర్‌ను విచారించిన సంగతి తెలిసిందే. అయితే విచారణ అనంతరం ఎటువంటి అనుమతి లేకుండా ఏసీబీ కార్యాలయం నుంచి బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వరకూ కేటీఆర్ పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనుమతి లేకుండా ర్యాలీ నిర్వహించడమే కాకుండా ట్రాఫిక్ సమస్యలు సృష్టించారంటూ ట్రాఫిక్ పోలీసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కేటీఆర్‌పై కేసు నమోదు అయ్యింది.



## మళ్లీ వచ్చిపడుతున్న మాయదారి వైరస్ లు

అదిగో పులి అంటే ఇదిగో తోక అనే ప్రపంచం. అందుకే ఇప్పుడు తుమ్మినా దగ్గినా భయం. రోగనిరోధక శక్తి తక్కువుంటేనో, సీజన్ మారితేనో.. చిన్నాచితకా అనారోగ్య సమస్యలు కామన్. కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే నాలుగురోజుల్లో అంతా నార్మల్. కానీ కరోనా మహమ్మారి ప్రపంచాన్ని వణికించిన తర్వాత ఇప్పుడు కాస్త పడిశం పట్టినా, గొంతు గరగరమన్నా గుండెల్లో దడే. కడుపులో కాస్త మందంగా అనిపిస్తే ఒకప్పుడు ఓ పూట పత్యంచేస్తే సెట్టయ్యేది. కానీ ఇప్పుడు ఏ దిక్కుమాలిన వైరస్ శరీరంలోకి ప్రవేశించిందోనని అనుమానం హార్ట్‌బీట్ పెంచేస్తోంది. ఏం చేస్తాం మరి.. మళ్లీ వచ్చిపడుతున్నాయ్ మాయరోగాలు. చైనాకు రోగమొచ్చింది. ప్రపంచమంతా వణికిపోతోంది. కేసుల ఊసులేదు. ఊహాజనిత ప్రచారాలే తప్ప అధికారికంగా మరణాల సంఖ్య కూడా తెలీదు. చైనాలో మెడికల్ ఎమర్జెన్సీ డిక్లేర్ చేశారంటూ అనధికార వార్తలు. హెచ్ఎంపీ వైరస్ ..హ్యూమన్ మెటా న్యూమో వైరస్. కరోనాకి కజిన్‌లాంటిదే ఈ వైరస్ కూడా. కరోనా ప్రపంచాన్ని కుదిపేసింది. లక్షల ప్రాణాలను గాల్లో కలిపేసింది. మరి హెచ్ఎంపీవీ కూడా అంతే ప్రమాదమా అంటే అవునని చెప్పలేం. ప్రాణాంతకం కాదని కొట్టిపారేయలేం. ఎందుకంటే కరోనా సీజన్‌లో భయమే మనిషిని చంపేసింది. కరోనా వేరియంట్లలాగే హెచ్ఎంపీ వైరస్ టార్గెట్.. మన శరీరంలోని ఊపరితిత్తులే. అసలే కరోనా ప్రభావంతో లంగ్స్ వీకైపోయాయి. ఈ టైంలో కొత్త వైరస్ ఎఫెక్ట్‌పడితే ఏం జరుగుతోందనని భయం. ఓపక్క వైరస్‌ల పుట్టినింట్లో హెచ్ఎంపీ వైరస్ కల్లోలం సృష్టిస్తోందన్న ప్రచారం జరుగుతున్న సమయంలోనే.. అగ్రరాజ్యంలో నోరో వైరస్ వణికిస్తోంది. మరోవైపు పక్షులు, పశువులకే పరిమితమనుకునే బర్డ్‌ఫ్లూతో అమెరికాలో తొలిసారి ఒకరు మృత్యువాత పడ్డారు. అడవి పక్షులకు దగ్గరగా వెళ్లడంతో హెచ్5ఎన్1 సోకి ప్రాణాలు కోల్పోయాడు 65ఏళ్ల వ్యక్తి. వాస్తవానికి కరోనా తర్వాత ప్రపంచమంతా అంతగా చర్చ జరుగుతోంది హెచ్ఎంపీ వైరస్ గురించే. ఎక్కువగా చిన్నపిల్లలు, వృద్ధులు ఈ వైరస్ బారినపడుతున్నట్లు కథనాలొస్తున్నాయి. శీతాకాలం అంటువ్యాధులు త్వరగా ప్రబలుతుంటాయి. జలుబు, జ్వరం, దగ్గు, శ్వాసకోశ సంబంధిత సమస్యలు ఈ సీజన్‌లో సర్వసాధారణం. చాలామంది వీటికి ఏ టాబ్లెట్టో వేసుకుని ఉపశమనం పొందుతుంటారు. కానీ ఇప్పుడు కొంపదీసి కొత్త వైరస్సేమో అనే భయంతో ఆస్పత్రులకు పరుగులు పెడుతున్నారు. ఇమ్యూనిటీ సిస్టమ్ తక్కువగా ఉన్న పిల్లలు, వృద్ధులపై హెచ్ఎంపీ వైరస్ ప్రభావం ఎక్కువగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. పెద్దగా భయపడాల్సిన పన్లేదన్న మాట బలంగా వినిపిస్తున్నా.. కోవిడ్ 19కంటే తక్కువ ప్రమాదమేం కాదన్న వాదనకూడా వినిపిస్తోంది. ప్రస్తుతానికైనా ఈ వైరస్‌కి వ్యాక్సిన్ లేదు. అలాగని ఇదేం ఇప్పటికిప్పుడు పుట్టుకొచ్చిన వైరస్ కాదు. హెచ్ఎంపీ వైరస్ ప్రచారంతోనే జనం ఉక్కిరిబిక్కిరవుతుంటే.. మరోవైపు నోరో వైరస్ విజృంభిస్తోందన్న వార్తలు మరింత భయపెడుతున్నాయి. అమెరికాలో నోరో వైరస్ రోజురోజుకీ తీవ్రమవుతోంది. యూఎస్ సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ డేటా ప్రకారం ఆ దేశంలో నోరో వైరస్ కేసులు గణనీయంగా పెరుగుతున్నాయి. నవంబరు నుంచీ అగ్రరాజ్యంలో ఆ వైరస్ బాధితులు పెరుగుతున్నారు. నోరో వైరస్ జీర్ణకోశానికి సోకే వ్యాధి. బాధితులనుంచి నోరో వైరస్ ఇతరులకు వేగంగా సోకే అవకాశముంది. 12నుంచి 48 గంటల తర్వాత లక్షణాలు కనిపిస్తాయి. అతిసారం, వాంతులు, వికారం, కడుపు నొప్పి, జ్వరం, తలనొప్పి, బాడీ పెయిన్స్ ఉంటాయి. వైరస్ సోకిన రెండు రోజులపాటు తీవ్రత ఎక్కువగా ఉంటుంది. తర్వాత తగ్గుముఖం పడుతుంది. నోరో వైరస్ కూడా కొత్తదేం కాదు. అమెరికాకి ఇప్పుడు సోకింది కాబట్టే ప్రపంచం ఉలిక్కిపడుతోందంతే. గతంలోనే తెలుగురాష్ట్రాల్లో ఈ వైరస్ లక్షణాలపై ప్రజలను ప్రభుత్వాలు అప్రమత్తం చేశాయి. ఆరునెలల క్రితమే హైదరాబాద్‌లో 100కు పైగా కేసులు నమోదయ్యాయి. పాతబస్తీలో తొందరగా వ్యాప్తిచెందిన నోరో వైరస్‌పై అప్పట్లో జీహెచ్ఎంసీ ప్రజలను అప్రమత్తంచేసింది. వర్షాకాలంలో ప్రబలే వ్యాధుల జాబితాలోనే నోరో వైరస్ కూడా ఉంది. పారిశుద్ధ్యం, కలుషిత ఆహారంతోనే ఈ వైరస్ వ్యాప్తిచెందుతుందని గుర్తించారు. ముఖ్యంగా ఈ వైరస్ మధ్య వయస్కులు, వృద్ధులు, గర్భిణులు, కౌమారదశలో ఉన్న బాలికల్లో కిడ్నీ ఇన్ఫెక్షన్స్ కలిగిస్తుందని వైద్యులు చెబుతున్నారు. నోరో వైరస్ కంటే బర్డ్‌ఫ్లూనే ఇప్పుడు అందరినీ భయపెడుతోంది. ఓ పక్క ఈ మాయదారి రోగాలేంటని ప్రజలు తలపట్టుకుంటుంటే.. అటు మార్కెట్లు కూడా షేకవుతున్నాయి. చైనా తర్వాత భారత్‌ను తాకిన హెచ్ఎంపీవీపై ప్రపంచ ఆరోగ్య సంస్థ తొలి సారిగా స్పందించింది. ఈ వైరస్ ను సాధారణ వైరస్‌గా చిఊూ అభివర్ణించింది. హెచ్ఎంపీ వైరస్ అంటే హ్యూమన్ మెటాప్న్యూమోవైరస్ కొత్తది కాదని..దీనిని 2001లోనే గుర్తించామని సంస్థ తెలిపింది. ఇది చాలా కాలంగా ప్రజలలో ఉంది.. ఈ వైరస్ ప్రభావం శీతాకాలంలో పెరుగుతుందని పేర్కొంది. చైనాలో అనేక హెచ్ఎంపీ వైరస్ కేసులు నమోదయ్యాయి. ఆ తర్వాత ఈ వైరస్ కేసులు భారతదేశంలో కూడా వెలుగులోకి రావడం మొదలయ్యాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజల ఆందోళన మరింత పెరిగింది. ఈ వైరస్ కూడా కరోనా లాంటి వినాశనానికి కారణమవుతుందా అంటూ రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే ప్రజలు భయాందోళన చెందవద్దని ఇటీవల ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా విజ్ఞప్తి చేశారు. ఇప్పుడు చిఊూ కూడా ఈ విషయాన్ని స్పష్టం చేసింది. ప్రపంచంలో ఎక్కడ యుద్ధమేఘాలు కమ్ముకున్నా, ఎక్కడ ఏ వైరస్ వ్యాపించినా ముందు కుప్పకూలేది స్టాక్‌మార్కెట్లే. హెచ్ఎంపీ వైరస్ ప్రభావం ప్రజలపైనే కాదు.. ఇటు స్టాక్‌మార్కెట్లపైనా పడింది. దేశంలో కొత్త వైరస్ కేసులు వెలుగుచూడగానే భల్లూకపు కౌగిట్లో చిక్కుకుంది మన స్టాక్‌మార్కెట్. ఈ వారం రోజుల్లోనే దాదాపు 15లక్షలకోట్ల మేర మదుపరుల సంపద ఆవిరైంది.

# ఆ పది మందికి మంత్రులకు డేంజర్ బెల్స్

భారత శక్తి ప్రతినిధి

విజయవాడ, జనవరి 10, ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆర్నెల్లలోనే కొందరు మంత్రులతో ప్రభుత్వానికి తలనొప్పులు తప్పడం లేదు. పోలవరం, అమరావతి నిర్మాణానికి నిధుల వంటి విషయాల్లో ప్రభుత్వం సాధించిన విజయాల కంటే కొందరు మంత్రుల వ్యవహారాలకే జనంలో ఎక్కువ పబ్లిసిటీ లభించింది. ముఖ్యమంత్ర పదేపదే చెబుతున్నా వాటిని పట్టించుకోకుండా సాగిస్తున్న వ్యవహారాలతో చికాకులు తప్పడం లేదు. ఏపీలో టీడీపీ అధికారంలోకి రావడం అంత సులువుగా ఏమి జరగలేదు. ఐదేళ్లు ప్రతి పక్షంలో సవాళ్లు, అవమానాలు, కష్టాలని అధిగమించి అధికారంలోకి వచ్చారు. టీడీపీ అధ్యక్షుడు 53 రోజుల పాటు జైలు జీవితాన్ని కూడా అనుభవించాల్సి వచ్చింది. అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ నేతలు, ప్రజా ప్రతినిధులు ఆర్నెల్ల లోనే ఈ విషయాలు మర్చిపోయినట్టు వ్యవహరిస్తున్నారు. అవినీతి వ్యవహారాలకు దూరంగా ఉండాలని, ప్రజలు అన్ని గమనిస్తున్నారని ముఖ్య మంత్రి పదేపదే చెబుతున్నా కొందరి తీరు మాత్రం మారడం లేదు. ఆర్నెల్లలోనే దాదాపు పది మందికి పైగా మంత్రుల పని తీరుపై తీవ్ర ఆరోపణలు రావడం చర్చనీయాంశంగా మారింది. అదే సమయంలో వారి పేర్లపైనే ఎందుకు చర్చ జరుగుతోందనే వాదన కూడా లేకపోలేదు. ఇప్పటి వరకు ఆరోపణలు వచ్చిన వారంతా ఎస్సీ, బీసీ సామాజిక వర్గాలకు చెందిన వారే కావడం మరో రకమైన చర్చకు కారణం అవుతోంది. ఏపీ మంత్రుల్లో అందరి కంటే ముందు రవాణా మంత్రి రామ్ ప్రసాద్ రెడ్డి అందరికంటే ముందు వార్తల్లో నిలిచారు. మంత్రి భార్య ఎస్కార్ట్‌గా రాలేదని పోలీస్ అధికారిని దుర్భాషలాడటం చర్చనీయాంశం అయ్యింది. ఆ తర్వాత అదే బాటలో ఇతర మంత్రులు నడిచారు. ప్రస్తుతం ఉన్న మంత్రుల్లో చాలామంది తొలిసారి మంత్రి పదవుల్ని దక్కించుకున్న వారే ఉన్నారు. సీనియర్లను కాదని జూనియర్లకు మంత్రి పదవులు ఇస్తే వారంతా సొంత వ్యవహారాల్లో తలమునకలయ్యారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో మంత్రులంతా అదే ఫాలో అవుతున్నారు. ఏదొక వివాదాన్ని తలకు ఎత్తుకుంటున్నారు. రామ్ ప్రసాద్ రెడ్డి తర్వాత వాసం శెట్టి సుభాష్ వ్యవహార శైలిపై టీడీపీ అధినేత చేసిన కామెంట్లు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. సీనియర్లను కాదని టీడీపీల వాసంశెట్టి సుభాష్‌కు అవకాశం కల్పించడంతో సొంత పార్టీ నేతలు ఆయనకు వ్యతిరేకంగా మారారు. ఆ తర్వాత మంత్రి పార్ధ సారధి, హోంమంత్రి అనిత, రెవిన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, సివిల్ సప్లైస్ మంత్రి నాదెండ్ల, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఇలా ఒకరి తర్వాత ఒకరు కూటమి పార్టీల్లో నేతలు వార్తల్లో నిలిచారు. అయా శాఖల్లో అవినీతి వ్యవహారాలపై పత్రికల్లో ప్రముఖంగా కథనాలు రావడమో, మంత్రులు సంబంధం లేని వ్యవహారాల్లో తల దూర్చి బొప్పి కట్టించుకోడమో జరిగాయి. కొన్ని శాఖల్లో మంత్రులు శృతి మించి సంపాదనపై పడ్డారనే ప్రచారం జరగడంతో ప్రభుత్వానికి ఆర్నెల్లలోనే బోలెడు అప్రతిష్టను మూటగట్టేలా చేసింది. పోస్టింగులు, ప్రమోషన్లలో కొందరు మంత్రులు గల్లాలు తెరవడం, ఆ విషయాలు బయటకు పొక్కడం ప్రభుత్వాన్ని ఇరకాటంలో పడేలా చేసింది. అయితే మంత్రుల అవినీతి వ్యవహారాల్లో కొందరి పేర్లే ప్రముఖంగా బయట ప్రచారం జరగడం కూడా వ్యూహాత్మకమేనని భావన కూటమి పార్టీ నేతల్లో ఉంది. అయా పార్టీల్లో అంతర్గతంగా ఉన్న పరిస్థితులతో పాటు సమయం దాటిపోతే మళ్లీ అవకాశం వస్తుందో రాదోననే ఆందోళనతోనే మంత్రులు రెచ్చిపోతున్నారనే వాదన ఉంది. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిలో తాము చేసిన పొరపాట్లు, తప్పుల్ని కవర్ చేయడానికి కులం, సామాజిక కార్డులను తెరపైకి తీసుకురావడం కూడా అయా పార్టీలకు కొత్త చిక్కులకు కారణమవుతోంది. తాము మాత్రమే తప్పు చేస్తున్నామా, మిగతా వారు శుద్ధపూసలా తరహా చర్చలతో ప్రధానంగా టీడీపీ ఇరకాటంలో పడుతోంది. కీలక శాఖలు, బాధ్యతలన్నీ కొందరి చేతుల్లో ఉంటే నిధులు లేని, ప్రాధాన్యత శాఖలపై ప్రచారం ఏమిటని వాదిస్తున్నారు. దీంతో అటు ప్రభుత్వ ప్రతిష్టపై ప్రభావంతో పాటు కూటమి పార్టీల తీరుపై ప్రజల్లో చర్చ జరుగుతుందనే ఆందోళన వ్యక్తం అవుతోంది.

# తొక్కిసలాట వెనుక అనుమానాలు

భారత శక్తి ప్రతినిధి

తిరుపతి, జనవరి 10, తిరుపతిలో తొక్కిసలాట జరిగి ఆరుగురు మరణించిన ఘటన అందరినీ కలచి వేసింది. నిజంగా ఇది దురుదృష్టకరమే. కానీ ఇందులో గత ప్రభుత్వం నిర్వాకం కారణం కూడా ఉందన్నది వాస్తవం. గతంలో ఎన్నడూ లేని విధంగా 2019 నుంచి 2024 మధ్య కాలంలోనే తిరుమలలో ఈ నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. గతంలో వైకుంఠ ఏకాదశికి ఒకరోజు మాత్రమే వైకుంఠ ద్వార దర్శనం ఉండేది. అదీ కాకుంటే మరుసటి రోజు మధ్యాహ్నం వరకూ దర్శనాలు కొనసాగేవి. భక్తుల రద్దీని బట్టి వైకుంఠ ద్వార దర్శనాన్ని పొడిగించేవారు. కానీ గత ప్రభుత్వం దీనిని పూర్తిగా మార్చివేసింది. వైకుంఠ ద్వార దర్శనాన్ని పది రోజులకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. దీనివల్ల భక్తులకు సౌకర్యం కల్పించడం మాట దేముడెరుగు కానీ.. టీటీడీ ఆదాయాన్ని పొందడానికేనన్నది వాస్తవం. ఎంత మంది భక్తులు వస్తే అంత హుండీ నిండుతుందన్న కారణంతోనే అత్యాశతో గత ప్రభుత్వం ఈ ఆనవాయితీని తొలిసారిగా ప్రారంభించింది. తర్వాత వచ్చిన కూటమి ప్రభుత్వం దీనిని కంటిన్యూ చేసింది. దీంతో పాటు గత ప్రభుత్వం వైకుంఠ ద్వార దర్శనం టిక్కెట్లను తిరుపతిలో ఇచ్చే ప్రక్రియను కూడా ప్రారంభించింది. అసలు తిరుమలలో శ్రీవెకంటేశ్వరస్వామి కొలువై ఉంటే తిరుపతిలో టిక్కెట్లను ఎందుకు విక్రయిస్తున్నారన్నది ఆ వెంకటేశ్వరస్వామికే ఎరుక. ఈ సంప్రదాయాన్ని కూడా ఈ పాలకమండలి కంటిన్యూ చేయడంతోనే ఈ ఘోర దుర్ఘటన తలెత్తింది. నిజానికి తిరుమలలో ఎన్ని గంటలైనా భక్తులు వేచి చూస్తూ క్యూ లైన్ లో శ్రీవారిని దర్శంచుకునే వారు. అక్కడ తొక్కిసలాట సమస్య ఉండదు. బ్రహ్మోత్సవాల సమయంలోనూ తిరుమలకు లక్షల సంఖ్యలో గరుడ వాహన సేవరోజు వచ్చినా ఇలాంటి దుర్ఘటన ఎన్నడూ జరగలేదు. కారణంగానే ఈ ఘటన జరిగిందని చివరకు ముఖ్యమంత్రి చంద్రబాబు సయితం అంగీకరించారు. అది ఈ పాలకవర్గం చేసిన తప్పు అని ఆయన అభిప్రాయపడ్డారు. అదే సమయంలో మరొక అనుమానం కూడా అందరిలోనూ నెలకొంది. కావాలని ఈ దుర్ఘటనకు బాధ్యులు అయిన వారు పోలీసుల్లో ఉన్నారా? అన్న అనుమానం కూడా పాలకపక్షం నుంచి వ్యక్తమవుతుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ లు ఇదే రకమైన అనుమానాలను వ్యక్తం చేశారు. పోలీసులు పదకొండు వందల మంది అక్కడ ఉన్నప్పటికీ దుర్ఘటన జరిగిందంటే ఏదో బలమైన కారణం ఉండి ఉంటుందన్న వారి అనుమానాన్ని జ్యుడిషియల్ విచారణలోనే తేలనుంది. మొత్తం మీద తిరుపతి ఘటనపై జగన్ బ్యాచ్ చుట్టూ అనేక అనుమానాలు కలుగుతున్నాయి. అంటే పోలీసుల్లోనే జగన్ అంటే అభిమానం ఉన్న వారు ఈ పనికి పాల్పడ్డారా? అన్నది విచారణలో తేలనుంది. బుడమేరు విజయవాడను ముంచెత్తినప్పుడు కూడా ఇదే తరహా ఆరోపణలు వినిపించాయి. కృష్ణా బ్యారేజీ వద్ద బోట్లు అడ్డుకట్ట వేసి గేట్లు విరగేటట్లు కొందరు ప్రయత్నం చేశారని అప్పట్లో అధికార పార్టీ నేతలు ఆరోపించారు. ఆ బోటును అక్కడి నుంచి తొలగించడానికి పెద్ద యుద్ధమే చేయాల్సి వచ్చింది. అలాగే గేటును పునర్నించేందుకు అష్టకష్టాలు పడాల్సి వచ్చింది. ఇప్పుడు కూడా తిరుపతి ఘటనపై కూడా అలాంటి అనుమానాలు కలుగుతున్నాయని అధికార పార్టీ నేతలు చెబుతున్నారు. పోలీసులు కావాలనే తొక్కిసలాటకు కారణమయ్యారని ప్రత్యక్ష సాక్షులతోపాటు బాధితులు కూడా చెబుతున్నారని పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు ఈ అనుమానాలకు మరింత బలాన్ని చేకూరుస్తున్నాయి.

## మంథనిలో ఘనంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు

మంథని జనవరి 10, ంవైకుంఠ ఏకాదశి సందర్భంగా మంథని పట్టణంలోని శ్రీలక్ష్మీనారాయణస్వామి, శ్రీమంత్రకూట గోపి జన వల్లభ ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి వేడుకలు వైభవంగా నిర్వహించారు. శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి దేవాలయంతెల్లవారుజాము నుండే భక్తులతో నిండిపోయింది. ఉత్తర ద్వారం గుండా విష్ణుమూర్తి స్వరూపుడైన శ్రీలక్ష్మీనారాయణ స్వామి వారిని దర్శించుకునేందుకు శుక్రవారం తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాల దగ్గర బారులు తీరారు. ఆలయ అర్చకుడు ప్రసాదాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. ఈ రోజున మహా విష్ణువును దర్శించుకుంటే వైకుంఠ ప్రాప్తి లభిస్తుందని భక్తుల ఆచంచలమైన నమ్మకం. ఈ సందర్భంగా శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయాన్ని భక్తుల సహాయంతో సర్వంగ సుందరంగా పూలతో అలంకరించారు. దీంతో భక్తులు ఆలయంలో ఫోటోలు తీసుకునేందుకు ఆసక్తి చూపారు. శ్రీ లక్ష్మీనారాయణ స్వామి దేవాలయాన్ని శ్రీపాద ట్రస్ట్ చైర్మన్, ఐటీ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు సోదరుడు దుద్దిల్ల శ్రీనుబాబు సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. మంథని మున్సిపల్ చైర్మన్ పెంద్రు రమా సురేష్ రెడ్డి తో, పుర ప్రముఖులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అదేవిధంగా మంథని మండలం కన్నాల గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో సైతం వైకుంఠ ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉత్తర ద్వారం గుండా గ్రామస్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ఆలయ అర్చకులు ముఖేష్ శర్మ పూజలు నిర్వహించగా ఆలయ ఇన్చార్జ్ ముస్కుల జగ్గారెడ్డి, వీరేశం ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు.

# ఏడు నెలల కాలం... మౌనమేలేనోయి..

భారత శక్తి ప్రతినిధి

విజయవాడ, జనవరి10, నసేన అధినేత పవన్ కల్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా మారారు. వైసీపీని అధికారం నుంచి దించి కూటమి ప్రభుత్వాన్ని ఏపీలో తేవడంలో ప్రముఖ పాత్ర పోషించారు. అయితే పదేళ్ల నుంచి ప్రశ్నించడానికే వచ్చానన్న పవన్ కల్యాణ్ కేవలం జగన్ ను మాత్రమే ప్రశ్నిస్తూ పాలనలో లోపం జరిగినా, ప్రభుత్వ వైఫల్యం జరిగినా ఆయన పట్టించుకోవడం లేదు. ప్రశ్నించడం పూర్తిగా మానేసినట్లుందని నెట్టింట విమర్శలు వినిపిస్తున్నాయి. కేవలం పవన్ కల్యాణ్ పొగడ్తలకే పరిమితమయ్యారంటున్నారు. ఏడు నెలల కాలంలో కనీసం ప్రభుత్వాన్ని ప్రశ్నించిన పాపాన పోలేదన్న విమర్శలు ఆయన ఎదుర్కొంటున్నారు. పవన్ కల్యాణ్ అంటే సినీ హీరో గా అందరికీ అభిమానం ఉంటుంది ఆయన రాజకీయ రంగంలోనూ అలాగే వెలుగొందుతారని అభిమానులు నమ్మకం పెట్టుకున్నారు. అలాగే సొంత సామాజికవర్గమైన కాపులు కూడా ఎన్నికలకు ముందు పవన్ పై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కానీ పవన్ కల్యాణ్ అధికారంలోకి వచ్చిన తర్వాత వాయిస్ మాత్రం పూర్తిగా మ్యూట్ అయిపోయింది. ఏ ఘటన జరిగినా కనీసం ముందుగా స్పందించే పవన్ తన ప్రభుత్వంలో జరిగిన ఘటనలపై మాత్రం పెదవి విప్పకపోవడాన్ని విపక్షాలు సయితం ప్రశ్నిస్తున్నాయి. పార్టీ పదవుల విషయం సంగతి పూర్తిగా పక్కన పెట్టేశారని జనసేన నేతలే అంటున్నారు. నామినేటెడ్ పోస్టుల్లో కూడా తమకు అన్యాయం జరిగిందని నేతలు భావిస్తున్నారుఇదే సమయంలో తిరుపతి తొక్కిసలాట జరిగి గంటలు గడుస్తున్నా పవన్ కల్యాణ్ స్పందించకపోవడంపై నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. నీ ప్రశ్నలేమయ్యాయ్యా? అంటూ నిలదీస్తున్నారు. గేమ్ ఛేంజర్ ఈవెంట్ కు వచ్చి రోడ్డు ప్రమాదంలో అభిమానులు చనిపోతే గత వైసీపీ ప్రభుత్వం రోడ్లు వేయకపోవడమే కారణమని, అందుకే ప్రమాదం జరిగిందని అన్న పవన్ కల్యాణ్ తిరుపతి ఘటనపై ఎందుకు స్పందించడం లేదన్న ప్రశ్నలకు జనసేనాని వద్ద సమాధానం లేదు. ఆయన మౌనంగా ఉండటానికి కారణాలేంటని కూడా విపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. ఇటీవల హైదరాబాద్ లో పుష్ప సినిమా విడుదల సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో అందరినీ తప్పుపట్టిన పవన్ కల్యాణ్ ఇప్పుడు ఎందుకు మాట్లాడరని అడుగుతున్నారు. ఇక నిన్న విశాఖలో జరిగిన బహిరంగ సభలోనూ ప్రధాని మోదీని, ముఖ్యమంత్రి చంద్రబాబును పొగడ్తలతో ముంచెత్తడానికే పవన్ కల్యాణ్ ఎక్కువ సమయం గడిపారని, అదే సమయంలో విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ ఊసు కూడా ఎత్తలేదంటూ కార్మిక సంఘాలు అంటున్నాయి. గతంలో విపక్షంలో ఉన్నప్పుడు అప్పటి



వైసీపీ ప్రభుత్వమే ప్రయివేటీకరణకు కారణమని పదే పదే విమర్శలు చేయడమే కాకుండా విశాఖకు వెళ్లి కార్మికుల ఆందోళనకు మద్దతిచ్చిన పవన్ కల్యాణ్ కు ప్రధానిని సభలో ఆ విషయం అడగకుండా ఎందుకు ఉన్నారని కార్మిక సంఘాలు నిలదీస్తున్నాయి. అందుకే అధికారం అనేది ఎవరి చేతుల్లో ఉన్నా చేతులు, నోళ్లు మూతబడిపోతాయని అనుకోవడానికి పవన్ కల్యాణ్ ఉదాహరణ అని కామెంట్స్ వినపడుతున్నాయి.

## అమర్నాథ్ ఏం సాధించాడో చెప్పాలి

విశాఖపట్నం జనవరి 10, .తిరుమలలో తొక్కిసలా ట ఘటన దురదృష్టకరం అని రాష్ట్ర కో-ఆపరేటివ్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గండి బాబ్జి అన్నా రు. విశాఖ జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైజాగ్ నుంచి తిరుపతి లో జరిగిన ఘటనలో మృతిచెందిన వారి కుటుంబాలకు ప్రగాఢ సాను భూతి తెలియజేస్తున్నామని చెప్పా రు. మృతి చెందినవారి కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందని తెలిపారు. మోదీ పర్యటన లో సుమారు 2 లక్షల కోట్ల పెట్టుబడులకు శంకు స్థాపన చేశారు. ఈ పెట్టుబడులు మూడు నుంచి నాలుగు లక్షల ఉద్యోగాలు వస్తాయి అని అన్నారు. మోదీ శంకుస్థాపనలు చేసిన ప్రాజె క్టులకు గతంలోనే శంకుస్థాపన చేసామని వైసీపీ నాయకులు చెబు తున్నారని అన్నారు. గతంలో మంత్రిగా ఉన్న సమయంలో అమ ర్నాధ్ ఎం సాధించావో చెప్పాలని, డిమాండ్ చేశారు. సీఎం చంద్రబా బు, పవన్ కళ్యాణ్ లను విమర్శిం చే స్థాయి అమర్నాధ్ కు లేదని, కోడిగుడ్డు మంత్రిగా పేరుపొందిన అమర్ గత ఎన్నికలలోనే చుక్కలు చూపించారని, పంథా మార్చుకోక పోతే రాజకీయంగా కనుమరుగు అయిపోతావని పేర్కొన్నారు.

# దేశానికే తలమానికం...
# చిలకలూరిపేట బైపాస్ నిర్మాణం : మాజీమంత్రి

భారత శక్తి ప్రతినిధి

విజయవాడ, జనవరి10, దేశంలో ఎక్కడాలేని విధంగా చిలకలూరిపేట బైపాస్ నిర్మాణం జరిగిందని, కేంద్ర.. రాష్ట్ర ప్రభుత్వ సహాయసహకారాలతో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందిన మొట్టమొదటి జాతీయ రహదారిగా నిలిచిందని, నియోజకవర్గానికే మణిహారంగా నిలిచిన బైపాస్ ను స్వయంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ జాతికి అంకితం చేయడం రాష్ట్రప్రజలకే గర్వకారణమని మాజీ మంత్రి, చిలకలూరిపేట శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణ ట్రాఫిక్ సమస్యతో పాటు, చెన్నై ? కోల్ కతా జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనదారుల కష్టాల పరిష్కారం కోసం 2014 లోనే టీడీపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎన్నో ఏళ్లుగా చిలకలూరిపేట నియోజకవర్గ ప్రజలతో పాటు, చెన్నై-కోల్ కతా జాతీయ రహదారిపై రాకపోకలు సాగించే వాహనదారుల కష్టాలకు చెక్ పెట్టాలని, విపరీతంగా పెరిగిన ట్రాఫిక్ సమస్యను సరిదిద్దాలన్న సదుద్దేశంలో భాగంగా 2014లో నాటి టీడీపీ ప్రభుత్వం బైపాస్ విస్తీర్ణానికి నడుం బిగించింది. అప్పటికే 4 వరసలుగా ఉన్న జాతీయ రహదారిని 6 వరసలకు పెంచాలన్న ప్రతిపాదనను నాటి కేంద్రప్రభుత్వం ముందు ఉంచింది. రహదారి వెడల్పుతో ఒనగూరే ప్రయోజనాలను కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వశాఖకు, జాతీయ రహదారుల విభాగానికి అర్థమయ్యేలా తెలియచెప్పింది. రాష్ట్ర ప్రభుత్వ వివరణపై స్పందించిన కేంద్రం, జాతీయరహదారికి అనుబంధంగా ఒకసారి బైపాస్ నిర్మాణం చేపట్టాక దేశంలో ఇంతవరకు ఎక్కడా తమ సొంత నిధులతో భూసేకరణ జరిపి, మరలా దాన్ని విస్తరించిన దాఖలాలు లేవని, అలా చేయాలంటే జాతీయ రహదారుల చట్టాన్ని సవరించాలని స్పష్టం చేసింది. కేంద్రం వివరణపై స్పందించిన నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు రహదారి విస్తరణ అవసరాన్ని, ఆవశ్యకతను తెలియచేస్తూ పూర్తిస్థాయి సమాచారం అందించి, కేంద్ర కేబినెట్ లో చట్టసవరణ బిల్లు పెట్టించి, చిలకలూరిపేట బై పాస్ రహదారి నిర్మాణానికి ఉన్న అడ్డంకులు తొలగిపోయేలా చేశారు.

=====================

## రాజన్న ఆలయంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు

రాజన్న సిరిసిల్ల జనవరి 10,

తెలంగాణలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజ రాజేశ్వర స్వామి దేవస్థానంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు వైభవంగా జరిగాయి. సుప్రభాత సేవ అనంతరం స్వామివారికి ప్రాతఃకాల పూజ నిర్వహించిన ఆలయ అర్చకులు ఉత్సవ మూర్తులను పల్లకి సేవ లో ప్రతిష్ఠించిన అనంతరం భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. అనంతరం రంగురంగుల పూలతో అలంకరించిన అంబారి సేవపై శ్రీ పార్వతి రాజరాజేశ్వర స్వామి, శ్రీ లక్ష్మి అనంత పద్మనాభ స్వామి ఉత్సవ మూర్తులను ప్రతిష్ఠించి దేవాలయంలో మూడు ప్రదక్షిణలు చేసిన అనంతరం రాజగోపురం గుండా స్వామివారు బయటకు రాగానే వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ శర్మ, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, బిజెపి జిల్లా అధ్యక్షులు ప్రతాప రామకృష్ణ, ఆలయ ఈవో వినోద్ రెడ్డి లతో పాటు వేలాది భక్తులు పాల్గొన్నారు.

## యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో కన్నులపండుగగా వైకుంఠ ఏకాదశి వేడుకలు

వైకుంఠ ఏకాదశి పురస్కరించుకొని ఉత్తర ద్వారం ద్వారా గరుడ వాహనంపై దర్శనం ఇచ్చిన స్వామివారు

యాదాద్రి జనవరి 10,

శుక్రవారం ముక్కోటి ఏకాదశి కావడంతో వేకువజామునుంచే పెద్ద సంఖ్యలో భక్తులు యాదాద్రి కి చేరుకొని స్వామివారి ని ఉత్తర ద్వారం ప్రత్యేక క్యూ లైన్ మార్గమున దర్శించుకున్నారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పురస్కరించుకొని శ్రీ స్వామి వారు ఉదయం ఐదు గంటల 27 నిమిషాలకు వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య గరుడ వాహనంపై భక్తులకు ఉత్తర ద్వార దర్శనం ఇచ్చారు... ఉదయం నుండి భక్తులు ప్రత్యేక క్యూలైన్ధర ఉత్తర ద్వార నుండి శ్రీ స్వామివారిని దర్శించుకున్నారు.... భక్తులు ఇలాంటి ఇబ్బందిలే తలెత్తకుండా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాటు చేశారు...

స్వామి వారి ఉత్తర ద్వార దర్శనంలో ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, ఆలయ చైర్మన్ నరసింహమూర్తి, పాలు ఈఓ భాస్కరరావు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు...

## అమలాపురంలో వైభవంగా ముక్కోటి ఏకాదశి.. పెళ్లిళ్ల వెంకన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు..

అమలాపురం జనవరి 10,

అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం లో ముక్కోటి ఏకాదశి సందర్భంగా వేంకటేశ్వరా స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఉత్తర ద్వారం ద్వారా స్వామివారిని దర్శించుకున్నారు. కళ్యాణ వేంకటేశ్వస్వామి గా పేరొందిన వెంకటేశ్వర స్వామి ఆలయం కావడంతో దర్శనానికి భక్తజనంపోటెత్తింది. భారీగా ఏర్పడిన క్యూ లైన్లు, భక్తులకు అలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని చర్యలు ఆలయ అధికారులు చేపట్టారు. భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి క్యూ లైన్లలో భక్తులకు దర్శనం కల్పించారు.

## రాజన్న జిల్లాలో బాలిక కిడ్నాప్..

రాజన్న సిరిసిల్ల జనవరి 10,

వేములవాడలో జరిగిన బాలిక కిడ్నాప్ కేసు సుఖాంతమైంది. బాలిక కిడ్నాప్ కేసు ఎలాంటి ఆధారాలు లేకపోయినా సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు.

శుక్రవారం సిరిసిల్లలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ వివరాల ను తెలిపారు. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం చింతపల్లి గ్రామానికి చెందిన సింగారపు మధు, లాస్య దంపతులకు ఇద్దరు కుమార్తెలున్నారు.

లాస్యకు మతిస్థిమితం లేకపోవడంతో మధు కుటుంబానికి దూరంగా ఉంటూ వస్తున్నాడు. లాస్య తన కూతురు అద్విత తో కలిసి వేములవాడ రాజరాజేశ్వర స్వామి దర్శ నానికి వచ్చింది. దర్శనం కోసం వచ్చిన మహబూబా బాద్‌కు చెందిన ముగ్గురు మహిళలతో చనువు ఏర్పడింది.

ఐదు రోజులుగా ఆలయ ఆవరణలో నిద్ర చేస్తూ మొక్కులు తీర్చుకున్నారు. ఈ క్రమంలో పాప తల్లి మతిస్థిమితం లేకపోవడం కారణంగా పాపను సరిగ్గా చూసుకోవడం లేదని గమనించిన ముగ్గురు మహిళలు లాస్యను నమ్మించి గత డిసెంబర్ 23వ తేదీన వారితో పాటు తీసుకువెళ్లారు.పాప అదృశ్యం కావడంతో తన మేనమామ పాలమూరు గంగస్వామి వేములవాడ టౌన్ లో గత ఏడాది 30వ తారీఖున పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.ఎలాంటి ఆధారాలు లేనప్పటికీ ఈ కేసును చాలెంజ్ గా తీసుకున్న పోలీసులు జిల్లా ఎస్పీ అఖిల్ మహజన్ ఆధ్వర్యంలో వేములవాడ సిఐ వీర ప్రసాద్,లు పోలీస్ సిబ్బందితో కలిసి, ఏడు స్పెషల్ టీం గా ఏర్పడి సాకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ. వేముల వాడ బస్టాండు రైల్వేస్టేషన్లో సిసి ఫుటేజ్ పరిశీలించి, మహబూబాబాద్ జిల్లాలోని ఓ గ్రామం లో పాప ఉన్నట్లు గుర్తించారు.

# వరంగల్‌లో ఆన్ లైన్ మోసం

భారత శక్తి ప్రతినిది



వరంగల్, జనవరి 10, ఆన్ లైన్ ఎగ్జామ్ సెంటర్ ఏర్పాటు పేరున వరంగల్ నగర శివారులోని ఓ ప్రముఖ కాలేజీని సైబర్ కేటుగాళ్లు మోసం చేయగా.. సంబంధిత కాలేజీ ప్రిన్సిపల్ సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.వరంగల్ నగర శివారులోని ఓ ప్రముఖ కాలేజీ మెయిల్ ఐడీకి 2024 సెప్టెంబర్ 18న గవర్నమెంట్ జాబ్స్, ఇతర ఆన్ లైన్ ఎగ్జామ్స్ కండక్ట్ చేసేందుకు సెంటర్ ఏర్పాటు కోసం బెంగళూరుకు చెందిన ఓ ప్రముఖ కంపెనీ నుంచి మెయిల్ వచ్చింది.బెంగళూరు కు చెందిన సంస్థ, కాలేజీతో కలిసి సంయుక్తంగా ఆన్ లైన్ ఎగ్జామ్స్ నిర్వహించేందుకు అంగీకారం కోసం మెయిల్ పంపించగా.. ఇక్కడి కాలేజీ యాజమాన్యం అందుకు ఓకే చెప్పింది. దీంతో అవతలి వైపు నుంచి పరీక్షల నిర్వహణ కోసం అప్లికేషన్ ఫామ్ ను మెయిల్ ద్వారానే పంపించగా.. దానిని కాలేజీ యాజమాన్యం ఫిల్ చేసి తిరిగి అదే మెయిల్ ఐడీకి పంపించేశారు.ఆ తరువాత ఎగ్జామినేషన్ సెంటర్ అగ్రిమెంట్ కోసం డాక్యుమెంట్స్ పంపించాల్సిందిగా కోరడంతో కాలేజీ యాజమాన్యం ఆ పని కూడా పూర్తి చేసింది.కాలేజీ యాజమాన్యం ఎగ్జామినేషన్ సెంటర్ నిర్వహణకు అగ్రిమెంట్ కాపీలు పంపించగా. రిజిస్ట్రేషన్ కోసం రిఫండబుల్ ఫీజు పేరున రూ.42,600 పంపాల్సిందిగా అవతలి నుంచి రిప్లై వచ్చింది. దీంతో వారు చెప్పిన ప్రకారం కాలేజీ యాజమాన్యం అమౌంట్ పంపించింది. ఆ తరువాత కాలేజీ బిల్డింగ్ ప్లాన్, ఓనర్ షిప్ డాక్యుమెంట్స్, కరెంట్ బిల్, ఇంటర్నెట్ కనెక్షన్ వివరాలు సేకరించి, గత డిసెంబర్ నెలలో ఎగ్జామినేషన్ ఎక్విప్ మెంట్ సంయుక్తంగా కొనుగోలు చేయాల్సి ఉంటుందని, అందుకు రూ.2.95 లక్షలు పంపించాల్సిందిగా కోరడంతో కాలేజీ అకౌంట్ నుంచి పంపించారు.తరువాత అదే నెలలో ఎక్విప్ మెంట్, ఫర్నిచర్ ట్రాన్స్ పోర్ట్ కోసం రూ.79 వేలు , ఫర్నిచర్ ఇన్సురెన్స్ పేరున రూ.2.6 లక్షలు పంపించాల్సిందిగా మళ్లీ మెయిల్ చేయడంతో ఆ మొత్తాన్ని కూడా వారు చెప్పిన అకౌంట్ కు బదిలీ చేశారు. ఇంతవరకు బాగానే ఉండగా, ఆ తరువాత సంబంధిత కంపెనీ నుంచి కాలేజీ యాజమాన్యానికి ఎలాంటి ఫోన్ కానీ, మెయిల్ కానీ రాలేదు.ఇదివరకు కాలేజీ యాజమాన్యానికి కాల్స్ వచ్చిన ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసినా కలవకపోవడంతో సంబంధిత వివరాలు జోడించి ఈ నెల 6వ తేదీన పోలీసులకు కాలేజీ ప్రిన్సిపల్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బీఎన్ఎస్ 318(4), ఐటీ యాక్ట్ 66డీ సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

# కమిటీ లేకుండానే ఐనవోలు జాతర

(భారత శక్తి ప్రతినిది



వరంగల్, జనవరి 10, రాష్ట్రంలో ప్రముఖ శైవ క్షేత్రమైన ఐనవోలు మల్లికార్జునస్వామి మహా జాతరకు సమయం ఆసన్నమైంది. ఇంకో మూడు రోజుల్లోనే స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఏటా సంక్రాంతి నుంచి ప్రారంభమయ్యే ఈ జాతరకు భోగి నుంచి కనుమ రోజుల్లోనే దాదాపు 10 లక్షల మంది వరకు భక్తులు వచ్చే అవకాశం ఉంటుంది.రద్దీ తగ్గట్టుగా ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యతను ఆలయ పాలకవర్గం తీసుకోవాల్సి ఉంటుంది. కానీ గత మూడేళ్ల నుంచి ఐనవోలు ఆలయ ట్రస్ట్ బోర్డు వ్యవహారంలో కోర్టు కేసులో చిక్కుకోవడంతో ఇప్పటి వరకు పాలకవర్గ ఏర్పాటుపై ఎలాంటి క్లారిటీ రాలేదు. ఇదిలాఉంటే కొంతమది నాయకులు తావే పాలకవర్గ సభ్యులమంటూ చెప్పుకుంటుండగా.. అధికారులు మాత్రం అధికారికంగా కమిటీ మాత్రం ప్రకటించలేదు. దీంతో ట్రస్ట్ బోర్డు ఉన్నట్టా.. లేనట్టా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.2023 జాతర సమయంలో జనవరి 10 తేదీన దేవాదాయశాఖ ప్రకటించిన ట్రస్ట్ బోర్డు కారణంగా ఆలయంలో వివాదం చెలరేగింది. అప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా.. అప్పటి ఎమ్మెల్యే అరూరి రమేష్ తనకు సన్నిహితుడిగా ఉండే మజ్జిగ జయపాల్కు ఆలయ చైర్మన్ ఇస్తానని గతంలో హామీ ఇచ్చారు. ఈ మేరకు 14 మంది సభ్యులను ఎంపిక చేసి ట్రస్ట్ బోర్డు ఏర్పాటుకు ప్రపోజల్స్ పంపించారు. ఆ తరువాత జనవరి 10న దేవాదాయ శాఖ ట్రస్ట్ బోర్డును ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.ఇందులో మజ్జిగ జయపాల్ కు చైర్మన్ పదవి హామీ ఉండగా.. ఆయనే చైర్మన్ గా ఎన్నుకునేందుకు అంతా రంగం సిద్ధం చేశారు. కానీ ఎండోమెంట్ యాక్ట్ ప్రకారం ఆలయంలో వాటాదారుగా ఉన్న వ్యక్తులకు ట్రస్ట్ బోర్డు సభ్యులుగా అవకాశం ఇవ్వకూడదు. కానీ రూల్ ను పట్టించుకోకుండా ఆలయంలో వాటాదారుగా ఉన్న జయపాల్ కు చైర్మన్ పదవి ఇచ్చేందుకు కసరత్తు చేయడంతో హనుమకొండకు చెందిన పైళ్ల శ్రీనివాస్ అనే వ్యక్తి రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు. దీంతో దేవాదాయశాఖ ప్రకటించిన ట్రస్ట్ బోర్డు చెల్లదంటూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికీ దానిపై విచారణ జరుగుతుండగానే గత ఆగస్టు 30న దేవాదాయ శాఖ నూతన ధర్మకర్త మండలి ఎంపికకు దరఖాస్తులు ఆహ్వానించింది.దీంతో కోర్టులో కేసు కొనసాగుతుండగా.. నూతన పాలకవర్గం ఎంపికకు దరఖాస్తులు ఆహ్వానించడం సరికాదని, అలా కాదని ఎంపిక చేపడితే తాము కోర్టు నుంచి సవాల్ చేస్తామంటూ అప్పట్లో వివాదంలో చిక్కుకున్న కమిటీ సభ్యులు దేవాదాయ శాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కోర్టు తీర్పు వెలువడే వరకు ట్రస్ట్ బోర్డు ఎంపిక వాయిదా వేయాలని అటు ప్రభుత్వ పెద్దలతో పాటు ఆఫీసర్లు కూడా నిర్ణయానికి వచ్చారు. కాగా 2023 జాతర నుంచి ట్రస్ట్ బోర్డుపై వివాదం నడుస్తుండగా.. ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది.ఐనవోలు మల్లికార్జునస్వామి జాతర సంక్రాంతి నుంచి ప్రారంభమై ఉగాది వరకు కొనసాగుతుంది. భోగి పండుగ నుంచి ఉత్సవాలు ప్రారంభం కానుండగా.. భోగి, సంక్రాంతి, కనుమ రోజుల్లో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి వస్తుంటారు. కేవలం ఈ మూడు రోజుల్లోనే దాదాపు 10 లక్షల మందికిపైగా భక్తులు తరలి వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు.ఇంత పెద్ద ఎత్తున భక్తుల తరలివచ్చే జాతరలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాటు చేయడంలో పాలకవర్గానిదే కీలకపాత్ర. కానీ ట్రస్ట్ బోర్డు విషయం కోర్టు పరిధిలో ఉండటంతో టెంపరరీగా జాతర కమిటీ వేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ఈ మేరకు వర్ధన్నపేటకు చెందిన వ్యక్తిని జాతర కమిటీ చైర్మన్ గా ప్రకటించేందుకు ఎమ్మెల్యే వర్గం పావులు కదుపుతున్నట్లు తెలిసింది. కాగా అదే కమిటీ ట్రస్ట్ బోర్డుగా ఉంటుందని స్థానికంగా ప్రచారం కూడా జరుగుతోందిప్రతిసారి జాతర సమయంలో మరుగుదొడ్లు, మూత్రశాలలు, తాగునీరు తదితర వసతులు సరిగా లేక భక్తులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. జాతర సమయంలో టెంపరరీ టాయిలెట్స్ ఏర్పాటు చేస్తున్నా అవి కూడా జనాలకు సరిపోవడం లేదు. దాంతో జాతరలో శానిటేషన్ కూడా ప్రధాన సమస్యగా మారింది.ప్రతిసారి పంచాయతీలు, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ శానిటేషన్ సిబ్బంది దాదాపు 500 మందితో పనులు చేయిస్తున్నా.. అక్కడ సేవలందలేని పరిస్థితి నెలకొంటోంది. దీంతో ఈసారి కూడా జాతర సమయంలో భక్తులు ఇబ్బందులు తప్పవనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఓ వైపు పాలకవర్గం లేకపోవడం, ఆఫీసర్లపైనే భారమంతా పడుతుండటం ఇబ్బందిగా మారగా.. అదనపు సిబ్బందిని కేటాయించి భక్తులకు సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.

## వైకుంఠ ఏకాదశి ప్రత్యేక పూజల్లో ఎంపీ గడ్డం వంశీ కృష్ణ

భారత శక్తి ప్రతినిది

పెద్దపల్లి జనవరి 10, వైకుంఠ ఏకాదశి సందర్భంగా పెద్దపల్లి పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీ కృష్ణ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్న ఎంపీ ప్రజల శ్రేయస్సు, పాడి పంటల సమృద్ధి, సుఖ సంతోషాల కోసం ప్రార్థించినట్లు తెలిపారు.

ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు ఎంపీ శాలువాతో సత్కరించి, స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం పెద్దపల్లి ప్రజల ఆధ్యాత్మిక జీవనంలో ముఖ్యమైనదిగా వెలుగొందుతున్నాదన్నారు. ఈ ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు తన ఎంపీ లాడ్స్ నిధులను వినియోగిస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## జియాగూడ రంగనాధ ఆలయంలో భక్తుల ఇక్కట్లు

భారత శక్తి ప్రతినిది


హైదరాబాద్ జనవరి 10, వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని జియాగూడలోని ప్రసిద్ధ రంగనాథ స్వామి దేవాలయంలో తెల్లవారుజామున రెండు గంటల నుండి భక్తులకు వెంకటేశ్వర స్వామి దర్శనం ఇచ్చారు. పోలీసులు, వాలంటీర్లపై సాధారణ భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జియాగూడ రంగనాథస్వామి కేవలం విఐపి లకే పరిమితం అయ్యారని పోలీసులకు, వాలంటీర్లకు తెలిసిన వారైనా పంపిస్తున్నారని చిన్నపిల్లలను పెట్టుకుని తెల్లవారుజామున రెండు గంటల నుండి సుమారు మూడు గంటల పాటు లైన్లో నిలపడ్డ స్వామి దర్శనం వారికి దక్కడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీస్ ఉన్నతాధికారులు పోలీసులపై దృష్టి పెట్టాలని కోరారు.

## బస్సులో సీట్లకోసం మహిళల సిగపట్లు

భారత శక్తి ప్రతినిది

వనపర్తి జనవరి 10,ఖిల్లా ఘణపురం మండల కేంద్రంలోని బస్టాం డ్ వద్ద గురువారం సాయంత్రం వన పర్తికి వెళ్లే బస్సు ప్రయాణంలో మహిళలు గొడవ పడ్డారు. చీపుర్లు, కట్టెలతో కొట్టుకునే వరకు వచ్చింది. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో బస్సుల్లో మహిళల రద్దీ పెరిగింది. బస్సు ల్లో సీట్ల కోసం దొంతికుంట తండా మహిళలు తొందరపడి ఎక్కడానికి ప్రయత్నిస్తుండగా మండల కేంద్రానికి చెందిన ఓ మహిళ గంప ఎత్తుకొని దిగుతూ ఒకరినొకరు తోసుకోవడంతో గొడవ జరిగింది. మండల కేంద్రానికి చెందిన మహిళ గిరిజన మహిళపై కట్టెతో దాడి చేసింది. అక్కడే ఉన్న కొంత మంది మహిళలు చీపుర్లతో ఎదురుదాడికి దిగారు...సిగలు పట్టుకొని కొట్టుకున్నారు...దీంతో గొడవ మరింత పెద్దది కావడంతో అక్కడే ఉన్న ప్రయాణికులు అసహనం వ్యక్తం చేశారు. ఉచిత ప్రయాణ పథకంతో బస్సుల్లో మహిళల రద్దీ ఎక్కువయ్యిందని, అందుకు తగినట్లు బస్సుల సంఖ్యను పెంచలేదని, అందువల్లే తరచూ గొడవలు జరుగుతున్నాయని అభిప్రాయపడ్డారు. సీట్లు సరిపోకపోవడంతో మహిళలతో పాటు, పురుషులు కూడా ఇబ్బంది పడ్తున్నారని చర్చించుకున్నారు. మహిళలు గొడవకు సంబంధించిన వీడియోలు వాట్సాప్ గ్రూపులో వైరల్ కావడం మండలంలో చర్చనీయాంశంగా మారింది... చివరకు స్థానికులు వారిని శాంతింపచేశారు.

# టార్గెట్ కేసీఆర్... రేవంత్ వ్యూహం అదేనా



హైదరాబాద్, జనవరి 10. తెలంగాణలో ఎన్నికలు ముగిసి ఏడాది గడిచినా.. అధికార కాంగ్రెస్, విపక్ష బీఆర్ఎస్ మధ్య మాటల యద్ధం ఆగడం లేదు. సీఎంగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన వెంటనే కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతిపై కమిషన్ వేవారు. తర్వాత విద్యుత్ కొనుగోలు ఒప్పందంపైనా విచారణ కమిషన్‌ను నియమించారు. ఇదే సమయంలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం వెలుగు చూసింది. వీటితో రేవంత్ సర్కార్ కేసీఆర్‌తోపాటు కేటీఆర్, హరీశ్‌రావును ఇరుకున పెట్టాలని భావిస్తోంది. అయితే ఏడాదిగా చేస్తున్న ప్రయత్నాలు కొలిక్కి రావడం లేదు. తాజాగా ఫార్ములా ఈ రేసు కేసులో కేటీఆర్ విదేశీ సంస్థకు చెల్లించిన రూ.56 కోట్ల వ్యవహారంలో ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. విచారణకు పిలిచింది. అనేక ట్విస్టుల తర్వాత కేటీఆర్ విచారణకు హాజరయ్యారుఎన్నికలు జరిగి ఏడాది గడిచినా.. బీఆర్ఎస్ శాసన సభా పక్ష నేతగా ఎన్నికైన కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదు. రేవంత్ ముందు తాను ప్రతిపక్షంలో కూర్చోలేకనే రావడం లేదన్న వాదన ఉంది. గతంలో కాలు విరిగిందని సాకులు చెప్పిన గులాబీ నేతలు ఇప్పుడు కేసీఆర్ గైర్హాజర్‌పై నోరు మెదపడం లేదు. అసెంబ్లీలో కేటీఆర్, హరీశ్‌రావే అన్నీ చూసుకుంటున్నారు. అయితే సీఎంగా రేవంత్ ఉన్న నేపథ్యంలో ఆయన ఎదుట ప్రతిపక్ష నేతగా అసెంబ్లీలో కూర్చోవడం ఇష్టం లేకనే రావడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు కేసీఆర్‌ను ఫామ్‌హౌస్ నుంచి బయటకు రప్పించడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పావులు కదుపుతోంది. ఇందులో భాగంగానే ఈ ఫార్ములా కేసులో కేటీఆర్‌ను అరెస్టు చేయడానికి రంగం సిద్ధం చేసింది. మరోవైపు హరీశ్‌రావును కూడా కాళేశ్వరం కేసులో ఇరికించే అవకాశం ఉంది. ఈ చర్యలతో అయినా కేసీఆర్ బయటకు వస్తారని భావిస్తోంది.ఇదిలా ఉంటే కేసీఆర్ అసెంబ్లీకి ఎందుకు రావడం లేదని సీఎం రేవంత్‌రెడ్డి తరచూ ప్రశ్నిస్తున్నారు. పదేళ్లు సీఎంగా పనిచేసిన కేసీఆర్ సూచనలు తమకు అవసరమని వ్యంగ్యంగా వ్యాఖ్యానిస్తున్నారు. 80 వేల పుస్తకాలు చదివిన కేసీఆర్ అసెంబ్లీకి ఎందుకు రావడం లేదని, తెలంగాణ ప్రగతికి ఆయన తెలివి ఎందుకు ఉపయోగించడం లేదని నిలదీస్తున్నారు. మరోవైపు తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్ ఇంటికి మంత్రి పొన్నం ప్రభాకర్ వెళ్లారు. స్వయంగా కార్యక్రమానికి ఆహ్వానించారు. ఇక మాజీ ప్రధాని మన్‌మోహన్‌సింగ్‌కు నివాళు లర్పించేందుకు ఏర్పాటుచేసిన అసెంబ్లీ ప్రత్యేక సమావేశానికి రావాలని స్పీకర్ గడ్డం ప్రసాద్ కేసీఆర్‌కు స్వయంగా ఫోన్ చేసి ఆహ్వానించారు. అయినా కేసీఆర్ ఫామహౌస్ దాటలేదు.కొడుకు కేటీఆర్ అరెస్ట్ అయ్యే అవకాశం ఉంది. హరీశ్‌రావును కూడా ఏదో ఒక కేసులో అరెస్టు చేయవచ్చన్న చర్చ జరుగుతోంది. అదే జరిగితే పార్టీ బాధ్యతలు ఎవరు చూస్తారన్న చర్చ ఇప్పుడు బీఆర్ఎస్‌లో జరుగుతోంది. ఇలాంటి తరుణంలోనే కేసీఆర్ కూతురు కవిత నేనున్నానంటూ మళ్లీ యాక్టివ్ అయ్యారు. అయితే ఢిల్లీ లిక్కర్ కేసులో నిందితురాలిగా ఉన్న కవిత పార్టీ బాధ్యతలు నిర్వహించడంపై పార్టీలోనే కొందరు విముఖంగా ఉన్నారు. ఈ క్రమంలో కేసీఆర్ ఫాంహౌస్ వీడతారా లేదా అన్నది చర్చనీయాంశంగా మారింది. కేసీఆర్ రాకుంటే క్యాడర్ చీలిపోయే ప్రమాదం ఉంది. పార్టీకి తీవ్ర నష్టం కలుగుతుంది.

# ఇండియా కూటమి రద్దేనా

భారత శక్తి ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 10, భారత కూటమిలో వచ్చిన బీటలు ఇప్పుడిప్పుడే బయటపడ్డాయి. ఆర్జేడీ నాయకుడు తేజస్వి యాదవ్ తర్వాత, ఇప్పుడు నేషనల్ కాన్ఫరెన్స్ నాయకుడు, జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఇండియా బ్లాక్ ఉనికి గురించి ప్రశ్నలు లేవనెత్తారు. ఇందులో ఎజెండా లేదా నాయకత్వం లేదని ఒమర్ అబ్దుల్లా అన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల తర్వాత కూటమి సభ్యులందరినీ సమావేశానికి పిలవాలని ఆయన అన్నారు. ఈ కూటమి లోక్‌సభ ఎన్నికలకే పరిమితమైతే దానిని త్వరలో ముగించాలన్నారు. కానీ అది అసెంబ్లీ ఎన్నికలు కూడా అయితే, మనం కలిసి కూర్చుని కలిసి పనిచేయాల్సి ఉంటుందని అబ్దుల్లా ఇక్కడ విలేకరులతో అన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఇండియా బ్లాక్‌లో చీలిక తెరపైకి వచ్చింది. సమాజ్‌వాదీ పార్టీ, తృణమూల్ కాంగ్రెస్, ఎన్‌సిపి సహా అనేక పార్టీలు కాంగ్రెస్‌ను దాటవేసి ఆప్‌కు మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించాయి. ఇండియా బ్లాక్ ఉనికి గురించి ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇండియా బ్లాక్ లోక్‌సభ ఎన్నికలకు మాత్రమే అని ఆర్జేడీ నాయకుడు తేజస్వి యాదవ్ చేసిన ప్రకటనపై స్పందిస్తూ, తనకు గుర్తున్నంత వరకు దానికి ఎటువంటి కాలపరిమితి నిర్ణయించబడలేదని నేషనల్ కాన్ఫరెన్స్ నాయకుడు అన్నారు. సమస్య ఏమిటంటే ఇండియా బ్లాక్ సమావేశాన్ని పిలవలేదు. ప్రధాన నాయకత్వం, పార్టీ లేదా భవిష్యత్తు వ్యూహం (ఇండియా బ్లాక్‌లో) ఎజెండా గురించి స్పష్టత లేదని ఆయన పేర్కొన్నారు. పొత్తు కొనసాగుతుందా లేదా అనేది కూడా స్పష్టంగా లేదు. బహుశా ఢిల్లీ ఎన్నికల తర్వాత, ఇండియా బ్లాక్ సభ్యులను సమావేశానికి పిలిపించి, అప్పుడు పరిస్థితి స్పష్టమవుతుందని అబ్దుల్లా అన్నారు. వచ్చే నెలలో జరగనున్న ఢిల్లీ ఎన్నికలకు ముందు ఆప్ కు పెరుగుతున్న మద్దతు గురించి



మరొక ప్రశ్నకు సమాధానమిస్తూ, "ఢిల్లీ ఎన్నికలతో మాకు ఎటువంటి సంబంధం లేదు కాబట్టి నేను ఇప్పుడే దాని గురించి ఏమీ చెప్పలేను" అని అబ్దుల్లా అన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ, కాంగ్రెస్, ఇతర రాజకీయ పార్టీలు బిజెపిని ఎలా బలంగా ఎదుర్కోవాలో నిర్ణయిస్తాయి. గతంలో కూడా ఢిల్లీలో ఆప్ రెండుసార్లు విజయం సాధించిందని అబ్దుల్లా పేర్కొంటూ, "ఈసారి ఢిల్లీ ప్రజలు ఏమి నిర్ణయిస్తారో వేచి చూడాలి" అని అన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఇండియా అలయన్స్ ఓటమి తర్వాత, ఇండియా అలయన్స్ ఉనికి గురించి ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నాయకత్వం గురించి ప్రశ్న లేవనెత్తుతూ ఇండియా బ్లాక్‌కు నాయకత్వం వహించడానికి తాను సిద్ధంగా ఉన్నానని చెప్పారు. ఆ తర్వాతే ఇండియా బ్లాక్ గురించి చర్చ మొదలైంది.

మోడీ చెప్పినట్టుగానే...

ఇండియా కూటమికి బీటలు వారాయి అని వార్తలు వస్తున్న నేపథ్యంలో.. జమ్ము కాశ్మీర్ ముఖ్యమంత్రి ఓమర్ అబ్దుల్లా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇండియా కూటమిలో ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా వ్యవహార సాగుతోందని మండిపడ్డారు. పార్లమెంట్ ఎన్నికల వరకే ఇండియా కూటమి అని అనుకుంటే తప్పనిసరిగా దాని మూసివేయాలన్నారు. ఎన్నికల్లో పోటీ చేయడానికి వ్యూహాలు రచించకపోవడం.. ఒకవేళ అవి రచించినా అమల్లో పెట్టకపోవడం అత్యంత దారుణమని పేర్కొన్నారు. మరోవైపు రాష్ట్రీయ జనతా నేత తేజస్వి యాదవ్ ఇండియా కూటమిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. కేవలం పార్లమెంటు ఎన్నికల వరకే ఇండియా కూటమి ఉంటుందని ఆయన వ్యాఖ్యానించారు. పార్టీలు తమ అవసరాల దృష్ట్యా స్థానిక ఎన్నికల్లో పోటీ చేయవచ్చని పేర్కొన్నారు. కలిసి పోటీ చేయాలని సందర్భం వచ్చినప్పుడు.. ఒంటరిగానే ఎన్నికల బరిలో ఉండి.. తమ సామర్థ్యాన్ని నిరూపించుకోవచ్చని పేర్కొన్నారు. తేజస్వి యాదవ్ ఈ వ్యాఖ్యలు చేయడంతో? జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి ఓమర్ అబ్దుల్లా ఈ వ్యాఖ్యలు చేయడం విశేషం. " ఇండియా కూటమికి బీటలు వారాయి. ఇకపై ఆ కూటమి ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లేదు. ఈ లెక్కన చూస్తే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేసిన వ్యాఖ్యలు నిజమవుతున్నాయి. ఇవే గనుక మునుముందు కొనసాగితే దేశంలో బలమైన ప్రతిపక్షం అంటూ ఉండదు. మోడీ ఆడుతున్న గేమ్లో ఇండియా కూటమి చిక్కి విలవిలలాడిపోవడం అత్యంత దారుణమని" రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

# ఈ ఏడాది ఇంటర్ పరీక్షలు..
# వచ్చే ఏడాది నుంచి రద్దు

భారత శక్తి ప్రతినిధి

విజయవాడ, జనవరి 10, తాజాగా ఇంటర్మీడియట్ విద్యామండలి కొత్తగా ప్రతిపాదించిన సంస్కరణల గురించి వెల్లడించిన సంగతి తెలిసిందే. ఇంటర్ ఫస్ట్ ఇయర్ పబ్లిక్ పరీక్షలు రద్దు చేస్తున్నట్లు సంచలన ప్రకటన చేసింది. అయితే ఈ విధానం వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు చేయనున్నట్లు స్పష్టం చేసింది. పబ్లిక్ పరీక్షలకు బదులుగా అంతర్గత పరీక్షల విధానం వచ్చే ఏడాది నుంచి ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు అమల్లోకి వస్తుందని ఇంటర్ బోర్డు పేర్కొంది. అయితే ఈ ఏడాది మార్చిలో జరిగే పబ్లిక్ పరీక్షల్లో ఎలాంటి మార్పు ఉండబోదని, విద్యార్థులందరూ పరీక్షలకు సిద్ధమవ్వాలని సూచించింది. ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో కళాశాల స్థాయిలో నిర్వహించే పరీక్షల్లో తప్పనిసరిగా ఉత్తీర్ణత కావల్సి ఉంటుంది. అయితే ఈ మార్కులను ప్రామాణికంగా తీసుకోరు. నైతికత-మానవ విలువలు, పర్యావరణం పరీక్షలు యథాతథంగా ఉంటాయి. వీటిలో ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వరరావు సూచనలతో మార్పులు చేయనున్నారు. కళాశాల స్థాయిలో నిర్వహించే పరీక్షల్లో సైతం భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రం, జీవశాస్త్రానికి 30 మార్కుల చొప్పున ప్రాక్టికల్స్ యథాతథంగా జరుగుతాయి. మిగతా అన్ని సబ్జెక్టులకు 20 ఇంటర్నల్ మార్కులు ఉంటాయి. కొత్త విధానం ప్రకారం ఇంటర్ సెకండ్ ఇయర్‌లో ఒక్క ఏడాది మాత్రమే ఇంటర్ బోర్డు పబ్లిక్ పరీక్షలు నిర్వహిస్తుంది. ఈ విధానం 2026-27 విద్యా సంవత్సరంలోనే అమల్లోకి వస్తుంది. వచ్చే ఏడాది 2025-26లో ఇంటర్ ఎన్‌సీఈఆర్టీ పాఠ్యప్రణాళికకు అనుగుణంగా కొంత సిలబస్ తగ్గిస్తారు. అయితే పరీక్షలు మాత్రం పాత విధానంలోనే జరుగుతాయి.



ఇంటర్ సెకండ్ ఇయర్ సిలబస్‌తోనే పబ్లిక్ పరీక్షలు నిర్వహిస్తారు. ప్రస్తుతం గణితం ఏ, బీ పేపర్లుగా 75 చొప్పున 150 మార్కులకు ఉండగా.. రెండింటినీ కలిపి కొత్త పద్ధతిలో వంద మార్కులకు పబ్లిక్ పరీక్ష ఉంటుంది. అలాగే బైపీసీలో ప్రస్తుతం జంతుశాస్త్రం, వృక్షశాస్త్రం సబ్జెక్టులు విడివిడిగా ఉండగా.. ఈ రెండూ కలిపి 50 చొప్పున 100 మార్కులకు ఉంటాయి. ఈ రెండింటినీ కలిపి జీవశాస్త్రంగా పరిగణిస్తారు. అంతేకాకుండా ప్రస్తుతం పబ్లిక్ పరీక్షల్లో ఒక మార్కు ప్రశ్నలు లేవు. కొత్త విధానంలో 10 శాతం వరకు ఒక మార్కు ప్రశ్నలు ఇవ్వనున్నారు. 8 మార్కుల ప్రశ్నలు తొలగించి 5 లేదా 6 మార్కుల ప్రశ్నలు ప్రవేశపెట్టనున్నారు. గణితంతో బైపీసీ చదివే సదుపాయం విద్యార్థికి లభిస్తుంది. ప్రస్తుతం ఇది సీబీఎస్ఈలో ఉండగా.. ఇప్పుడు రాష్ట్ర బోర్డులోనూ తీసుకురానున్నారు. ఎంబైపీసీ చదివినవారు ఇంజినీరింగ్, నీట్ రెండింటికీ అర్హులే. ప్రస్తుత విధానంలో ఎంపీసీ గ్రూపు తీసుకుంటే గణితం-1ఏ, 1బీ విడివిడిగా.. భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రంతో పాటు మొదటిభాషగా ఆంగ్లం, రెండో భాషగా తెలుగు/సంస్కృతం/ఇతర భాషలను చదువుతున్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి తీసుకురానున్న కొత్త విధానంలో గణితానికి ఒకే పేపర్ ఉంటుంది. భౌతిక, రసాయనశాస్త్రాలు ప్రాక్టికల్స్‌తో కలిపి విడివిడిగా వంద మార్కులకు ఉంటాయి. మొదటిభాష ఆంగ్లం తప్పనిసరి. రెండోభాష స్థానంలో ఏ సబ్జెక్టునైనా ఎంపిక చేసుకోవచ్చు. ఇందులో భాషలతో పాటు ప్రధాన సబ్జెక్టులనూ ఎంపిక చేసుకోవచ్చు. మొత్తం 23 సబ్జెక్టులు అందుబాటులో ఉంటాయి. ఐదు సబ్జెక్టులు తప్పనిసరి కాగా.. ఆరో సబ్జెక్టును విద్యార్థి ఎంపిక చేసుకునే అవకాశం ఉంటుంది. ఇంటర్మీడియట్ విద్యామండలి పోర్టల్‌లోని 23 సబ్జెక్టుల్లో ఏదో ఒకటి చదువుకోవచ్చు. ఒకవేళ ప్రధాన ఐదు సబ్జెక్టుల్లో ఏదైనా ఒక సబ్జెక్టులో ఫెయిలైతే ఆరో సబ్జెక్ట మార్కులను ప్రామాణికంగా తీసుకుంటారు. ఇందులో ఉత్తీర్ణులైతే మొత్తం ఉత్తీర్ణత సాధించినట్లే. ఇక ఇంటర్ సెకండియర్‌లో ఇచ్చే మార్కుల మెమోలో ఐదు సబ్జెక్టులను ఒక చోట 500 మార్కులకు ఇచ్చి, ఆరో సబ్జెక్టును ప్రత్యేకంగా చూపుతారు. ఆర్ట్స్ గ్రూపు వాళ్లు సైన్స్ సబ్జెక్టులను, అలాగే సైన్స్ వాళ్లు ఆర్ట్స్ సబ్జెక్టులను ఎంపిక చేసుకోవచ్చు.

======================లీలీ

# మరువలేని 'నిరాడంబర ప్రధాని'
# లాల్ బహదూర్ శాస్త్రి
## -నేడు ఆయన వర్ధంతి

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

భారతదేశ రెండో ప్రధానమంత్రి, స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రముఖ పాత్రధారి లాల్ బహదుర్ శాస్త్రి. భారతదేశపు నిరాడంబర ప్రధానులలో ఒకరైన లాల్ బహదూర్ శాస్త్రి ఉత్తరప్రదేశ్‌లోని మొఘల్ సరాయ్ గ్రామంలో 1904 అక్టోబర్ 2న జన్మించారు. ఎంతో దేశభక్తిగల ఆయన 1921లో సహాయ నిరాకరణోద్యమంలో అడుగుపెట్టారు. స్వాతంత్ర్య పోరాటంలో మొత్తం 9 సంవత్సరాలపాటు జైలులోనే గడిపారు. స్వాతంత్ర్యం అనంతరం ఉత్రప్రదేశ్ రాష్ట్రమంత్రిగా పనిచేసి ఆ తరువాత 1951లో లోక్ సభ ప్రధాన



కార్యదర్శిగా నియమితులయ్యారు. మహాత్మా గాంధీ ప్రభావంతో అతను మొదట మహాత్మా గాంధీకి, తరువాత జవహర్‌లాల్ నెహ్రూకు నమ్మకస్తుడైన అనుచరుడయ్యాడు. 1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత అతను భారతదేశ ప్రభుత్వంలో చేరి జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వంలో మొదట రైల్వే మంత్రిగా (1951?56), తరువాత హోంమంత్రిగానేకాక ఇతర బాధ్యతలను కూడా చేపట్టాడు. నెహ్రూ అనంతరం ప్రధానమంత్రి పదవిని చేపట్టాడు. అతను 1965 ఇండో-పాకిస్థాన్ యుద్ధం కాలంలో దేశాన్ని నడిపించాడు. అతని నినాదం "జై జవాన్ జై కిసాన్" యుద్ధ సమయంలో బాగా ప్రాచుర్యంలోనికి వచ్చి ప్రస్తుత కాలం వరకు ప్రజల హృదయాల్లో గుర్తుండిపోయింది. ఈ యుద్ధం 1966 జనవరి 10న తాష్కెంట్ ఒప్పందం ద్వారా యుద్ధం పూర్తి అయినది. ఒప్పందం జరిగిన తరువాత దినం తాష్కెంట్లో అతను గుండెపోటుతో మరణించినట్లు చెప్పబడింది. కానీ ఈ మరణానికి అనేక కారణాలు చెప్పబడినప్పటికీ అది సి.ఐ.ఎ ద్వారా జరిగిన ప్రణాళికాబద్ధమైన హత్యగా చెప్పబడింది. కేంద్ర రైల్వే శాఖ మంత్రిగా పనిచేస్తూ రైలు ప్రమాదానికి నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి పదవికి రాజీనామా చేశారు. ఆ తరువాత రవాణా మంత్రిగా, హోంమంత్రిగా పనిచేశారు. 1964లో జవహర్ లాల్ నెహ్రూ ఆకస్మిక మరణం తర్వాత లాల్ బహదూర్ శాస్త్రిగారు ప్రధానమంత్రి అయ్యారు. దేశం ఆర్థిక సంక్షోభంలో ఉంటే గ్రీన్ రివల్యూషన్‌కు బాటలు వేశారు. భారత్-పాకిస్తాన్ దేశాల మధ్య ఒప్పందం కోసం రష్యా చేరిన లాల్ బహదూర్ శాస్త్రి తాష్కెంట్ ఒప్పందంపైన 1966 జనవరి 10న సంతకాలు చేశారు. ఆ మర్నాడు 1966 జనవరి 11న గుండెపోటుతో తాష్కెంట్‌లోనే ఆయన మరణించారు. మరణానంతరం 1966లో భారత ప్రభుత్వం ఆయనకు 'భారతరత్న' ఇచ్చి గౌరవించింది.

# భక్తులతో కిటకిటలాడుతన్న వైష్ణావలాయాలు

తిరుపతి,భద్రాచలం, జనవరి 10, వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమలలో రద్దీ పెరిగింది. మరికాసేపట్లో వైకుంఠ ద్వారదర్శనానికి టోకెన్ తీసుకున్న భక్తులను అనుమతిస్తారు. పదిరోజులపాటు సాగే వైకుంఠద్వార దర్శనాల కోసం వేలాదిగా వస్తున్న భక్తులతతో తిరుమల కొండం కిక్కిరిసింది. వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమల కొండలు గోవింద నామస్మరణతో మార్మోగుతున్నాయి. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు మలయప్ప స్వామి స్వర్ణరథంపై దర్శనమిస్తారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా అన్ని ఆలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాభయ్యాయి. ప్రసిద్ధ వైష్ణవాలయాల్లో ఉత్తరద్వారాలు తెరుచుకున్నాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు దేవాలయాలకు క్యూ కట్టారు. శ్రీమన్నారాయణుడిని దర్శించుకునేందుకు వేకువజాము నుంచే భక్తులు బారులు తీరారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా భద్రాచలం ఆలయానికి భక్తులు పోటెత్తారు. భక్తులకు ఉత్తర ద్వారం నుంచి శ్రీ సీతారామచంద్రస్వామి దర్శనమిస్తున్నారు.



మరోవైపు గోదావరి నదిలో శ్రీ సీతారామ చంద్రుల వారు, లక్ష్మణుడు, హనుమంతుడి సమేతంగా హంసవాహనంలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు రాములవారిని దర్శించుకున్నారు. యాదగిరిగుట్టలో గరుడ వాహనంపై వాసుదేవుడి రూపంలో స్వామి వారు ఉత్తర ద్వార దర్శనం ఇస్తున్నారు. ఉదయం 5:30 గంటలకు నుంచి స్వామివారు ఉత్తర ద్వారం గుండా భక్తులకు దర్శనమిస్తున్నారు. ఇవాళ స్వామి వారికి గరుడు సేవత్సవం, తిరువీధిసేవ నిర్వహించనున్నారు. అటు, చిన తిరుపతిగా పిలిచే ఏలూరులోని ద్వారకా తిరుమలలో ఉత్తర ద్వారం గుండా చిన వెంకన్నను భక్తులు దర్శించుకుంటున్నారు. ఉదయాన్నే భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. గోవింద నామ స్మరణలతో ఆలయ పరిసరాలు మార్మోగుతున్నాయి.

=

# ఎన్నికలలో ఇచ్చిన హామీలను తప్పక నెరవేర్చాలి....

తుగ్గలి: ఎన్నికలలో ఇచ్చిన హామీల ప్రకారం ఇల్లు లేని నిరుపేద ప్రజలకు ఇళ్ల స్థలాలు కేటాయించి,ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు అందజేయాలని సిపిఐ,బికేఎంయు నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం రోజున మండల కేంద్రమైన తుగ్గలి లోని గల స్థానిక తహసిల్దార్ కార్యాలయం నందు ఇళ్ల స్థలాల కోసం అర్జీలు అందజేసిన అర్జీదారుల సమక్షంలో సిపిఐ,బికేఎంయు నాయకులు ఇంటి స్థలం సమస్యలను పరిష్కరించాలని వారు ధర్నాను నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానం ప్రకారం పట్టణం నందు రెండు సెంట్లు మరియు గ్రామాల యందు మూడు సెంట్లు ఇంటి స్థలాలను పంపిణీ చేసి, ఇంటి నిర్మాణం కొరకు ఐదు లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం తహసిల్దార్ రమాదేవి కు వినతిపత్రాన్ని అందజేసి ప్రజా సమస్యలను పరిష్కరించాలని వారు తెలియజేశారు.

# స్థానిక సంస్థలపై కాంగ్రెస్ ఫోకస్

భారత శక్తి ప్రతినిధి

హైదరాబాద్, జనవరి 10, తెలంగాణలో త్వరలోనే స్థానిక ఎన్నికలు జరగనున్నాయి. గతేడాదిలోనే జరుగుతాయని అంతా భావించినప్పటికీ?. వాయిదా పడుతూ వస్తున్నాయి. ప్రస్తుతం పల్లెల్లో, వార్డుల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. సాధ్యమైనంత త్వరగా స్థానిక ఎన్నికలను నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. సర్కార్ నుంచి గ్రీన్ సిగ్నల్ వస్తే? వెంటనే షెడ్యూల్ ప్రకటించేందుకు ఎన్నికల సంఘం కూడా సిద్ధంగా ఉంది. స్థానిక ఎన్నికలు జరిగే అవకాశం ఉండటంతో అధికార కాంగ్రెస్ వ్యూహాలకు పదునుపెట్టే పనిలో పడింది. రాష్ట్ర ఏర్పాటు తర్వాత తొలిసారిగా అధికారంలోకి వచ్చిన హస్తం పార్టీ? ఈసారి పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోనుంది. క్షేత్రస్థాయిలో ఉన్న నేతలు కూడా?. పార్టీ గెలుపు కోసం కృషి చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. హస్తం జెండా ఎగరవేయటమే లక్ష్యంగా నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు పావులు కదిపేస్తున్నారు. షెడ్యూల్ వచ్చే నాటికే గ్రౌండ్ క్లియర్ గా ఉండాలని భావిస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయింది. నిజానికి ఏడాదిలోపే స్థానిక ఎన్నికలకు కూడా వెళ్లాలని భావించింది. అయితే క్షేత్రస్థాయిలోని పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ.. అడుగులు వేస్తోంది. ఈ క్రమంలోనే? గతేడాది కాకుండా ఈ ఏడాదిలోనే ఎన్నికలకు వెళ్లాలని డిసైడ్ అయింది. తాజాగా గాంధీ భవన్ లో పీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ భేటీ అయింది. ఇందులో ప్రధానంగా స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చ జరిగింది. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల జారీపై చర్చించారు. స్థానిక ఎన్నికలకు వెళ్లే క్రమంలో కాంగ్రెస్ పార్టీ కొన్ని అంశాలను ప్రధాన అస్త్రాలుగా భావిస్తోంది. ఇందులో రుణమాఫీతో పాటు రైతు భరోసా వంటివి ఉన్నాయి. అధికారంలోకి రాగానే రుణమాఫీ చేశామనే విషయాన్ని ప్రస్తావిస్తూ.. జనాల్లోకి వెళ్లనుంది.



అంతేకాకుండా రైతు భరోసాతో పాటు రైతు కూలీలకు కూడా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందిస్తున్నామని చెప్పనుంది. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న కొత్త రేషన్ కార్డుల ప్రక్రియను పట్టాలెక్కించే విషయాన్ని హస్తం పార్టీ జనాల్లోకి తీసుకెళ్లనుంది. వీటికితోడు ఇందిరమ్మ ఇళ్ల స్కీమ్ ను మరో అస్త్రంగా భావిస్తోంది. ఫ్రీ బస్సు పథకం, ఉచిత విద్యుత్ తో పాటు ఈ ఏడాది కాలంలో సంక్షేమ, అభివృద్ధి పనులను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని యోచిస్తోంది. తద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లోసత్తా చాటాలని కాంగ్రెస్ భావిస్తోంది. పదేండ్ల తర్వాత అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో? క్షేత్రస్థాయిలో పార్టీకి గత వైభవం తీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తోంది. ఇటు ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు పార్టీ కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టేందుకు ప్రణాళిక రూపొందిస్తోంది. అంతేకాకుండా ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు చాలా మంది హస్తం గూటికి చేరారు. ఈ పరిణామాలన్నింటిని అనుకూలంగా మలుచుకోవం ద్వారా? గ్రామ, మండల, జిల్లా పరిషత్ పీఠాలపై హస్తం జెండా ఎగరవేయాలని బలంగా భావిస్తోంది.

# 250 కేజీల నకిలీ అల్లం వెల్లుల్లి పేస్ట్ స్వాధీనం.. ముగ్గురిపై కేసు నమోదు..

భారత శక్తి ప్రతినిది

జోగులాంబ జనవరి 10, గద్వాల పట్టణం గంజిపేట లోని సితార ఇండస్ట్రీస్ లో నకిలీ అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారీ బయటపడింది. ఎస్పై కళ్యాణ్ కుమార్ బృందం తనిఖీలుచేసి 100 కేజీల నకిలీ అల్లం వెల్లుల్లి పేస్ట్,రసాయానాలు స్వాదీనం చేసుకుంది. అమిర్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసారు. హైదారాబాద్ కాటేదాన్ నుంచి గద్వాల కి బొలెరో వాహనంలో తెచ్చిన 150 కేజీల నకిలీ అల్లం వెల్లుల్లి పేస్ట్ స్వాదీనం మరో ఇద్దరిపై కేసు నమోదు చేసారు.

# ఖమ్మం హైవే పై భారీ ఆక్సిడెంట్ నలుగురు మృతి

సూర్యాపేట జనవరి 10, ఖమ్మం హై వే పై రోడ్డు ప్రమాదం జరిగింది. ఒక ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఆగిఉన్న లారీని ఢీకొట్టింది. ఘటనలో నలుగురు మృతి చెందారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం వుంది. ఘటనలో బస్సు నుజ్జు నుజ్జయింది. సంఘటన స్థలానికి చేరుకున్న సూర్యాపేట రూరల్ సీఐ, చివ్వేంల ఎస్ఐ, సిబ్బంది సహాయక చర్యలు కొనసాగించారు. శుక్రవారం ఉదయం 3.30 నుండి 4.00 గంటల మధ్యలో దుర్ఘటన జరిగింది. టైర్ పేలి పక్కకు ఆపుకున్న లారీని బస్సు ఢీ కొట్టినట్టుగా సమాచారం.

# భద్రాద్రిలో వైకుంఠ ఏకాదశి వేడుకలు

భద్రాచలం జనవరి 10,వైకుంఠ ఏకాదశి మహోత్సవాల సందర్భంగా భద్రాద్రి రామయ్య ఉత్తర ద్వారం నుంచి భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అధికారులు ఆ వైపు ప్రత్యేక సెక్టార్లు ఏర్పాటు చేసి స్వామి దర్శనం కల్పించారు. తెల్లవారుజామునే పండితులు రామయ్యకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్తర ద్వార దర్శనం అనంతరం భక్తులు మెట్ల గుండా గుడిలోకి ప్రవేశించి స్వామి సేవలో పాల్గొన్నారు.

# వైభవంగా వైకుంఠ ఏకాదశి.

గోదావరిఖని జనవరి 10,

వైకుంఠఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని గోదావరిఖనిలోని కోదండ రామాలయంలోనూ, బస్టాండ్ కాలనీలోని వెంకటేశ్వర దేవాలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తులు ఉదయం నుండి ఉత్తర ద్వారా దర్శనం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మమ్మల్ని చల్లంగా చూడాలని మా కోరికలు నెరవేరాలని భగవంతుని వేడుకున్నారు. అలాగే రామగుండం శాసనసభ్యులు రాజ్ ఠాకూర్ సతీమణి మనాలి ఠాగూర్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి గోదావరిఖని కోదండ రామాలయం ఆలయాన్ని సందర్శించారు. వైకుంఠ ద్వారం ద్వారా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా వంశీ కృష్ణ మాట్లాడుతూ, ముక్కోటి ఏకాదశి పర్వదినం భక్తుల కోసం ఎంతో ప్రత్యేకమైనది. ఈ పవిత్ర రోజున కోదండ రామాలయం వారిని దర్శించుకోవడం ఎంతో పుణ్యప్రదమైనది. ప్రజల సంక్షేమం, శాంతి, సుఖసంతోషాలు కలగాలని స్వామివారిని ప్రార్థించాను అని తెలిపారు. ఆలయ పరిసరాలను పర్యటించిన ఎమ్మెల్యే గారు, ఆలయ అభివృద్ధి, భక్తుల సౌకర్యాల కోసం తన వంతు సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని వైకుంఠ ద్వార దర్శన భాగ్యాన్ని పొందారు. బస్టాండ్ కాలనీలోని వెంకటేశ్వర దేవాలయంలో కమిటీ సభ్యు లు భక్తులకు తీర్థ ప్రసాదములు అందించారు అలాగే వెంకటేశ్వర వ్రతకల్పం పుస్తకాలను కమిటీ సభ్యులు భక్తులకు ఉచితంగా పంపిణీ చేశారు.

# అభివృద్ధి పనులను ప్రారంభించిన అధికారులు,ప్రజా ప్రతినిధులు

తుగ్గలి జనవరి 10,

తుగ్గలి మండలం పరిధిలోని రాంపల్లి గ్రామంలో పత్తికొండ శాసన సభ సభ్యులు కెయి శ్యామ్ కుమార్ ఆదేశాల మేరకు "పల్లె పండుగ-పంచాయతీ వారోత్సవాలు" కార్యక్రమంలో భాగంగా మండల టిడిపి కన్వీనర్ ఆర్ తిరుపాలు నాయుడు, రాంపల్లి మాజీ ఎంపీటీసీ సభ్యులు ఆర్ శ్రీనివాసులు ఆద్వర్యంలో మండల ఎపీఓ హేమ సుందర్,ఈసి ప్రదీప్, టెక్నికల్ అసిస్టెంట్ జయరాం, ఫీల్డ్ అసిస్టెంట్ హేమాద్రి నాయుడు,రాంపల్లి గ్రామ రైతు జయన్నకు సంబంధించిన ఉపాధి హామీ గ్రామీణ పథకంలో భాగంగా నూతనంగా నిర్మించిన గోకులం షెడ్డుకు పూజా కార్యక్రమాలు చేసి ప్రారంభించారు.అదే విధంగా ముక్కెళ్ళ గ్రామంలోని గ్రామ సర్పంచ్ సలహా దారులు రామచంద్ర ఆద్వర్యంలో గోకులం షెడ్డును మండల అధికారులు ప్రారంభించారు.అదేవిధంగా జొన్నగిరి గ్రామం నందు నూతనంగా నిర్మించిన గోకులం షెడ్డును ఎంపీడీవో విశ్వ మోహన్,విద్యా కమిటీ చైర్మన్ మిద్దె రవి, హోటల్ మల్లి,ఫీల్డ్ అసిస్టెంట్ పులికొండ లు ప్రారంభించారు.మొదటి రోజు కార్యక్రమంలో భాగంగా వివిధ గ్రామ పంచాయతీల నందు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమాలను అధికారులు,ప్రజాప్రతినిధులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులు,ప్రజా ప్రతినిధులు,ఉపాధి సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

==============================

# స్టీల్ ప్లాంట్ పై నోరు విప్పని మోడీ

భారత శక్తి ప్రతినిది



విశాఖపట్టణం, జనవరి 10, విశాఖలో ప్రధాని పర్యటన విజయవంతంగా పూర్తయింది. దాదాపు రెండు లక్షల కోట్ల రూపాయల ప్రాజెక్టులకు సంబంధించి ప్రధాని మోడీ శ్రీకారం చుట్టారు. అంతకుముందు నగరంలో భారీ రోడ్ షో నిర్వహించారు. అనంతరం భారీ బహిరంగ సభలో ప్రధాని కీలక ప్రసంగం చేశారు. కానీ ఎక్కడా విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రస్తావన లేకుండా పోయింది. దీంతో కార్మిక, ఉద్యోగ వర్గాలు తీవ్ర నిరాశ వ్యక్తం చేస్తున్నాయి. రెండు లక్షల కోట్ల పెట్టుబడులు మాట దేవుడెరుగు.. విశాఖ ఉక్కు, ఆంధ్రుల హక్కు అన్న నినాదంతో ఏర్పాటైన విశాఖ స్టీల్ ప్లాంట్ ను మాత్రం ప్రైవేటీకరిస్తారా అని ప్రశ్నిస్తున్నారు కార్మిక వర్గాలు. ముఖ్యంగా పవన్ కళ్యాణ్ తీరుపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైసిపి హయాంలో విశాఖ స్టీల్ ప్లాంట్ అంశంపై పవన్ చేసిన కామెంట్స్, ఇచ్చిన హామీలను గుర్తు చేస్తున్నారు.ప్రభుత్వ హయాంలో కొన్నేళ్ల కిందట కేంద్ర ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్ ను( ప్రైవేటీకరిస్తామని ప్రకటించింది. అప్పటినుంచి కార్మికులతో పాటు ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. దాదాపు ఏడాదిన్నరకు పైగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రధాని మోదీ పర్యటనతో దీనిపై స్పష్టతనిస్తారని అంతా భావించారు. కానీ ప్రధాని తన సుదీర్ఘ ప్రసంగంలో స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాన్ని ప్రస్తావించకపోవడం కార్మిక వర్గాల్లో ఆందోళనకు గురిచేస్తోంది. కూటమిలో మిత్రపక్షంగా ఉన్న పవన్ కళ్యాణ్, చంద్రబాబుఎలాగైనా ప్రధాని మోదీని ఒప్పించి విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ లేదని చెప్పిస్తారని కార్మికులు ఎంతగానో ఆశించారు. కానీ అటువంటిదేమీ లేకపోవడంతో తీవ్ర నిరాశకు గురయ్యారు. ఈ విషయంలో పవన్ తీరును విపరీతంగా ఆక్షేపిస్తున్నారు.వైసిపి ప్రభుత్వ హయాంలో కేంద్ర ప్రభుత్వం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాన్ని తెరపైకి తెచ్చింది. దీనిపై కార్మికులు ఉద్యమ బాట పట్టారు. ఉద్యమం పతాక స్థాయికి చేరింది. ఈ తరుణంలో జనసేన అధినేత పవన్ స్పందించారు. కార్మికుల ఆందోళనకు మద్దతు తెలిపారు. ఈ క్రమంలో అప్పటి కేంద్ర ప్రభుత్వ చర్యలను తప్పు పట్టకుండా.. వైసిపి ప్రభుత్వ చర్యలను ఎండగట్టారు. వైసిపి తీరుతోనే విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరిస్తున్నారని ఆరోపణలు చేశారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే ప్రైవేటీకరణను అడ్డుకుంటామని.. కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పిస్తామని.. అవసరమైతే తమ గళాన్ని వినిపిస్తామని హామీ ఇచ్చారు పవన్ కళ్యాణ్ కానీ నిన్న జరిగిన సభలో కనీసం విశాఖ స్టీల్ ప్రస్తావన లేకుండా ప్రధాని ప్రసంగం ముగించడంతో తీవ్ర నిరాశకు గురయ్యారు విశాఖ నగర ప్రజలు, ఉత్తరాంధ్రవాసులు. మరో ప్లాంట్ పై ఆందోళన అనకాపల్లిప్రాంతంలో మరో స్టీల్ ప్లాంట్ కు శంకుస్థాపన చేయడంపై కూడా కార్మిక వర్గాల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. విశాఖ స్టీల్ ప్లాంట్ నునిర్వీర్యం చేసేందుకే ఈ ప్రాంతంలో మరో ప్రైవేటు స్టీల్ ప్లాంట్ ను ఏర్పాటు చేస్తున్నారని కార్మికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఎంతోమంది బలిదానాలతో నిర్మించిన విశాఖ స్టీల్ ప్లాంట్ ను కాపాడడంలో రాష్ట్ర ప్రభుత్వం ఫెయిల్ అయిందని కార్మికులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా పవన్ కళ్యాణ్ తీరును ఎండగడుతున్నారు. నిత్యం చంద్రబాబు భజన తోనే పవన్ సరిపెడుతున్నారని.. కనీసం విశాఖ స్టీల్ అంశాన్ని ప్రధానితో చెప్పించలేకపోయారని తప్పు పడుతున్నారు. ఈ విషయంలో పవన్ పై ముప్పేట విమర్శలకు దిగుతున్నారు.

# బాపట్లలో ఎంపీ వర్సెస్ ఎమ్మెల్యే

భారత శక్తి ప్రతినిది

గుంటూరు, జనవరి 10, ( పట్ల జిల్లాలుగా విడిపోయింది. గుంటూరు ఎంపీగా ఉన్న పెమ్మసాని చంద్రశేఖర్ సెంట్రల్ మినిస్టర్ పదవి తగ్గించుకున్నారు. పల్నాడు ఎంపీగా లావు శ్రీకృష్ణదేవరాయలు గెలిచారు. బాపట్ల ఎంపీగా మాజీ ఐపీఎస్ ఆఫీసర్ కృష్ణప్రసాద్ కూటమి నుంచి విజయం సాధించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో మూడు ఎంపీ స్థానాలను తెలుగుదేశం పార్టీనే కైవసం చేసుకుంది.గుంటూరు ఎంపీగా గెలిచిన పెమ్మసాని చంద్రశేఖర్ తన పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలు అందరితో కలిసికట్టుగా ముందుకు వెళ్తున్నారు. ఏదైనా అధికార కార్యక్రమం గనుక గుంటూరులో నగరంలో జరిగితే తప్పకుండా ఎమ్మెల్యేలు, ఎంపీ హాజరవుతున్నారు. ఒకటో రెండో సందర్భంలో తప్ప మిగిలిన సందర్భాల్లో వారి మధ్య ఎలాంటి విభేదాలు లేకుండా కలిసికట్టుగా పనిచేసుకుంటూ వెళ్తున్నారు. పల్నాడు జిల్లాలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కూడా నరసరావుపేటలో ఏదైనా కార్యక్రమం జరిగితే స్థానిక ఎమ్మెల్యేలతో కలిసికట్టుగా ఆ కార్యక్రమంలో పాల్గొంటున్నారు.గుంటూరుతో పోలిస్తే పల్నాడు జిల్లాలో అంతగా అందరు కలిసి పనిచేస్తున్న పరిస్థితులు కనిపించడం లేదు. కొన్ని సందర్భాల్లో ఎమ్మెల్యేలు మాత్రమే కార్యక్రమాలకు హాజరవుతున్న పరిస్థితులు ఉన్నాయి. ఎంపీతో ఎలాంటి విభేదాలు లేకపోయినప్పటికీ పల్నాడు జిల్లాలో ఉన్న నేతలంతా కూడా సీనియర్లు అవ్వడంతో వారి కార్యక్రమాలు వాళ్లే నిర్వహించుకుంటున్నారు.బాపట్ల జిల్లాకు సంబంధించి బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు.. బాపట్ల ఎంపీకృష్ణ ప్రసాద్‌ల మధ్య విభేదాలు ఉన్నట్లు సోషల్ మీడియా కోడై కూస్తుంది. అయితే దాన్ని ఎమ్మెల్యే ఖండిస్తున్నప్పటికీ ఎంపీ ఆ ప్రచారం గురించి అసలు పట్టించుకోవడం లేదు. అయితే గెలిచిన రోజు నుంచి బాపట్ల పరిధిలోని ఎమ్మెల్యేలకి ఎంపీకి కొంత డిస్టెన్స్ ఉందనేది మాత్రం వాస్తవం అంటున్నారు కూటమినేతలు.. మరీ తీవ్రస్థాయి విభేదాలు లేవు కానీ, ఏదో చిన్న గ్యాప్ ఉందని అందుకే ఆ ఇద్దరు కార్యక్రమాల్లో కలిసికట్టుగా పాల్గొనడం లేదన్న అభిప్రాయం వ్యక్తం అవుతుంది.గుంటూరు పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలో పెమ్మసాని చంద్రశేఖర్ సెంట్రల్ మినిస్టర్‌గా ఉన్నా నియోజకవర్గం పరిధిలోని ఎమ్మెల్యేలందర్నీ కలుపుకుని వెళ్తున్నారు. ఎమ్మెల్యేలు కూడా ఆయనకు అంతే ప్రాధాన్యత ఇస్తున్నారు. అయితేఅలాంటి పరిస్థితి బాపట్ల జిల్లాలో బాపట్ల పార్లమెంటు పరిధిలో లేదంటున్నారు. గతంలో బాపట్ల ఎంపీలుగా గెలిచిన అనేకమంది కేంద్ర స్థాయిలో కూడా చక్రం తిప్పిన వాళ్ళు ఉన్నారు.ప్రస్తుతం ఎంపీ కృష్ణ ప్రసాద్ రాజకీయాలకు కొత్త అయినప్పటికీ విద్యాధికులు కావడం, పోలీసు అధికారిగా రాజకీయాలను దగ్గర నుంచి చూసిన వ్యక్తి కావడంతో బాపట్ల జిల్లా రాజకీయాల్లో కీలకంగా వ్యవహరిస్తారని అందరూ భావించారు. అయితే అలాంటి పరిస్థితి కనిపించడం లేదని తెలుగుదేశం పార్టీ కార్యకర్తలే అంటున్నారు. ఎంపీతో ఎమ్మెల్యేలు సమావేశాలు పెట్టుకోవడం.. ఎంపీ చొరవ తీసుకుని కోఆర్డినేషన్ మీటింగులు పెట్టడం కాని జరగకపోతుండటంతో ఎంపీకి ఎమ్మెల్యేలకు మధ్య గ్యాప్ ఉందని గట్టిగా ప్రచారం జరుగుతుంది. ముఖ్యమంగా బాపట్ల ఎమ్మెల్యే వేగేశన వర్మ, ఎంపీ కృష్ణ ప్రసాద్‌ల మధ్య గ్యాప్‌పై తీవ్ర స్థాయిలో ప్రచారం జరుగుతోంది. ఎమ్మెల్యే మాత్రం అటువంటిదేమీ లేదని ప్రెస్ మీట్ పెట్టి మరీ ఖండస్తున్నారు.అయితే ఎవరు ఏ కార్యక్రమంలో కలిసి పాల్గొనక పోవడం, ప్రజా సమస్యలకు సంబంధించి కీలకమైనటువంటి నిర్ణయాలు ఇద్దరు కలిసి తీసుకోకపోవడం వల్లే అలాంటి ప్రచారం జరుగుతుంని స్థానికులు అంటున్నారు. మరి ఆ ఇద్దరు అలాంటి ప్రచారాలకి ఫుల్‌స్టాప్ పెట్టేలా కలిసి కనిపిస్తారోలేదో చూడాలి.

# ప్రాణాలు తీస్తున్న మంజా...

భారత శక్తి ప్రతినిది



హైదరాబాద్, జనవరి 10, ( చైనా మాంజా.. ఇది సాధారణ దారం కంటే గట్టిగా, పదునుగా ఉండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. దీన్ని.. నైలాన్, సింథటిక్ దారానికి గాజు, ప్లాస్టిక్ పొడి పూసి మాంజా తయారు చేస్తారు. గాజుముక్కలను ఇతర రసాయన విషాలను కలపడం వల్ల ఈ దారం కత్తిలాగా మారుతోంది. అదే ఇప్పుడు మనిషి పాలిట ఉరితాడుగా మారింది. 2017లోనే చైనా మాంజా ఉత్పత్తి, నిల్వ, అమ్మకాలపై జాతీయ హరిత ట్రిబ్యునల్ నిషేధం విధించింది. ఈ దారం పర్యావరణానికి ప్రమాదమని భావించిన జాతీయ హరిత ట్రైబ్యునల్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వం నిషేధం విధించింది. అయినా సంక్రాంతికి చైనా మాంజా విక్రయాలు ఇష్టారీతిన సాగుతున్నాయి. గతంలో ఇతర రాష్ట్రాల నుంచి రహస్యంగా తీసుకొచ్చి విక్రయించేవారు. ప్రస్తుతం ఆ వ్యాపారం లాభసాటిగా ఉండటంతో ఎక్కడపడితే అక్కడ తయారు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.ఈ చైనా మాంజా కారణంగా ప్రతి సంక్రాంతి సమయంలో ఎంతో మంది చనిపోతున్నారు. తీవ్రంగా గాయపడిన వారు ఆసుపత్రుల పాలవుతున్నారు. ఈ మాంజాతో పతంగులు ఎగురవేసే వారికి కూడా అనేక గాయాలవుతున్నాయి. అయినా మార్కెట్‌లో మాత్రం చైనా మాంజా విక్రయానికి మాత్రం అడ్డుకట్ట పడటం లేదు. పోలీసులు సోదాలు చేసి కేసులు నమోదు చేస్తున్నా ఫలితం లేకుండాపోతోంది. తెలుగు రాష్ట్రాల్లో ఇటీవల చాలామంది.. గాయపడ్డ ఘటనలు నమోదయ్యాయి. ఈ దుస్థితి నెలకొనడానికి కారణం అధికారుల నిర్లక్ష్యం, వ్యాపారుల అత్యాశ, పతంగులు ఎగురవేసే వారి బాధ్యతారాహిత్యం అని చెప్పాలి.చైనీస్ మాంజా కారణంగా పక్షుల మరణాలకు లెక్కేలేదు. గాలి పటాలు ఎగరేసినప్పుడు తెగిపోయిన మంజా దారాలు చెట్లు, కరెంట్ తీగలు, స్తంభాలు, ఇళ్ల మధ్య వేలాడుతూ ఉంటాయి. పక్షులు ఎగిరివచ్చి వాటిలో చిక్కుకుపోయి మృత్యువాతపడుతున్నాయి. అందులో అరుదైన పక్షులు ఉంటున్నాయని, మాంజా కారణంగా కొన్ని జాతులు అదృశ్యమైపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని జంతు ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ముఖ్యంగా బైక్స్ మీద వెళ్లేవారికి ఈ మాంజా కారణంగా ముప్పు ఏర్పడుతుంది. అందుకే కొందరు వాహనదారులు ప్రత్యామ్నాయ దారులను అన్వేశిస్తున్నారు. తాజాగా గుజరాత్‌లో ఓ వాహనదారుడు.. చైనా మాంజా ముప్పు నుంచి తప్పించుకునేందుకు తన స్కూటీకి ముందు ఓ ఇనుప కడ్డీతో షీల్డ్‌లా ఏర్పాటు చేసుకున్నాడు. మా బాధను ఎవరూ అర్థం చేసుకోవడం లేదు. మాంజా తగిలితే ప్రాణం పోవడం ఖాయం. అందుకే ఈ ఏర్పాటు అంటున్నాడు. ఈ ఐడియా బాగుందని.. ఫాలో అయితే బెటర్ అని చాలామంది నెటిజన్స్ కామెంట్స్ పెడుతున్నారు.

# ఏడీబీ రోడ్డు పనులు పరిశీలించిన పవన్ కళ్యాణ్

కాకినాడ జనవరి 10,

రాజమండ్రి నుంచి పిఠాపురం పర్యటనకు వెళ్తూ మార్గమధ్యంలో రామస్వామిపేట వద్ద ఏడీబీ రోడ్డు నిర్మాణం పనులని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పరిశీలించారు. రోడ్డు నిర్మాణం ఎప్పుడు ప్రారంభం అయ్యింది. ఎంత వరకు పూర్తయ్యింది. ప్రస్తుతం పనులు ఎలా సాగుతున్నాయి తదితర వివరాలను తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి, ఇతర అధికారులను అడిగి తెలుసుకున్నారు. రోడ్డు వెంట కాలి నడకన వెళ్తూ డ్రెయిన్ సౌకర్యం, నిర్మాణం పనుల్లో నాణ్యతను పరిశీలించారు.

ఇటీవల గేమ్ ఛేంజర్ ప్రీరిలీజ్ ఈవెంట్ సమయంలో వడిశలేరు వద్ద రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అభిమానుల ప్రాణాలు కోల్పోయిన ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రమాదానికిగల కారణాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. కాకినాడ పార్లమెంటు సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, కాకినాడ జిల్లా కలెక్టర్ శ్రీ షన్మోహన్ సగిలి, ఇతర ఉన్నతాధికారులు అయన తో పాటు ఉన్నారు.

# క్రెడాయ్ ప్రాపర్టీ షో ను ప్రారంభించిన మంత్రి నారాయణ

విజయవాడజనవరి 10,

క్రెడాయ్ విజయవాడ ప్రాపర్టీ షో ను మంత్రి పొంగూరు నారాయణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కేశినేని చిన్ని,ఎమ్మెల్యేలు గద్దె రామమోహన్, బోడే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి నారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుంది. గత ఐదేళ్లలో రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం తీవ్రంగా దెబ్బతింది. భవన నిర్మాణాలు, లే అవుట్ల అనుమతులను సులభతరం చేస్తూ జీవో లు జారీ చేశాం 10 రాష్ట్రాల్లో అధ్యయనం చేసి సరళమైన నిబంధనలు రూపొందించాం. లే అవుట్ లలో రోడ్లను 12 మీటర్ల నుంచి 9 మీటర్లకు తగ్గించాము. 15 మీటర్ల లోపు భవనాలు నిర్మాణాలకు ఎలాంటి అనుమతి లేకుండా లైసెన్సెడ్ సర్వేయర్ కు బాధ్యతలు అప్పగిస్తున్నామని అన్నారు.

రియల్ ఎస్టేట్ అభివృద్ధి చెందితే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. భవన నిర్మాణాల కోసం ఆఫీసుల చుట్టూ తిరిగే పని లేకుండా సింగిల్ విండో విధానం అమల్లోకి తెస్తున్నాం. ప్రాపర్టీ షో లో నిర్వహణ ద్వారా కొనుగోలుదారులకు అవగాహన వస్తుంది. ప్రతి ఏటా రెండు సార్లు రియల్ ఎస్టేట్ అసోసియేషన్ ల ప్రతినిధులతో సమావేశం అవుతాను. ఎవరికి ఎలాంటి సమస్యలు ఉన్నా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని అన్నారు.

# గోషామహల్ లో మరోసారి కుంగిన చాక్నవాడి నాలా

హైదరాబాద్ జనవరి 10,

దారుస్సలాం రోడ్డు నుండి చాక్నావాడికి వెళ్లే రోడ్డులో ప్లైవుడ్ దుకాణాల ముందు నాలా కుంగిపోయింది. గురువారం అర్ధరాత్రి 12గంటల ప్రాంతంలో సివరేజ్ పెద్ద నాలా కుంగిపోయింది. వు గతంలో కుంగిన నాలా పనులు కొనసాగుతుండగా మరోవైపు ప్రక్కనే ఉన్న మరో నాలా కుంగి నాలలో క్రషర్ లారీ పడిపోయింది. పెను ప్రమాదం తప్పింది. ప్రాణాలతో లారీ డ్రైవర్ బయటపడ్డాడు. ఇప్పటికి మూడోసారి కుంగిన ఘటన. నాలా మొత్తం పునరుద్ధరించాలని పదే,పదే ఎన్నిసార్లు ప్రభుత్వనికి మొరపెట్టుకున్న అధికారులు పట్టించుకోవడం లేదు. ఇలా నాలాలు కుంగడం వల్ల ప్రాణనష్టం జరిగితే ఎవరు బాధ్యులు అని ప్రశ్నించారు. తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికులు..ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేసారు. నిత్యం నాలాలు కుంగడం వల్ల రకపోకలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని...తమ సమష్యాను పరిష్కరించకపోతే నాలా పై పెద్ద ఎత్తున్న ఆందోళన చేపడుతము అని హెచ్చరించారు.

# అమిత్ షా రాజీనామా చేయాలి

విశాఖపట్నంరాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ను అవ మానపరిచిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా తక్షణమే రాజీనామా చేయాలని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాం డ్ చేశారు. ఈ మేరకు విశాఖ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో జై బాపూజీ జై భీం జై సంవిధాన నినాదం బ్రోచర్ ను ఆమె ఆవిష్క రించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ నిండు పార్లమెంటు సభలో హోమ్ మినిస్టర్ అమిత్ షా, అంబేద్కర్ను హేళన చేస్తూ వాఖ్యానాలు చేయగా, బిజెపి ఎంపీల నవ్వడం జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అంబేద్కర్ ని జపం చేస్తుందని, ఎందుకు జపం చేయకూడదని ఆమె బిజెపి నేతలను ప్రశ్నించారు. అంబేద్కర్ రాజ్యాంగమే ప్రజాస్వామ్యాన్ని కాపాడుతుందని, దేశంలోని అన్ని వర్గాల వారికి ఓటు హక్కును రాజ్యాంగమే కల్పించింద న్నారు. భిన్న మతాలు కులాలను ఒకటిగా చేసింది ఆ రాజ్యాంగమే అన్నారు. అందరూ సమానంగా స్వేచ్ఛగా గౌరవంగా బ్రతకడానికి అంబేద్కర్ రాజ్యాంగమే కారణమని స్పష్టం చేశారు. అటువంటి రాజ్యాంగాన్ని రాసిన అంబేద్కర్ ని కాంగ్రెస్ జపం చేస్తే తప్పేంటని, మీరు ఎందుకు జపం చేయట్లేదని నిలదీశారు. ప్రపంచమంతా భారత రాజ్యాంగాన్ని గౌరవిస్తుంది అంటే దానికి అంబేద్కర్ కారణమన్నారు. అమిత్ షా వాక్యాలను జగన్, పవన్, కళ్యాణ్ చంద్రబాబు ఎందుకు ఖండించలేదని ప్రశ్నించారు.

## నకిలీ డాక్టర్ మాములుగా లేదుగా

భారత శక్తి ప్రతినిది

అదిలాబాద్, జనవరి 10. ఎంబీబీఎస్ అని రాసుకున్నంత మాత్రాన డాక్లర్లు కారు. కామారెడ్డి జిల్లాలో ఇట్టాంటి వ్యవహారమే వ్యవహారం కలకలం రేపింది. షైన్ స్టార్ హాస్పిటల్‌లో తనిఖీలు చేస్తే ఫేక్ డాక్టర్ దగావర్వం బయటపడింది. మందమర్రి మండలం రామకృష్ణ పూర్‌కు చెందిన రవీందర్? ఫేక్ డాక్టర్ సర్టిఫికెట్‌తో పెద్ద కథే నడిపాడు. డిగ్రీ ఫెయిల్.. కానీ ఎంబీబీఎస్ పూర్తి చేసినట్టు కటింగ్ ఇస్తూ ఎందర్నో బురిడీ కొట్టించాడు. రవీందర్ అనే రియల్ డాక్టర్ సర్టిఫికెట్లను డూప్లికేటు చేశాడు. అతని ఫోటో వున్న తన ఫోటో అతికించాడు. గాంధీ ఆస్పత్రిలో పనిచేసినట్టు బాగా కవర్ చేశాడు. హాస్పిటల్ యాజమాన్యాలను బురిడీ కొట్టించి గత మూడేళ్లుగా ఆదిలాబాద్, కామారెడ్డి జిల్లాలోని పలు ఆసుపత్రుల్లో పనిచేశాడు. దొరికితే దొంగ దొరకనంత వరకు దర్జాగా డాక్టర్ బాబుగా కటింగ్ ఇచ్చాడు. ఇతను రాసిన ప్రిస్క్రిప్షన్ చూసి? సమ్ థింగ్ ఈజ్ రాంగ్ అని పసిగట్టిన ఓ వ్యక్తి.. పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇంకేం అతను పనిచేస్తున్న హాస్పిటల్‌కు వెళ్లి సర్టిఫికెట్లు వెరిఫై చేస్తే అసలు సంగతి బయటపడింది.దొరకనంత వరకు డాక్టర్‌బాబుగా దర్జా వెలగబెట్టిన ముల్కల రవీందర్..కామారెడ్డి ఖాకీలకు అడ్డంగా బుక్కయ్యాడు. ఎంబీబీఎస్ చదవకుండా డాక్టర్‌గా ఎలా మేనేజ్ చేశాడు. ఆరా తీస్తే నివ్వెరపోయే నిజాలు వెలుగు చూశాయి. తనిఖీ చేస్తే ఫేక్ ఆధార్ కార్డు, మరికొన్ని ఫేక్ సర్టిఫికెట్స్ దొరికాయి. అతని దగ్గరి నుంచి సెల్ ఫోన్, ల్యాప్ ట్యాప్ స్వాధీనం చేసుకున్నారు పోలీసులు. ఇతనొక్కడే..ఇతనితో దంటగట్టిన ఇలాంటి బాపతుగాళ్లు ఇంకా వున్నారా? అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు కామారెడ్డి పోలీసులు.

## మెట్రో రైలులో అనాథలతో మైనంపల్లి జన్మదిన వేడుకలు

హైదరాబాద్ జనవరి 10,

మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత మైనంపల్లి హనుమంతరావు జన్మదినం సందర్భంగా... ఆయన అనుచరులు, అభిమానులు వినూత్నంగా జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు. మెదక్ జిల్లాకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత అరుణార్తి వెంకటరమణ, మెట్రో రైల్ పైన మైనంపల్లి చిత్రపటాలు ఏర్పాటు చేసి జన్మదిన శుభకాంక్షలు తెలిపారు. వినూత్నంగా తెలియజేసిన ఈ జన్మదిన శు భాకాంక్షలు పట్ల మెట్రో ప్రయాణికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ చూశారు. దీంతోపాటు అనాథ పిల్లలకు ఆ రైల్ లో ఉ చితంగా ప్రయాణం ఏర్పాటు చేశారు. అలాగే ఆ పిల్లలకు పండ్లు, బిస్కెట్లు, స్కూల్ బ్యాగ్ కిట్స్ ను అందజేశారు. ఒక నాయకుడి జన్మదిన పదిమందికి ఉపయోగకరంగా ఉండేటట్లు జరుపుకోవడాన్ని పలువురు ప్రయాణికులు అభినందించారు. నీరు పేదలకు అనునిత్యం అండగా ఉండే మైనంపల్లి ఆయురారోగ్యాలతో జీవించాలని మరిన్ని ఉన్నత పదవులు అధిష్టించాలని అరుణార్తి వెంకటరమణ ఆకాక్షించారు. ఈ సందర్భం. అసెంబ్లీ మెట్రో స్టేషన్ లో అనాథ పిల్లలతో కలిసి కేక్ కట్ చేసి మైనంపల్లికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## కన్నతల్లిని కన్న ఊరిని మరువరాదు.

భారత శక్తి ప్రతినిది

కమాన్ పూర్ జనవరి 10,

కన్నతల్లిని కన్న ఊరిని ఏనాడు మరవరాదని ఎండపల్లి తహసిల్దార్ రవికాంత్ అన్నారు. శుక్రవారం ఎండపల్లి మండలం

గుల్లకోటలో ఉచిత నేత్ర వైద్య శిబిరం కమాన్ పూర్ లైన్స్ క్లబ్ అధ్యక్షుడు సాన రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వగ్రామంలో సమాజ హిత కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయం !ఎండపల్లి తాసిల్దార్ రవికాంత్ అన్నారు .శుక్రవారం లైన్స్ క్లబ్ ఆఫ్ కమాన్ పూర్ అధ్యక్షులు సానా రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం గుల్లకోట గ్రామంలో నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎండపల్లి తాసిల్దార్ రమాకాంత్ మాట్లాడుతూ తాను పుట్టిన గ్రామంలో ఎవరు అంధత్వంతో బాధపడకూడదని ఈ శిబిరం నిర్వహించడం చాలా అభినందనీయమని మొదటినుండే ఈ సానా కుటుంబ సభ్యులు గ్రామానికి ఎన్నో వెలకట్టలేని సేవలు చేశారని వారి సేవలు మరువలేనివని అలాగే సదాశయ ఫౌండేషన్ నేత్ర అవయవ శరీర దానాలపై అవగాహన కల్పించడం చాలా గొప్ప కార్యక్రమమని ప్రతి ఒక్కరూ బ్రతికుండగా నేత్రాలు కాపాడుకొని మరణానంతరం నేత్రదానం చేసి ఇక్కడి నుండి నలుగురికి చూపునివ్వడం కన్నా గొప్ప పని ఏమీ లేదని కొనియాడారు సానా రామకృష్ణారెడ్డి గారు మాట్లాడుతూ ఈ గ్రామస్తులను తామే ఉచితంగా బస్సు ఏర్పాటు చేసి తీసుకొని వెళ్లి కరీంనగర్లో వారికి సర్జరీ చేయించి మళ్లీ తీసుకొని వచ్చి ఈ గ్రామంలోని వారి ఇంటి వద్ద దిగబెడదామని చెప్పాడు 105 మంది హాజరు కాగా 30 ఒక మందిని పంపించడం జరుగుతుందిఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ ఆఫ్ కమాన్పూర్ ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి శంకర్ సదాశివ ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి శంకర్ సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి చోడవరపు లింగమూర్తి ఉత్తమ ఉపాధ్యాయ రాజిరెడ్డి సానా జయాకర్ సానా మారుతి సింహాచలం జగన్ ముదిగంటి రమణారెడ్డి మహిపాల్ రెడ్డి భూసారపు రమేష్ కలువల గంగాధర్ టెక్నీషియన్ ప్రభాకర్ గ్రామస్తులు పాల్గొని సానా కుటుంబాన్ని కొనియాడారు

# పార్టీలో నేతలు చెరో దారి

భారత శక్తి ప్రతినిది

కాకినాడ, జనవరి 10, ( తూర్పుగోదావరి జిల్లాలోని కొవ్వూరు నియోజకవర్గం టీడీపీకి కంచుకోటగా పేరు పడింది. పార్టీ పుట్టినప్పటి నుంచి 1999, 2019 మినహా ప్రతి ఎన్నికలోనూ టిడిపినే ఇక్కడ గెలిచింది. పార్టీ కష్టాల్లో ఉన్న 2004,2009లో సైతం కొవ్వూరులో తెలుగుదేశం అభ్యర్థులే గెలిచారు. అలాంటి చరిత్ర ఉన్న కొవ్వూరులో టీడీపీని చేజేతులా పార్టీ అధిష్టానమే నాశనం చేసుకుంటుందన్న విమర్శలు వెలువెత్తుతున్నాయి. కారణం అక్కడ పార్టీలో పెరిగిపోయిన వర్గ పోరు.. కుమ్ములాటలు.కొవ్వూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఎవరైనా అక్కడ శాసనం మాత్రం దొమ్మేరు దివాణందే. దొమ్మేరు జమీందార్లుగా పేరున్న పెండ్యాల వెంకట కృష్ణారావు (కృష్ణబాబు), ఆయన సోదరుడు అచ్చిబాబు చెప్పిన మాటే వేదంగా అక్కడ చెల్లుబాటు అయ్యేది. కృష్ణ బాబు ఐదుసార్లు కొవ్వూరు నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. 2009లో నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా కొవ్వూరు ఎస్సీలకు రిజర్వ్ అయ్యింది. అప్పటి నుంచి టీవీ రామారావు, ఖా జవహర్, తానేటి వనిత (వైసీపీ), ముప్పిడి వెంకటేశ్వర రావు కొవ్వూరు నుంచి గెలిచారు. వీరి గెలుపు వెనుక ఉన్నది పెండ్యాల కుటుంబమే అన్నది బహిరంగ రహస్యం. దాదాపు 23 ఏళ్ళు ఓఎం గా పని చేసిన చరిత్ర ఉన్న కృష్ణ బాబు అనూహ్యంగా 2012లో వైసీపీలో చేరారు. దీంతో కంగారుపడిన టిడిపి శ్రేణులకు ఆయన సోదరుడు అచ్చిబాబు అండగా నిలబడ్డారు. ఆ తర్వాత ఎన్నికల్లో ఖా జవహర్ టీడీపీ నుంచి గెలిచి మంత్రి అయ్యారు. 2019లో జగన్ హవాలో తానేటి వనిత కొవ్వూరులో గెలిచి హోం మంత్రి అయ్యారు. ఆ గెలుపు వెనక ఉన్నది కృష్ణ బాబు అల్లుడు రాజీవ్ కృష్ణ అని ఆయన వర్గం ప్రచారం చేసుకుంది. ఆ టైంలో వైసిపిలో రాజీవ్ కృష్ణ ఒక వెలుగు వెలిగారు. అయితే 2024లో సీన్ మారింది. కూటమి ప్రభంజనంలో టిడిపి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు ఇక్కడ నుంచి గెలిచారు. ఆ గెలుపునకు అచ్చిబాబు మద్దతు తోడ్పడింది. ఈ తరుణంలో కృష్ణబాబు మృతి చెందడం, ఆయన అల్లుడు రాజీవ్ కృష్ణ టిడిపి గూటికి చేరడం జరిగిపోయాయి. అయితే ఈ చేరిక తనకు తెలియకుండానే జరిగిందని స్థానిక ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తనను కలిసిన కార్యకర్తలతో చెప్పినట్టు తెలుస్తోంది. అటు అచ్చిబాబు కూడా అధిష్టానం వైఖరితో అలకబూనారు. 2019-24 మధ్యకాలంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ఇబ్బందులు పడుతున్నప్పుడు వారికి అండగా నిలబడింది స్థానిక తెలుగుదేశం నాయకులు. అయితే తమకు తెలియకుండా రాజీవ్ కృష్ణను అధిష్టానం పార్టీలో చేర్చుకోవడంపై వారు మనస్థాపం చెందినట్టు చెబుతున్నారు. ఎవరైతే తమని ఇబ్బందులు పెట్టారో వాళ్లకి పార్టీలో పెద్దపీట వేయడం ఏంటనేది వారి వాదన. మరోవైపు అన్ని సర్దుకుంటాయని పార్టీ హై కమాండ్ భావిస్తోంది. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి ఆలా కనిపించడం లేదు. మొదటి నుంచి మాజీ మంత్రి జవహర్‌ను కొవ్వూరు టీడీపీలోని ఒక వర్గం వ్యతిరేకిస్తోంది. ఇప్పుడు రాజీవ్ కృష్ణ, జవహర్ ఏకం అయ్యారు అనేది వారి వెర్షన్. రాజీవ్ కృష్ణ, జవహర్ ఆశీస్సులతో సంక్రాంతి శుభాకాంక్షలు చెబుతూ ఫ్లెక్సీలు వెలియడాన్ని సాక్ష్యంగా చెబుతున్నారు. నిజానికి 2024లో కొవ్వూరు సీటు తనకే అని జవహర్ భావించారు. 2019 ఓటమి తర్వాత టిడిపిలో బలంగా వాయిస్ వినిపించిన వాళ్లలో ఆయన ఒకరు. కానీ గోపాలపురం నుంచి వచ్చిన ముప్పిడి వెంకటేశ్వరరావుకు అధిష్టానం ఎమ్మెల్యే సీటు ఇవ్వడంతో జవహర్ సైలెంట్ అయ్యారు. అంతా చల్లబడింది అనుకున్న సమయంలో కొవ్వూరులో కొత్త గ్రూపులు బయలుదేరడం నియోజకవర్గంలో కుమ్ములాట్లకు కారణమైంది. వైసీపీని ఇబ్బందులు పెట్టాలనుకునే ప్రయత్నంలో ఆ పార్టీ నాయకులను ఆకర్షించి సొంత పార్టీలో కుమ్ములాట్లకు కారణం అవుతోంది అధిష్టానం అనేది కొవ్వూరు పరిస్థితులను గమనిస్తున్న వారి విశ్లేషణ. టిడిపి హై కమాండ్ మేల్కొని కొవ్వూరు గ్రూపు తగాదాలకు వెంటనే ఫుల్ స్టాప్ పెట్టకపోతే పార్టీ కంచుకోటగా ఉన్న కొవ్వూరు చేజారిపోయే ప్రమాదం లేకపోలేదు.

# అడ్డంగా బుక్కైన పేర్ని నాని



భారత శక్తి ప్రతినిది

విజయవాడ, జనవరి 10, ( మాజీ మంత్రి పేర్ని నాని చుట్టూ ఉచ్చు బిగిస్తోంది. రేషన్ బియ్యం పక్కదారిపై పోలీసులకు కీలక ఆధారాలు లభించినట్లు సమాచారం. మచిలీపట్నంలోపౌరసరఫరాల శాఖకు సంబంధించి గోదాములు దాదాపు 7వేల బస్తాల బియ్యం మాయమైన సంగతి తెలిసిందే. ఆ గోదాములు పేర్ని నాని భార్య జయసుధ పేరిట ఉన్నాయి. ఈ నేపథ్యంలో పౌరసరఫరాల శాఖ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పేర్ని నాని భార్యతో పాటు గోదాము మేనేజర్ మానస్ తేజ కు సైతం నోటీసులు జారీ చేశారు. అటు పేర్ని నాని భార్య పోలీస్ విచారణకు సైతం హాజరయ్యారు. ఇంకోవైపు నానికి సైతం పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఈ తరుణంలో ఈ కేసులో కీలక ఆధారాలు పోలీసులకు పట్టుబడినట్లు సమాచారం. మార్చిలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అధికారులు ఎన్నికల విధుల్లో ఉండగా.. బియ్యం పక్కదారి పట్టించినట్లు అనుమానిస్తున్నారు. ఇందుకోసం మినీ వ్యానులను వాడినట్లు తెలుస్తోంది.పేర్ని నాని భార్య జయసుధ పేరిట ఇక్కడ గోదాములు ఉన్నాయి. వైసిపి హయాంలో పౌరసరఫరాల శాఖకు ఈ గోదాములను అద్దెకు ఇచ్చారు. రేషన్ బియ్యం ఈ గోదాముల్లో నిల్వ చేస్తుంటారు. వీటికి మేనేజర్ గా మానస తేజ్ ఉన్నారు. ఆయన నెలవారి జీతం 12 వేల రూపాయలు. అయితే ఒకేసారి మానస తేజ అకౌంట్ నుంచి పేరుని నాని ఎకౌంటుకు లక్ష 75 వేల రూపాయలు బదిలీ చేయడంపై అనుమానాలు ఉన్నాయి. తన యజమాని భర్తకు అంత మొత్తంలో మేనేజర్ పంపడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మానస తేజ అకౌంట్లో సుమారు 25 లక్షల మేర లావాదేవీలు జరిగినట్లు కూడా గుర్తించారు. అందులో ఆయన వ్యక్తిగత అవసరాల కోసం ఏడు లక్షల రూపాయలు ఖర్చు చేసినట్లు కూడా పోలీస్ విచారణలో తేలినట్లు తెలుస్తోంది. తక్కువ జీతానికి పనిచేస్తున్న మానస తేజకు అంత మొత్తంలో డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందని పోలీసులు విచారణ చేపడుతున్నారు. పోలీసులకు కీలక ఆధారాలు లభించడంతో.. కోర్టు అనుమతితో ఒకరోజు కస్టడీలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఈ బ్యాంకులో నగదు లావాదేవీల విషయంపై ప్రశ్నించినట్లు సమాచారం. మేనేజర్ మానస తేజ తో పాటు డ్రైవర్ మంగారావు, మిల్లర్ ఆంజనేయులను పోలీసులు విచారించారు. అయితే మేనేజర్ పోలీస్ విచారణకు సహకరించలేదని తెలుస్తోంది. దీంతో నిందితులను మరో ఐదు రోజులు కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. మంత్రిగా ఉంటూ పేర్ని నాని అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడు ఆయన చుట్టూ ఈ కేసు తిరుగుతోంది. అయితే నిందితులు పేర్ని నాని పేరు ఎక్కడ బయట పెట్టడం లేదు. రేషన్ బియ్యం తరలించడంలో మాజీమంత్రి నానికి సంబంధం లేదని.. తామే విక్రయించామని వారు పోలీసులకు చెబుతున్నారు. ఇంతటి భారీ మొత్తంలో బియ్యం తరలించడం అక్కడ పనిచేసే వారితో సాధ్యం కాదని.. కచ్చితంగా నాని హస్తం ఉందని అనుమానిస్తున్నారు. అందుకే ఆయన చుట్టూ ఉచ్చు బిగిస్తున్నారు. మొత్తానికైతే ఈ రేషన్ బియ్యం పంపిణీ వ్యవహారంలో మాజీ మంత్రి పేర్ని నానిని అరెస్టు చేసేందుకు సిద్ధపడుతున్నట్లు సమాచారం. మరి అందులో ఎంత వాస్తవం ఉందో తెలియాలి.

# టీడీపీకి తొక్కిసలాట బాధ

భారత శక్తి ప్రతినిది

తిరుపతి, జనవరి 10, ప్రతి ఒక్కరి జీవితంలో కొన్ని మానని గాయాలు ఉంటాయి. మరపురాని సంఘటనలు ఉంటాయి. కానీ టిడిపి ప్రభుత్వహయాంలో గోదావరి పుష్కరాలతో పాటు తాజాగా తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఒక మాయని మచ్చ. 2015, జూలై 14న గోదావరి పుష్కరాల తొలి రోజున తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో 36 మంది ప్రాణాలు కోల్పోయారు. అనేకమంది గాయపడ్డారు. ఇందులో మహిళలతో పాటు చిన్నారులే అధికంగా ఉన్నారు. తాజాగా తిరుపతిలోజరిగిన తొక్కిసలాటలో ఆరుగురు మృత్యువాత పడ్డారు. అయితే ఇది అనుకోకుండా జరిగిన ప్రమాదాలే అయినా.. రెండు ఘటనలు టిడిపి ప్రభుత్వ హయాంలో జరగడం విశేషం.నాడు టిడిపి అధికారంలో ఉంది. మహా పుష్కరాల పేరుతో నెలల తరబడి అప్పట్లో ప్రచారం జరిగింది. అయితే తొలి రోజు పుష్కర స్నానాన్ని ప్రారంభించాలనుకుని భావించారు సీఎం చంద్రబాబు. ఆయన పుష్కర స్నానం చేసిన కొద్దిసేపటికి తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో 29 మంది ప్రాణాలు కోల్పోయారు. 52 మంది గాయపడ్డారు. చంద్రబాబు ప్రచార యావ కారణంగానే ఈ ఘటన చోటు చేసుకుందని ప్రతిపక్షాలు విమర్శించాయి. అప్పట్లో దర్శకుడు బోయపాటి శ్రీనివాస్ కు పుష్కర క్రతువును చిత్రీకరించే బాధ్యతను అప్పగించినట్లు ప్రచారం నడిచింది. ఈ నేపథ్యంలోనే పుష్కర ఘాట్లో తన కుటుంబ సభ్యులతో సీఎం చంద్రబాబు పుష్కర స్నానం ఆచరించారు. దాదాపు రెండు గంటలపాటు ఆయన ఘాట్లోనే ఉండిపోవడంతో జన రద్దీ పెరిగిందని.. దానికి కారణంగానే ఒక్కసారిగా తూపులాట జరిగిందన్నది విపక్షాల ఆరోపణ. నాడు చంద్రబాబుతో పాటు మంత్రుల కాన్వాయ్ లో 20 వాహనాలు ఘాట్లో గంటల ఉండిపోయాయని కూడా ఆరోపణలు వెల్లువెత్తుతాయి. అప్పట్లో చంద్రబాబు సర్కార్ రిటైర్డ్ జడ్జి సోమయాజులతో కూడిన ఏకసభ్య కమిషన్ ను వేసింది. అయితే నాటి పుష్కర వీడియోలు బయటకు రాకపోవడం విశేషం.తెలుగుదేశం కూటమి ప్రభుత్వంఉంది. ఈనెల 10 నుంచి తిరుమలలో ఉత్తర ద్వార దర్శనానికి టీటీడీ ఏర్పాట్లు చేస్తోంది. అయితే ఈ దర్శనానికి సంబంధించి టోకెన్ల జారీకి ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసింది టీటీడీ. అయితే ఒక్కసారిగా ఇక్కడ తొక్కిసలాట జరగడంతో ఆరుగురు మృత్యువాత పడ్డారు. పదుల సంఖ్యలో గాయపడ్డారు. సరైన ప్రణాళిక లేకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వంతో పాటు టీటీడీపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అయితే ఈ ఘటనపై ప్రభుత్వం సీరియస్ గా స్పందించింది. ఈ సాయంత్రానికి కొందరు అధికారులపై వేటు పడే అవకాశం ఉంది. ఇప్పటికే సీఎం చంద్రబాబు తిరుమల చేరుకున్నారు. ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు.అయితే కేవలం టిడిపి ప్రభుత్వ హయాంలోఇటువంటి ఘటనలు జరగడం మాయని మచ్చగా నిలుస్తోంది. చంద్రబాబుకు పాలనాథుడిగా పేరు ఉంది. కానీ ఇటువంటి కార్యక్రమాల నిర్వహణలో లోపాలు వెలుగు చూస్తుండడం.. ప్రజల ప్రాణాలు గాల్లో కలిసిపోతుండడం మైనస్ గా మారుతోంది. అయితే ఈ ఘటన తర్వాత కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో ప్రచారం కూడా పెరిగింది. దీనిని టిడిపి కూటమి శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నాయి. మొత్తానికి అయితే ఇటువంటి ఘటనలు ఏ ప్రభుత్వం ఉన్నా మాయని మచ్చగా నిలవడం ఖాయం. గతంలో గోదావరి పుష్కరాలు టిడిపి ప్రభుత్వానికి మైనస్ చేశాయి. ఇప్పుడు తిరుపతిలో తొక్కిసలాట ఎటువైపు దారితీస్తుందోనన్న ఆందోళన కూటమి పార్టీల్లో కనిపిస్తోంది.

## మణికొండ లో హైడ్రా కూల్చివేతలు

హైదరాబాద్ జనవరి 10, ం

నెక్నాంపూర్ లోని లేక్ వ్యూ విల్లాస్ లోహైడ్రా అధికారులు కూల్చివేతలు చేపట్టారు.నెక్నాంపూర్ చెరువును కబ్జాదారులు కబ్జా చేసినట్లు గుర్తించారు. అక్రమంగా వెలసిన నిర్మాణాలను కూల్చివేసారు. గతంలో రెవెన్యూ,జీహెచ్ఎంసి అధికారులతో పాటు హెచ్ఎండిఏ అధికారులు కూల్చివేతలు చేపట్టారు. మూడుసార్లు కూల్చివేసినా యధావిధిగా అక్రమ నిర్మాణాలు చోటు చేసుకున్నాయి. ఈ సారి హైడ్రా కమిషనర్ రంగనాథన్ అదేశాల మేరకు కూల్చివేతలు, భారీ పోలీస్ బందోబస్తు నడుమ కొనసాగాయి. గురువారం నాడు హైడ్రా కమిషనర్ రంగనాథ్ చిన్న చెరువును సందర్శించారు. 24 గంటల్లోనే యాక్షన్ ప్లాన్ మొదలుపెట్టింది హైడ్రా.

## సింహాచలంలో ఉత్తర ద్వార దర్శనానికి విస్తృత ఏర్పాట్లు

విశాఖపట్నం జనవరి 10,

వైకుంఠ ఏకాదశిని పురస్కరిం చుకొని విశాఖ సింహాచలం ఆలయాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు.దేవస్థానం ఆల యంలో ఉత్తర ద్వార దర్శనానికి విస్తృత ఏర్పాట్లు పూర్తి చేశారు. పూలు, పండ్లతో ఆలయప్రాంగణాన్ని అందంగా తీర్చిదిద్దారు. భక్తుల రద్దీని దృష్టిలో రేపు తెల్లవా రుజామున 4గంటలకు దర్శనాలు ప్రారంభమవుతాయని నిర్వాహకు లు తెలిపారు.స్వామివారి దర్శినా నికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా నిర్వహకులు విస్తృత ఏర్పాటు చేశారు.

## ఇద్దరు దొంగలకు దేహశుద్ధి

మెదక్ తూప్రాన్ మండలం యావపూర్ గ్రామ శివారులో స్థానికులుఇద్దరు దొంగలకు దేహశుద్ధి చేసారు. గురువారం అర్ధరాత్రి ఇనుపరాడ్లు, బోర్ మోటార్ల కేబుల్ వైర్లు చోరీ చేస్తూనీడగా రైతులు పట్టుకుని చితకబాదారు తరువాత ఇద్దరిని పోలీసులకు అప్పగించారుర.

## వైకుంఠ ఏకాదశి.. ఆలయాలకు పోటెత్తిన భక్తులు

వైకుంఠ ఏకాదశి వేడుకలు తెలుగు రాష్ట్రాల్లో ఘనంగా ప్రారంభమయ్యాయి. తిరుమలలో స్వామివారికి ఏకాంతంగా కైంకర్యాలు, అభిషేకాలు నిర్వహించిన అనంతరం 4.30 గంటల నుంచి భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. భద్రాచలంలో ఉదయం 5 గంటలకు భక్తులకు సీతారామచంద్ర స్వామివారి దర్శన భాగ్యం కల్పించారు. యాదగిరిగుట్టలో స్వామి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. గరుడ వాహనంపై వాసుదేవుడి రూపంలో స్వామివారు ఉత్తర ద్వార దర్శనం ఇవ్వనున్నారు

## శ్రీవారిని దర్శించుకున్న గవర్నర్ బండారు దత్తత్రేయ

తిరుమల హరియాణా గవర్నర్ బండారు దత్తత్రేయ వైకుంఠ ఏకాదశి సందర్భంగా కుటుంబ సమేతంగా తిరుమల తిరుపతి లో శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దర్శనం చేసుకున్నారు.

తరువాత అయన మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశి పర్వ దినాన ఏడుకొండలవాడు శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని కుటుంబ సమేతంగా వైకుంఠ ద్వార దర్శనం చేసుకోవడం చాలా సంతోషాన్నికలిగించిందని, ఆధ్యాత్మికంగా అనిపించిందని, మనస్సుకు శాంతిని కలిగించిందని పేర్కొన్నారు.

వైకుంఠ ఏకాదశి రోజున స్వామి వారిని ఉత్తర ద్వారా దర్శనం చేసుకుంటే మోక్షం కలుగుతుందని, జీవితం ధన్యమవుతుందని భావిస్తారని భక్తులందరు ఎంతో భక్తి తో, ఆత్రుతతో స్వామి వారి దర్శనానికి వస్తారని అన్నారు. ఈ పర్వదినానికి ఒక రోజు ముందు స్వామి దర్శన టిక్కెట్ల కోసం ఆశతో వచ్చిన ఆరుగురు భక్తులు మరణించిన విషాదకర సంఘటన తనకు బాధ కలిగించిందని, ఇది మానవ తప్పిదమేనని అభిప్రాయపడ్డారు. అధికారులు మరియు ప్రభుత్వం ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా భక్తుల నమ్మకాన్ని కాపాడాలని కోరుతున్నట్లు తెలిపారు.

## తొక్కిసలాటలో గాయపడ్డ వారికి వైకుంఠ ద్వార దర్శనం..

తిరుమల:

తిరుపతిలో వైకుంఠ ఏకాదశి ద్వార దర్శనం టోకెన్ల జారీ సమయంలో జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు మృతిచెందగా, అనేక మంది గాయపడ్డ విషయం తెలిసిందే. అయితే ఇవాళ వైకుంఠ ఏకాదశి సందర్భంగా.. ఆ తొక్కిసలాటలో గాయపడ్డ భక్తులు ఇవాళ దర్శనం కల్పించారు. సీఎం చంద్రబాబు, టీటీడీ ఛైర్మెన్ ఆదేశాల ప్రకారం.. తొక్కిసలాటలో గాయపడ్డవారికి ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేశారు. అధికారుల ప్రకారం గాయపడ్డ వారిలో మొత్తం 52 మందికి ప్రత్యేకంగా ఉత్తరద్వార దర్శనం కల్పించారు. ఉత్తర ద్వార దర్శనం కోసం అనేక మంది ప్రముఖులు కూడా తిరుమలకు చేరుకున్నారు.

## భరోసా కేంద్రాన్ని సందర్శించిన సీనియర్ సివిల్ జడ్జి

ఆసిఫాబాద్, జనవరి 10 జిల్లా కేంద్రంలోని భరోసా కేంద్రాన్ని ఆదివారం సీనియర్ సివిల్‌జడ్జి యువరాజా సందర్శించారు. ఈ సందర్భంగా భరోసా కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. అంతకుముందు కోర్టు ఆవరణలో బాలలహక్కుల



పరిరక్షణపై నిర్వ హించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలలహక్కుల పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ పాటుప డాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి అనంతలక్ష్మి, డీడబ్ల్యూవో భాస్కర్, డీసీపీవో మహేష్, న్యాయ వాదులు వెంకటేశ్వర్లు, డీసీఆర్బీ సీఐ శ్రీధర్ ఆయాశాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## పశువులకు గ్రాసం కరువు

వాంకిడి, జనవరి 10: పశు గ్రాసంకోసం రైతులు ఇబ్బందులు పడుతు న్నారు. మండలంలో రైతులు ఎక్కువగా పత్తి, కంది పటలు సాగుచేస్తుడంతో పశుగ్రాసం కొరత ఏర్పడుతోంది. గతంలో ఎక్కువగా జొన్న పంటను పండించే రైతులు పదేళ్లనుంచి పత్తి, కందిపంటను పండిస్తున్నారు. దీంతో జొన్నసాగు తగ్గి పశుగ్రాసం కొరత తీవ్రంగా ఏర్పడింది. ప్రతి సంవత్సరం మండల రైతులు పక్క రాష్ట్రమైన మహారాష్ట్ర నుంచి వరిగడ్డని కొనుగోలు చేస్తున్నారు. మహారాష్ట్ర లోని వివిధ ప్రాంతాల నుంచి కేవలం పికప్ వాహనంలో వచ్చేంత గడ్డికే రూ.5నుంచి 6వేలు చెల్లించి తీసుకువస్తున్నారు.



జిల్లాలో దాదాపు 55వేల ఎకరాలకు పైగా వరిపంటను రైతులుసాగుచేస్తున్నారు. కూలీల కొరత కారణంగా యంత్రాలు ఉపయోగించ డంతో పశువులకు మేత కరువైంది. యంత్రాల వాడకం ఎక్కువకావడంతో 60శాతం మాత్రమే వరిగడ్డి వస్తుండడంతో పశుగ్రాసం కొరత ఏర్పడుతోంది. ప్రభుత్వం రాయితీపై గడ్డి విత్తనాలు సరఫరా చేయకపోవడంతో పాడి, వ్యవసాయం కోసం పశువులు ఉన్న రైతులు పశుగ్రాసం కోసం భారీగా డబ్బులు వెచ్చిం చాల్సి వస్తోంది. కొందరు రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో పశువులను విక్రయిస్తున్నారు. దీంతో గ్రామాల్లో పశువుల సంఖ్య కూడా తగ్గుముఖం పడుతోంది.

## రహదారి భద్రత మాసోత్సవాలను విజయవంతం చేయాలి

ఆసిఫాబాద్, జనవరి 10

రహదారి భద్రత మాసోత్సవాలను విజయవంతం చేయాలని రాష్ట్ర రవాణా, వెనకబడిన తరగతుల సంక్షేమశాఖ మంత్రి పొన్నంప్రభాకర్ అన్నారు. హైదరా బాద్ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్‌లు, ఎస్పీలు, పోలీసుకమిషనర్లు, రవాణా శాఖాధికారులు, ఆర్టీసీఅధికారులు, విద్యాశాఖ అధికారు లతో రహదారి భద్రత మాసోత్సవాల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ నెల31వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే రహదారి భద్రత మాసోత్సవాలను విజయ వంతం చేసే దిశగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. రహదారి భద్రత నియమాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని



తెలిపారు. రహ దారులపై ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవా లన్నారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో బ్లాక్ స్పాట్‌లను గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి జిల్లాలో రోడ్డుభద్రతపై అవగాహనకేంద్రాల ఏర్పా టుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌నుంచి కలెక్టర్ మాట్లాడుతూ రహదారి భద్రత మాసో త్సవాలను సంబంధిత అధికారుల సమ న్వయంతో జిల్లాలో కొనసాగిస్తామని తెలిపారు. జిల్లాలో ప్రమాదాలు జరిగే 45ప్రాంతాలను గుర్తించి ప్రమాదాల నియంత్రణకు అవసరమైనచర్యలు చేపడతామన్నారు. మూలమలుపు, వేగనిరోధకాలు, ఇతరప్రాంతాల్లో సూచి కలను ఏర్పాటు చేసి వాహనదారుల రక్షణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రవాణాశాఖఅధికారి రాంచందర్, ఏఎస్పీ ప్రభాకర్‌రావు, రోడ్లు భవనాల శాఖాధికారి సురేం దర్, గిరిజనాభివృద్ధి అధికారి రమాదేవి, షెడ్యుల్డ్ కులాల ఉపసంచాలకులు సజీవన్, ఆర్టీసీ, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

## రాజకీయాలకు అతీతంగా అర్హులైన అందరికి ఇందిరమ్మ ఇండ్లు -రేషన్ కార్డులు ఇవ్వాలి:సిపిఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు

సూర్యాపేట జిల్లా బ్యూరో (భారతశక్తి) జనవరి 10:తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఇస్తానన్న ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులను రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలకు అందజేయాలని గరిడేపల్లి సిపిఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతూ సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేసి, అనంతరం తహశీల్దార్ బండా కవిత కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారంటీలలో, చాలా గ్యారంటీలను రెండవ సంవత్సరం అవుతున్నా, ఇంతవరకు మొదలు పెట్టలేదని, మొదలు పెట్టిన గ్యారంటీలలో ఏ ఒక్క గ్యారంటీని పూర్తిగా అమలు చేయలేదన్నారు. ప్రజలకు మాటలు చెప్పి మభ్యపెట్టకుండా అర్హులైన పేద వారందరికీ ఇందిరమ్మ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, రేషన్ కార్డులు వెంటనే ఇచ్చి ఆదుకోవాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని



కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు కడియాల అప్పయ్య, పోటు పూర్ణ చందర్ రావు, కుందూరు వెంకటరెడ్డి, యడ్ల అంజిరెడ్డి కొత్తగూడెం మాజీ సర్పంచ్, హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

## సూర్యాపేట సబ్ డివిజన్ డి.ఎస్.పి కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ క్షేత్రస్థాయి పర్యవేక్షణతో వేగంగా పోలీసు సేవలను అందించవచ్చు: సూర్యాపేట జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్



సూర్యాపేట జిల్లా బ్యూరో( భారత శక్తి )జనవరి 10: సూర్యాపేట జిల్లా ఎస్పి సన్ ప్రీత్ సింగ్ శుక్రవారం సూర్యాపేట సబ్ డివిజన్ డి.ఎస్.పి కార్యాలయాన్ని సందర్శించారు. ఎస్పి కి డి.ఎస్.పి రవి, డివిజన్ సి ఐ లు స్వాగతం పలికారు. ముందుగా డి.ఎస్.పి కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. పోలీసు సిబ్బంది ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండి పోలీసు సేవలు అందించాలని సూచించారు. అనంతరం కార్యాలయం రికార్డ్స్, పరిసరాలు పరిశీలించి తనిఖీ చేశారు. డివిజన్ పరిధిలో ఎన్ఫోర్స్మెంట్ గురించి సమీక్షించారు. రౌడి షిటర్స్, సస్పెక్ట్ పై నిఘా ఉంచాలని ఆదేశించారు. కేసులు,పిర్యాదులు పెండింగ్ ఉంచకుండా క్షేత్ర స్థాయి పర్యవేక్షణ చేయాలని అన్నారు. పోలీస్ స్టేషన్ లను, సర్కిల్ ఆఫీసుల పనితీరు పరిశీలించాలని డి.ఎస్.పి కి తెలిపినారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట డీఎస్పీ రవి, మునగాల సీఐ లు రాజశేఖర్, వీర రాఘవులు, శ్రీను, రఘువీర్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ నాగభూషణం, డి సి ఆర్ బి ఎస్ ఐ యాకూబ్, ఎస్పి సీసీ సందీప్, డి సి ఆర్ బి సిబ్బంది అంజన్ రెడ్డి, శేఖర్ రెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు వారి తల్లులకు ఆటపాటల నిర్వహించిన బ్రైట్ బీస్ స్కూల్





సూర్యాపేట జిల్లా బ్యూరో(భారతశక్తి) జనవరి 10:హుజూర్ నగర్ పట్టణం లోని ఎస్ ఆర్ ఎమ్ బ్రైట్ బీస్ స్కూల్ నందు సంక్రాంతి సందర్భంగా విద్యార్థుల తల్లులకు మరియు పిల్లల కోసం పాఠశాల ప్రాంగణంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు ఈ సందర్భంగా ఆటలు పాటలు ఉప్పలకుప్ప, చెమ్మా చెక్క, గోటిళ్ళు, గోలికాయలు, సంధ్య గొబ్బమ్మ ఆటలుప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమానికి తల్లులంతా ఉత్సాహంగా హాజరై పిల్లలతో కలిసి తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ సంతోషంగా పాల్గొన్నారు మాతృమూర్తులకు మరియు పిల్లలకు మధ్య సాన్నిహిత్యాన్ని పెంపొందించడమే ఆటల ప్రధాన లక్ష్మని అన్నారుతల్లి తండ్రులు మాట్లాడుతూ ఇలాంటి ఆటపాటల వలన చిన్నతనాన్ని గుర్తుచేస్తున్నాయని అన్నారు. ఈ ఆటలలో పాఠశాలలో సంక్రాంతి వాతావరణం నెలకొన్నది. ఈ కార్యక్రమంలో ఆటలలో పాటలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. పాఠశాల కరస్పాండెంట్ కేశినేని శ్రీదేవి విద్యార్థులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికత అలవర్చుకోవాలి: ఎమ్మెల్యే కోవ లక్ష్మి



ఆసిఫాబాద్‌రూరల్, జనవరి 10: ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. అనంత శ్రీవిభుషిత రామా నందచార్య పాదుక దర్శన కార్యక్రమం కరపత్రాలను తన నివాసంలో నిర్వాహకులతో కలిసి ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాకేంద్రంలోని ప్రేమలాగార్డెన్ సమీపంలో ఈనెల 17న పాదుక దర్శన కార్యక్రమం నిర్వహిస్తామని పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నిర్వహకులు దిలీప్ గైక్వాడ్, బాలాజీ, పండరి, నిరక్షక్ తదితరులు పాల్గొన్నారు.

జైనూర్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆదివారం మండలంలోని దేవుగూడ గ్రామాన్ని సందర్శించారు. ఇటీవల జైనూరు ఘటనలో హత్యాచారయత్నానికి గురైన మేస్రాం నీలబాయితో మాట్లాడారు. ఆమె ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆమెను పరామర్శిం చేందుకు నేడు సోమవారం తెలంగాణ జనజాగృతి అధ్యక్షు రాలు, నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రానున్నారని నాయ కులు, గ్రామస్థులకు చెప్పారు. ఎమ్మెల్సీ కవిత బాధితు రాలు నీల బాయిని పరామర్శించి తక్షణ సహాయం కింద 2లక్షల రుపాయల ఆర్థికసాయం అందజేస్తారని తెలిపారు. జైనూరు ఘటన పూర్వపరా లను గ్రామస్థులను అడిగి తెలుసుకుంటారన్నారు. ఎమ్మెల్సీ పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల సహకార చైర్మన్ కొడప హన్నుపటేల్, బీఆర్ఎస్ మండల పార్టీ ఉపాధ్యక్షుడు ఆత్రం శంకర్, మాజీ సర్పంచులు మడాడి భీంరావ్, మేస్రాం రాహుల్, కుంర శాంరావ్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం

బెల్లంపల్లి, జనవరి 10): క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దారుఢ్యానికి ఎంతో దోహదపడతాయని సివిల్ జడ్జి ముఖేష్, ఏసీపీ



రవికుమార్‌లు అన్నారు. ఏఎంసీ క్రీడా మైదానంలో న్యాయవాదులకు, పోలీసుల మధ్య ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. వారు మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రతీ ఒక్కరు ఒత్తిడికి లోనవుతారని, క్రీడలతో ఒత్తిడి దూరమవుతుందని, స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుందన్నారు.

క్రీడలతో మానసికంగా దృ?ఢంగా తయారవుతారని పేర్కొన్నారు. పోలీసు జట్టు విజయం సాధించింది. సీఐలు దేవయ్య, కుమారస్వామి, అఫ్జలోద్దీన్, న్యాయవాదులు చిప్ప మనోహర్, రవి, మాదురి రాకేష్‌తో పాటు సబ్ డివిజన్‌లోని ఎస్సైలు, పోలీసు సిబ్బంది, న్యాయవాదులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లల సంక్షేమానికి కృషి

ఆసిఫాబాద్‌రూరల్, జనవరి 10

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలు, గర్భిణులు, బాలింతలు, కిశోరబాలికల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని అదనపుకలెక్టర్ దీపక్‌తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ గ్రామంలో రైతువేదిక వద్ద గల అంగన్‌వాడీకేంద్రాన్ని జిల్లా సంక్షేమాధికారి ఆడెపు భాస్కర్‌తో కలిసి సందర్శించారు. కేంద్రంలో సదుపా యాలు, పరిసరాలు, ఆహారసామాగ్రి నాణ్యత పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్‌వాడీకేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, ఇతరమౌళిక సదుపా యాలను పూర్తిస్థాయిలో కల్పించాలని ఆదేశించారు. పిల్లల ఆరోగ్య స్థితిగతులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. శారీ రక, మానసిక ఎదుగుదల లోపం ఉన్న పిల్లలను గుర్తించి వారిసంక్షేమంపై ప్రత్యేకదృష్టి సారించాలన్నారు. గర్భిణులు తమ వివరాలను సమీప ప్రాథమికఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుప త్రుల్లో నమోదు చేసుకుని సమయానుసారంగా వైద్యపరీక్షలు నిర్వహించుకునే విధంగా చూడాల న్నారు. వారు సమయానికి మందులు, పౌష్టికాహారం తీసుకునే విధంగా అవగాహన కల్పించాల న్నారు. కార్యక్రమంలో పంచాయతీ ఈఈ ప్రభాకర్, మున్సి పల్ కమిషనర్ భుజంగరావు, సీడీపీఎ సదియ, ఏపీవో చంద్రశేఖర్, తదితరులు ఉన్నారు.

'పది'లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి..

కాగజ్‌నగర్: రానున్న పదోతరగతి పరీక్షల్లో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సా?ధించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. ఆదివారం కాగజ్‌నగర్‌లోని ప్రభుత్వ ఉన్నతపాఠశాలను ఆయన, సబ్‌కలెక్టర్ శ్రద్ధాశుక్లా సందర్శించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పదోతరగతి పరీక్షల్లో విద్యా ర్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా మాట్లాడుతూ పదోతరగతి పరీక్షలకు విద్యార్థులంతా సన్నద్ధం కావాలన్నారు. సమయాన్ని వృథా చేయకుండా పరీక్షలకు ప్రిపేర్ కావాలన్నారు. అనంతరం విద్యార్థులకు అందించే భోజనం తదిత రాలను పరిశీలించారు.

## మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాలి

వేమనపల్లి, జనవరి10: మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఆర్‌డీవో కిషన్ సూచించారు. నీల్వాయి, కేతనపల్లి, ముల్కలపేట గ్రామాల్లో జరుగుతున్న నర్సరీ పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వచ్చే హరితహారం కోసం మొక్కల పెంపకంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అన్ని గ్రామాల్లో మునగ, వెదురు, ఈత, తాడి, నీలగిరి మొక్కలను పెంచాలన్నారు. ఉపాధిహామీ పథకంలో భాగం గా ఫాంఫాండ్ పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. రూ.300 గరిష్ట వేతనం పొందాలని, ప్రతీ జాబ్ కార్డుదారుడు వంద రోజులు పని పూర్తి చేసుకోవాలన్నారు. ముల్కలపేట గ్రామపంచాయతీలో ఇందిరాక్రాంతి పథకంలో మంజూరైన ఊర కోళ్ల పెంపకాన్ని పరిశీలించి సూచనలు చేశారు. ఎంపీడీవో శ్రీని వాస్, ఏపీవో సత్యప్రసాద్, ఏపీఎం ఉమారాణి, ఈసీ మధుకర్, కార్యదర్శులు అశోక్, జాపర్, పాల్గొన్నారు.

## ఐదు నెలలుగా వేతనాల్లేవు!

వాంకిడి, జనవరి 10: ఒక నెల వేతనం ఆలస్యమైతేనే ఇంటి నిర్వహణ ఖర్చులు, నెలవారీ చెల్లింపులు(ఈఎంఐ) ఆలస్యమై ఇబ్బందులు పడతాం. అదే నెలల తరబడి వేతనాలు రాకుంటే పరిస్థితి ఎలాం ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. చాలీచాలని వేతనాలతో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న అతిథి అధ్యాపకులకు ఐదు నెలలుగా వేతనాలు అందడంలేదు. ప్రభుత్వ అధ్యాపకులతో సమానంగా పనిచేస్తూ విద్యార్థులకు పాఠాలు బోధిస్తూ విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న వీరి వేతనాలను ప్రభుత్వం విడుదల చేయడం లేదు. దీంతో వారంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే జీతాలు విడుదల చేయాలని కోరుతున్నారు.

జిల్లాలో 61మంది అధ్యాపకులు..

జిల్లాలో 11 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా ఇందులో రగ్యులర్ అధ్యాపకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఖాళీ అధ్యాపక పోస్టులను ప్రభుత్వం భర్తీ చేపట్టకపోవడంపతో విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా అతిథి అధ్యాపకులను



నియమించారు. ప్రభుత్వ జూనియర్ కశాళాలల్లో రెగ్యులర్ అధ్యాపకుల పోస్టులు ఖాళీగా ఉన్న చోట అన్ని కళాశాలల్లో మొత్తం 61మంది ఒప్పంద, అతిథి అధ్యాపకులను ప్రభుత్వం నియమించింది. ఈ ఏడాది జూన్‌లో వారిని రెన్యువల్ చేసింది. ప్రతీ పీరియడ్‌కు రూ.390చొప్పున నెలకు 72పీరియడ్‌లకు రూ.28,080కి మించకుండా వేతనం చెల్లించారు. జూన్, జూలై రెండు నెలల వేతనం చెల్లించారు. ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు, డిసెంబరు నెలలు అంటే ఐదు నెలల జీతం ఇంతవరకు విడుదల చేయలేదు. నెలకు రూ.28,080అని చెపుతున్నా.. ఒక నెలలో సెలవులు ఎక్కవగా ఉన్నా లేదా అనారోగ్యం, ఇతర పనులతో విధులకు హాజరు కాకున్నా వాటికి వేతనం కట్ చేస్తున్నారు. వచ్చే డబ్బులను కూడా నెలనెలా ఇవ్వకుంటే తమ కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలంటూ అధ్యాపకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల – వాంకిడి

నాలుగు నెలల నుంచి వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నాం. దీంతో కుటుంబ పోషణ భారంగా మారింది. చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న తమకు నెలల తరబడి వేతనాలు ఇవ్వకుండా ప్రభుత్వం జాప్యం చేస్తోంది. వెంటనే వేతనాలు విడుదల చేసి ఆదుకోవాలి.

# అజ్ఞాతం వీడి.. జనజీవన స్రవంతిలో కలవండి:సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా

హనుమకొండ ప్రతినిధి(భారత శక్తి)జనవరి10:హసన్ పర్తి మండలంలోని వంగపాడు గ్రామానికి చెందిన మావో యిస్టు నేత మందా రూబెన్ అలి యాస్ మంగన్న గత 40 ఏళ్లుగా అజ్ఞాతంలో ఉండగా.. కుటుంబాన్ని శుక్రవారం సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా పరామర్శించారు. ఈ సందర్భంగా రూబెన్ తల్లి చంద్రమ్మతో పాటు కుటుంబ సభ్యుల ప్రస్తుతస్థితిగతులతో పాటు చంద్రమ్మ ఆరోగ్య పరిస్థితిపై డీసీపీ అడిగి తెలుసు కున్నారు. అనంతరం సోమయ్య తల్లి చంద్రమ్మకు పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పంపించిన చీరతో పాటు కుటుంబ సభ్యు లకు దుప్పట్లు,నిత్యా వసర సరకులను పోలీసు అధికా రులు అందజేశారు. ఏదైనా ఆరోగ్య సమస్య ఏర్పడితే వైద్య చికిత్సలు అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా అజ్ఞాతంలో వుంది మావోయిస్టు పార్టీలో పని చేసి సాధించింది శూన్యమని. ఇకనైనా రూబెన్ అజ్ఞాతం వీడి జనంలోకి రావాలని, ప్రస్తుత రోజుల్లో మావోయిస్టులకు ప్రజాదరణ తగ్గిందని. ఇవే కాకుండా అజ్ఞాత జీవితం గడుపుతున్న మావోయిస్టులు ఆరోగ్య సమస్యలతో పాటు వ్యక్తిగత సమస్యలను ఎదుర్కొంటున్నారని. ఇటీవల కాలంలో అనేక మంది మావోయిస్టులు పోలీసుల



ఎదురుకాల్పుల్లో హత మయ్యారని. అదేవిధంగా.

మందా రూబెన్ ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలో కలిస్తే, ఆయనపై ఉన్న రివార్డ్ పాటుప్రభుత్వం నుంచి వచ్చే ప్రయోజ నాలు అందేలా కృషిచేస్తామని డీసీపీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాజీపేట ఏసీపీ తిరుమల్, స్పెషల్ బ్రాంచ్ 2 ఏసీపీ పార్థసారథి, హసన్ పర్తి ఇన్స్ స్పెక్టర్ చేరాలు తదితర పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# జడ్ కన్వెన్షన్ హాల్ ను ప్రారంభించిన వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్.నాగరాజు,ఖుస్రు పాషా సాహెబ్



భారతశక్తి ప్రతినిధి, హనుమకొండ, జనవరి 10:గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 56వ డివిజన్ పరిధిలోని పరిమళ కాలనీలో నిర్వాహకులు జాకీర్ షరీఫ్ నూతనంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించిన జడ్ కన్వెన్షన్ బ్యాంకెట్ హాల్ అండ్ గెస్ట్ హౌస్ లను ముఖ్య అతిథులుగా విచ్చేసిన వర్ధన్నపేట ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కే.ఆర్.నాగరాజు,హజ్ కమిటీ ఛైర్మన్ ఖుస్రు పాషా సాహెబ్ రిబ్బన్ కట్ చేసి గురువారం రాత్రి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పరిమళ కాలనీ వాసులకు అతి తక్కువ ధరల్లో ఫంక్షన్ హాల్ ఇవ్వాలని నిర్వాహకులకు సూచించారు.అనంతరం జడ్ కన్వెన్షన్ యాజమాన్యం,నిర్వాహకులు జాకీర్ షరీఫ్ ఎమ్మెల్యే నాగరాజు,ఖుస్రు పాషాలకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో 56 వ డివిజన్ కార్పొరేటర్ సిరంగి సునీల్ కుమార్,డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొంక హరిబాబు,కాంగ్రెస్ పార్టీ నాయకులు పిన్నింటి అనిల్ రావు,గడ్డం శివరాం ప్రసాద్, కందుకూరి పూర్ణచందర్, శనిగరపు అనిత,యూత్ నాయకులు లావుడ్య రవి, విజయ్,శ్రీను,అనిల్ లతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,బంధుమిత్రులు,తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ మెట్టు రామలింగేశ్వర స్వామివారిని దర్శించుకున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు,కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి



భారతశక్తి ప్రతినిధి, హనుమకొండ, జనవరి 10:వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని ప్రతి ఒక్కరిపై ఆ వైకుంఠవాసుడి దివ్యాశీస్సులు ఉండాలని ప్రార్థిస్తూ కాజీపేట మడికొండ శ్రీ మెట్టు రామలింగేశ్వర స్వామి సహిత శ్రీ సీతా రామచంద్ర, అనంత పద్మ స్వామి వార్లను శుక్రవారం దర్శించుకొని దేవాలయంలో ప్రత్యేక పూజలు అభిషేకాధి కార్యక్రమాలను ముఖ్య అతిథులుగా విచ్చేసిన వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు,కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి నిర్వహించారు.తొలుత ఆలయ ప్రధాన అర్చకులు ఎమ్మెల్యే, చైర్మన్ లను వేద మంత్రాల నడుమ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.అనంతరం ఎమ్మెల్యే, చైర్మన్ కు అర్చకులు స్వామి వారి శేష వస్త్రాలను అందజేసి ఆశీర్వచనం చేశారు.ఈ కార్యక్రమంలో మెట్టుగుట్ట ఆలయ చైర్మన్ పైడిపాల రఘు చందర్,డైరెక్టర్లు,ఆలయ ఈవో శేషుభారతి,ప్రజా ప్రతినిధులు మాజీ ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశ పరీక్ష ఏర్పాట్లు పటిష్ఠంగా చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశాలు

(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, జనవరి 10: శుక్రవారం కామారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి నవోదయ ఆరవ తరగతిలో ప్రవేశ పరీక్ష కోసం లైన్ డిపార్ట్మెంట్స్ తో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈనెల 18వ తేదీన నవోదయ విద్యాలయంలో ఆరవ తరగతిలో ప్రవేశం కోసం నిర్వహించే పరీక్షకు జిల్లాలో 14 సెంటర్లలో ఏర్పాటు చేయడం జరిగింది. ప్రతి సెంటర్ కు చీఫ్ సూపరింటెండెంట్ , డిపార్ట్మెంటల్ ఆఫీసర్ మరియు ఇన్విజిలేటర్లను నియమించడం జరిగిందని తెలిపారు. అడిషనల్ కలెక్టర్ లైన్ డిపార్ట్మెంట్స్, ఎలక్ట్రిసిటీ , మెడికల్, పోలీస్, మున్సిపల్ వివిధ డిపార్ట్మెంట్స్ తో సమావేశం నిర్వహించి పటిష్ఠమైన ఏర్పాట్ల గురించి తగిన ఆదేశాలు జారీ చేశారు. ప్రతి సెంటర్లోనూ విద్యార్థులకు సౌకర్యంగా త్రాగునీరు, పరిసరాలు శుభ్రంగా ఉండేలా ఏర్పాటు చేయవలెనని చెప్పారు. ప్రవేశ పరీక్ష సమయము



ఉదయం 11:30 నుండి 1:30 వరకు ఉంటుందని తెలియజేశారు. నవోదయ ప్రవేశపరీక్షకు అన్ని రకాల ఏర్పాట్లను పటిష్ఠంగా పూర్తి చేయవలెనని ఆదేశించారు.

# పశువుల హింస, వధ, అక్రమ తరలింపు అండర్ సెక్షన్ 38/1978, సెక్షన్ 59/1960 ప్రకారం నేరం: జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.

కడప- జనవరి,10(భారత శక్తి ప్రతినిధి ):ఎవరైనా పశు వులను హింసించినను, బహిరంగ ప్రదేశంలో వధ చేసినను, అక్రమంగా తరలించినను అండర్ సెక్షన్ 38/1978, సెక్షన్ 59/1960 ప్రకారం తట్టబద్ధంగా చర్యలు తీసుకోవడానికి దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అన్నారు. స్థానిక కలెక్టరేటులోని బోర్డు మీటింగ్ హాలులో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జంతువులపై క్రూరత్వాన్ని నిరోధించడం ( ప్రివెంటేషన్ ఆఫ్ క్రూసిల్టి టు అనిమల్స్) సంబంధిత అధికారులతో సమావేశం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ ఎవరైనా పశువులను హింసించినను, బహిరంగ ప్రదేశంలో వధ చేసినను, అక్రమంగా తరలించినను అండర్ సెక్షన్ 38/1978, సెక్షన్ 59/1960 ప్రకారం తట్టబద్ధంగా చర్యలు తీసుకోవడానికి దోహదపడుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి రాష్ట్రంలోనూ ప్రివెంటేషన్ ఆఫ్ క్రూసిల్టి టు అనిమల్స్ యొక్క సొసైటీని ఏర్పాటు చేయవలసిందిగా ఉత్తర్వులు జారీ చేసి ఉన్నారని అన్నారు. కడప జిల్లాలో 2017 సంవత్సరంలో సొసైటీని ఏర్పాటు చేయడం జరిగిందని సొసైటీ నందు 14 మంది అఫీషియల్ మెంబర్స్ మరియు 5 మంది పశు సంరక్షణ పౌరులను సభ్యులుగా నియమించబడ్డారన్నారు. జిల్లా లోని ఎస్ పి సి ఏ వారు మన రాష్ట్రంలోని అనిమల్ వెల్ఫేర్ బోర్డు మరియు స్థానిక వెల్ఫేర్ ఆర్గనైజేషన్ సున్నితంగా పనిచేయడానికి దోహదం చేస్తుందన్నారు. అందుకుగాను చట్టబద్ధమైన చర్యలు కు దోహదపడుతుందన్నారు. ఈ సొసైటీ కి పూర్తి హక్కులు చట్టబద్ధంగా కలవని అన్నారు. సొసైటీ ముఖ్య ఉద్దేశం అనాధ పశువులకు వసతి వాటి యొక్క ఆరోగ్యం సంరక్షణ కూడా చూడడం అన్నారు. సొసైటీ యొక్క కర్తవ్యం అన్ని గోశాలలను పర్యవేక్షించడం మరియు పశువుల ఆరోగ్యానికి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. వ్యక్తి అయినా ప్రోద్బలంతో గాని, జంతువుల యజమాని గాని, పశు వులు/ జంతువులను హింసించిన గాని, అబద్ధం గా చర్యలు తీసుకోబడుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ అనిమల్ వెల్ఫేర్ బోర్డు ఎక్విప్మెంట్ కమిటీ వారు 11-7-2022న విద్యాశాఖ వారితో



కైండ్ నెస్ క్లబ్బు ఏర్పాటు చేయమని తెలిపి ఉన్నారని అన్నారు. అనిమల్ వెల్ఫేర్ బోర్డు వారు పాఠశాల పిల్లలకు గాను ఐదవ తరగతి నుండి 8వ తరగతి వారికి మిషన్ కోర్స్ మరియు తొమ్మిదో తరగతి నుండి 12 వ తరగతి వారికి అడ్వాన్స్ కోర్సెస్ మీద ఆన్లైన్ శిక్షణ ఇవ్వబడుతుందని తెలిపారు.ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం వారు కోడిపందాలు జరగకుండా చట్టాలను అమలుకి తీసుకు వచ్చారన్నారు. అయినప్పటికీ కొన్ని ప్రాంతాలలో ఈ పందాలను నిర్వహించడం జరుగుతోందని పందాలను నిషేధం కోసం జిల్లా లోని రెవెన్యూ అధికారులతోనూ, పోలీసు శాఖ వారితోనూ, పశు సంవర్ధక శాఖ సిబ్బంది తోను కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కోడి పందెములు నిర్వహించుట చట్టరీత్యా నేరం, నిర్వహించి నా ప్రోత్సహించిన వారికి అరెస్టు చేయడానికి పూర్తి అధికారం ఉందన్నారు. అక్రమంగా ఆవులను, దూడలను, ఒంటెలను తరలించిన అనిమల్ రూల్ 1978, 2001 ప్రకారం శిక్ష అర్హులు అన్నారు. గోవులను వదచేసిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రక్షణ మరియు గోవధ యాక్టు 1977 ప్రకారం శిక్ష ఆరుగురు అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మనోజ్ రెడ్డి, పశుసంవర్ధక శాఖ జెడి శారదమ్మ, డీఈఓ మీనాక్షి, తదితర అధికారులు, ఎన్జీవోలు తదితరులు పాల్గొన్నారు.

# సమాజంలో ఆడపిల్లల శాతాన్ని పెంచేందుకు ప్రతి ఒకరూ కృషి చేయాలి.

## -లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు: జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి.



కడప, జనవరి,10(భారత శక్తి ) : లింగ నిర్ధారణ పరీక్షలకు పాల్పడితే.. కఠిన చర్యలు తీసుకుంటాం అని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్ జిల్లా వైద్య, పి జి ఆర్ ఎస్ సమావేశ హాలులో ఆరోగ్య , కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో డిఎంహెచ్ఓ డా.నాగరాజు అధ్యక్షతన పిసి పీఎన్డిటీ (గర్భస్థ శిశు లింగ నిర్ధారణ, మాతా శిశు మరణాల నిర్మూలన) పై సంబంధిత అధికారులతో డిస్ట్రిక్ట్ లెవెల్ అడ్వైసరీ కమిటీ సమావేశం జరిగింది.

ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ ఆడబిడ్డను రక్షించుకోవాలంటే ఎక్కడా కూడా లింగనిర్ధారణ పరీక్షలు జరగకుండా చేయాలన్నారు. గర్భస్రావాలు జరగకుండా ఆపాలని, అందుకోసం ప్రజల్లో విస్తృత ప్రచారం, అవగాహన కల్పించాలన్నారు. ఇందులో భాగంగా అంగన్వాడీ వర్కర్లు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, మహిళా సంరక్షణ కార్యదర్శిలకు ప్రధాన భాగస్వామ్యం కల్పించాలన్నారు. గర్భస్థ శిశు మరణాలను అరికట్టడం ద్వారా లింగ నిష్పత్తిలో అసమానతను తొలగించడంతో పాటు సమాజంలో స్త్రీ నిష్పత్తి పెంపుదల సాధ్యమవుతుందన్నారు.

బ్రూణ హత్యల నివారణ కోసం పోలీసు శాఖ వారి సహకారం కూడా తీసుకోవాలన్నారు. కర పత్రాలు, గోడపత్రాల ద్వారా బ్రూణ హత్యలపై వైద్య ఆరోగ్య శాఖ మరియు ఐసిడిఎస్, విద్యా శాఖలు సంయుక్తంగా విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. అలాగే మాతాశిశు మరణాలు అంశంపై కూడా ఆయన పలు సూచనలు జారీ చేశారు. అంతే కాకుండా బాల్య వివాహాలు, మహిళా వివక్షత వంటి అంశాలపై కిశోరీ బాలబాలికలకు కళజాత బృందాల ద్వారా అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.


ప్రత్యేకించి దళిత, ముస్లిం మైనారిటీ వర్గాలు ఉన్న ప్రాంతాల్లో ఈ అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ సెక్రెటరీ, జిల్లా సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫకురుద్దీన్, డిటిసి డిఎస్పి షేక్ అబ్దుల్ కకరీ, డీఎంహెచ్వో డాక్టర్ కే నాగరాజు పిసి పీఎన్డిటీ సభ్యులు రిమ్స్ సూపరింటెండెంట్ డా. రమాదేవి, జడ్పీ సీఈవో ఓబులమ్మ, డీఈవో మీనాక్షి సాంఘిక సంక్షేమ శాఖ డిడి సరస్వతి, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మాత శిశు మరణాల నియంత్రణకు ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణ: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. హరీష్ రాజ్

మంచిర్యాల జిల్లా ప్రతినిధి (భారత శక్తి), జనవరి 10:జిల్లాలో మాత శిశు మరణాల నియంత్రణపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. హరీష్ రాజ్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో అర్మాన్ సంస్థ ద్వారా ఆరోగ్య కార్యకర్తలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి అర్మాన్ సంస్థకు చెందిన డా. సౌజన్య, డా. అనిల్, ప్రశాంత్ కుమార్, భాస్కర్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ జిల్లాలో మాత శిశు మరణాల నియంత్రణపై ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గర్భం దాల్చిన మహిళలు సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రులలో వివరాలు నమోదు చేసుకుని సమయానుసారంగా వైద్య పరీక్షలు నిర్వహించుకుని అవసరమైన మందులు, పౌష్టిక ఆహారం తీసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. తల్లిలను శక్తివంతం చేయడానికి, ఆరోగ్యవంతమైన పిల్లల ఎదుగుదలకు, మాత శిశు మరణాలు తగ్గించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అధిక ప్రమాద గర్భాలను నివారించడానికి, జ్ఞానము, నైపుణ్యాలను మెరుగుపరిచి తల్లి, బిడ్డల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించి మరణాల నివారణకు కృషి చేయాలని తెలిపారు. రక్తహీనత, అధిక రక్తపోటు, ప్రసవ పూర్వ రక్త స్రావణం, మధుమేహం, మూర్ఛ, సి సెక్షన్ చరిత్ర, కామెర్లు, గుండె జబ్బుతో గర్భధారణ, గర్భధారణలో ఊపిరి సరిగా అందకపోవడం, క్షయ, జ్వరము, పిండం ఎదుగుదల పరిమితి 20 వారాల ముందు రక్తస్రావం అవడం, నెలలు నిండకుండా ప్రసవం, గర్భధారణ సమయంలో హెచ్ ఐ వి, మానసిక ఆరోగ్యం, గర్భధారణ సమయంలో బరువు పెరగడం మొదలైన వాటిపై శిక్షణ అందించడం జరిగిందని తెలిపారు.

# ఘనంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు.

మందమర్రి టౌన్, జనవరి 10(భారత శక్తి):పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు .ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఉత్తర ద్వార దర్శనం ప్రజలు క్యూ లైన్ లో ఉండి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సిపి శ్రీనివాస్ .జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మరియు ఏరియా జిఎం దేవేందర్, అంజనీపుత్ర డైరెక్టర్ పిల్లి రవి లు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఉదయం 5 గంటలకే ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు మరియు దర్శనం నిర్వహించారు. ఆలయ పూజారులు అనంత చారి నరసింహచార్యులు, ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దర్శనం చేసుకున్నారు. ఆలయముక ద్వారా సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయముక ద్వారా నుండి క్యూ లైన్ వెంబడి క్యూలో ఉంటూ భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు ఎవరికి ఇబ్బంది కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా ఎన్ పి సి సిబ్బంది పోలీసులు సమన్వయంతో మరియు ఆలయ వాలంటీర్లు సేవా సభ్యులు తమ సేవలను వినియోగించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దర్శనం సాఫీగా సాగేందుకు నిరంతరం కృషి చేశారు సీఐ శశిధర్



రెడ్డి ఎస్ఐ రాజశేఖర్ రెడ్డి ఎస్ఐ రాజశేఖర్లు ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు అదేవిధంగా బ్రహ్మంగారి ఆలయంలో పట్టణంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు .ఈ సందర్భంగా అనంత చారి నరసింహచార్యులు మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశి రోజు ఉత్తర ద్వార దర్శనం చేసుకుంటే సకల పాపాలు తొలగిపోతాయని ముక్కోటి దేవతలను పూజించిన పుణ్యం లభిస్తుందని వారు పేర్కొన్నారు .ఈ కార్యక్రమంలో నాయకులు అధికారులు పాల్గొన్నారు.

# ఈ నెల 12న స్వామి వివేకానంద జయంతి వేడుకలు:జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి కీర్తి రాజ్ వీరు

మంచిర్యాల జిల్లా ప్రతినిధి,(భారత శక్తి), జనవరి 10:జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఈ నెల 12వ తేదీ ఉదయం 10:30 గంటలకు స్వామి వివేకానంద జయంతి వేడుకలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి కీర్తి రాజ్ వీరు ఒక ప్రకటనలో తెలిపారు.

యువజన సంఘాల సభ్యులు, మహిళా సంఘాల సభ్యులు, జిల్లా అధికారులు, క్రీడాకారులు, సంఘాల నాయకులు సకాలంలో హాజరై విజయవంతం చేయలని కోరారు.

# నేను అలా చేస్తే ప్రేక్షకులు విసిగిపోతారు: బాలీవుడ్‌పై సాయిపల్లవి వ్యాఖ్యలు

'రామాయణ'తో బాలీవుడ్‌లోకి అడుగుపెడుతున్నారు నటి సాయిపల్లవి ఈనేపథ్యంలోనే బాలీవుడ్ పీఆర్ ఏజెన్సీలను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారామె. తరచూ లైమ్‌లైట్‌లో నిలవడం కోసం అక్కడి నటీనటులు పీఆర్ ఏజెన్సీలతో ఒప్పందాలు కుదుర్చుకుంటారని చెప్పారు. తాను బాలీవుడ్‌లోకి అడుగుపెట్టిన సమయంలో ఒక వ్యక్తి తనకు ఫోన్ చేసి.. దీనిగురించే అడిగారని 'అమరన్' ప్రమోషన్స్‌లో తెలిపారు.



"బాలీవుడ్‌కు చెందిన ఒక వ్యక్తి ఇటీవల నాకు ఫోన్ చేశారు. నన్ను నేను ప్రమోట్ చేసుకోవడానికి.. తరచూ వార్తల్లో నిలవడం కోసం పీఆర్ టీమ్‌ను నియమించుకుంటారా? అని అడిగాడు. అలా చేస్తే నేను లైమ్‌లైట్‌లో ఉండగలను. ప్రేక్షకులు తరచూ నా గురించి మాట్లాడుకుంటారు. దానివల్ల నాకు ఎలాంటి ఉపయోగం లేదనిపించింది. ఎందుకంటే, తరచూ నా గురించి మాట్లాడాలన్నా ప్రేక్షకులకు విసుగు వస్తుంది. అందుకే నాకు అలాంటిది ఏమీ అవసరం లేదని చెప్పా" అని సాయిపల్లవి తెలిపారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు నెట్టింట వైరల్‌గా మారాయి. బాలీవుడ్ సెలబ్రిటీలు తరచూ వార్తల్లో ఉండటానికి కారణం పీఆర్ బృందాలేనని పలువురు భావిస్తున్నారు. ఈమేరకు కామెంట్స్ చేస్తున్నారు.

'రామాయణ' ప్రాజెక్ట్‌ను నితేశ్ తివారీ ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిస్తున్నారు. రణ్‌బీర్ కపూర్ రాముడిగా కనిపించనున్నారు. సీత పాత్రలో సాయిపల్లవి.. రావణుడిగా యశ్ నటిస్తున్నారు. ప్రస్తుతం ఇది చిత్రీకరణ దశలో ఉంది. 'అమరన్' విషయానికి వస్తే.. ఉగ్రదాడిలో అమరుడైన మేజర్ ముకుంద్ వరదరాజన్ జీవితాధారంగా ఈ సినిమా తెరకెక్కింది. శివ కార్తికేయన్, సాయిపల్లవి జంటగా నటించారు. దీపావళి కానుకగా అక్టోబర్ 31న విడుదల కానుంది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు సినీప్రియుల మనసుని హత్తుకున్నాయి.

# రాజమౌళి కూడా టచ్ చేయని జానర్.. అల్లు అర్జున్-త్రివిక్రమ్ మూవీపై నిర్మాత కామెంట్స్



తన స్టైల్‌తో అంతర్జాతీయస్థాయిలో అభిమానులను సొంతం చేసుకున్నారు అల్లు అర్జున్ మరికొన్ని రోజుల్లో 'పుష్ప2'తో ప్రపంచ ప్రేక్షకులను మరోసారి అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ సినిమా తర్వాత మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ దర్శకత్వంలో బన్నీ ఓ సినిమా చేయనున్న సంగతి తెలిసిందే. తాజాగా ఆ చిత్రం గురించి నిర్మాత నాగవంశీ ఆసక్తికర కామెంట్స్ చేసి అల్లు అర్జున్ అభిమానుల్లో జోష్ నింపారు.

"అల్లు అర్జున్, త్రివిక్రమ్‌ల సినిమా స్క్రిప్ట్ పనులు చివరిదశలో ఉన్నాయి. 'పుష్ప 2' పూర్తయ్యాక దీని వివరాలు వెల్లడిస్తాం. జనవరిలో స్పెషల్ ప్రోమోతో సినిమాను ప్రకటిస్తాం. మార్చి నుంచి షూటింగ్ ప్రారంభిస్తాం. మార్చిలోనే అల్లు అర్జున్ చిత్రీకరణలో పాల్గొంటారు. ఇప్పటివరకు రాజమౌళి ఎన్నో గొప్ప సినిమాలు చేశారు. ఆయన కూడా టచ్ చేయని జానర్‌లో ఈ సినిమా ఉంటుంది. మంచి విజువల్స్ ఉంటాయి. ఇప్పటివరకు దేశంలో ఎవరూ చూడని కొత్త ప్రపంచాన్ని సృష్టించనున్నాం. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా దీన్ని రూపొందిస్తున్నాం" అని అన్నారు. ఇక ఇటీవల తాను మాట్లాడిన టికెట్ల ధరల వ్యాఖ్యలపై నాగవంశీ మరోసారి స్పష్టతనిచ్చారు. ఒక ఏడాదిలో మూడు, నాలుగు పెద్ద సినిమాలకే టికెట్ల ధరలు పెంచుతున్నట్లు చెప్పారు. మిగతా వాటికి రేట్లు పెంచడంలేదని స్పష్టంచేశారు. పెద్ద సినిమాలకు బడ్జెట్ ఎక్కువ అవుతుంది కాబట్టి వారం రోజులు టికెట్ల రేట్లు పెంచుతామన్నారు. జనాల దగ్గర డబ్బులు తీసుకోవడం వారి ఉద్దేశం కాదన్నారు.

గతంలో అల్లు అర్జున్- త్రివిక్రమ్ కాంబినేషన్‌లో వచ్చిన మూడు సినిమాలు సూపర్ హిట్‌గా నిలిచాయి. 'జులాయి', 'సన్నాఫ్ సత్యమూర్తి', 'అల వైకుంఠపురములో' విజయాల తర్వాత ఈ ఇద్దరి కాంబోలో రూపొందనున్న నాలుగో సినిమా ఇది. దీంతో దీనిపై అభిమానుల్లో అంచనాలు ఏర్పడ్డాయి. 'పుష్ప 2' పూర్తయిన వెంటనే త్రివిక్రమ్ చిత్రాన్ని ప్రారంభించనున్నారు. ప్రస్తుతం పుష్ప2 షూటింగ్ చివరిదశలో ఉంది. డిసెంబర్ 5న 'పుష్ప 2: ది రూల్' ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

# ప్రూఫ్ లేకుండా ఇలాంటి కామెంట్స్ ఎలా చేస్తారు?: అలియా భట్

సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉంటారు బాలీవుడ్ నటి అలియా భట్ ఆమె తాజాగా పెట్టిన పోస్ట్ వైరల్‌గా మారింది. తనపై సోషల్ మీడియాలో వస్తోన్న కామెంట్స్, యూట్యూబ్‌లో షేర్ అవుతోన్న వీడియోలపై ఆగ్రహం వ్యక్తంచేశారు. అలా కామెంట్స్ చేసేవారిని ఉద్దేశిస్తూ సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. తన శరీరంపై, మాట్లాడే విధానంపై అసభ్య కామెంట్స్ చేసేవారికి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ఎలాంటి ప్రూఫ్ లేకుండా ఇష్టానుసారం ఇలాంటి రూమర్స్ వ్యాప్తి చేసేముందు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు.




"సోషల్ మీడియాలో షేర్ అవుతోన్న నా వీడియో చూస్తే చాలా హాస్యాస్పదంగా అనిపిస్తోంది. ఆ వీడియో సృష్టించినవారి దృష్టిలో నా నవ్వు వంకరగా ఉంటుంది.. నేను మాట్లాడే విధానం భిన్నంగా ఉంటుంది.. నేను అందం కోసం సర్జరీలు చేయించుకున్నాను.. అలాగే వారి దృష్టిలో నాకు పక్షవాతం కూడా వచ్చింది. ఎలాంటి నిర్ధరణ చేయకుండా ఇలాంటి రూమర్స్ సృష్టించి మీరంతా తమాషాలు చేస్తున్నారా? ఎలాంటి ప్రూఫ్ లేకుండా ఎదుటి వ్యక్తులపై ఇలాంటి కామెంట్స్ చేయడం నేరమని మీకు తెలియదా? కేవలం వ్యూస్ కోసం ఇలా చేయడంలో అర్థం లేదు. ఇలాంటి కామెంట్స్ చేసేవారిలో మహిళలు కూడా ఉండడం సిగ్గుచేటు. ఈ పద్ధతి ఎప్పటికైనా హానికరమే" అని పేర్కొన్నారు. ఈ పోస్ట్‌కు పలువురు సెలబ్రిటీలు మద్దతు ఇస్తున్నారు.

ఇలాంటి ట్రోల్స్‌పై అలియా స్పందించడం ఇదేం తొలిసారి కాదు. ప్రముఖ దర్శక, నిర్మాత మహేశ్‌భట్ కుమార్తెగా వెండితెరకు పరిచయమైన అలియా.. తనపై అధిక సంఖ్యలో విద్వేషపూరితమైన పోస్టులు పెడుతుంటారని అవి తన దృష్టికి కూడా వస్తాయని గతంలోనూ తెలిపారు. అవే తనలో ప్రేరణ నింపుతుంటాయన్నారు. ఎదుటి వ్యక్తిపై దయతో వ్యవహరిస్తే అది ఎంతో మార్పుకు దారితీస్తుందన్నారు. ఇక అలియా తాజాగా 'జిగ్రా'తో ప్రేక్షకులను పలకరించారు. అలియా, వేదాంగ్ రైనా ప్రధానపాత్రల్లో నటించిన ఈ చిత్రానికి వాసన్ బాలా దర్శకత్వం వహించారు. యాక్షన్ థ్రిల్లర్ ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా విడుదల తర్వాత కూడా పలువురు అలియాను ట్రోల్ చేసిన సంగతి తెలిసిందే.

# '35 చిన్న కథ కాదు'కు అరుదైన ఘనత

నివేదా థామస్ (విశ్వదేవ్ ఆర్.ప్రియదర్శి (ప్రధాన పాత్రల్లో రూపొందిన చిత్రం '35 చిన్న కథ కాదు' నందకిశోర్ ఇమాని దర్శకత్వం వహించారు. రానా నిర్మాతగా వ్యవహరించిన ఈ చిత్రం అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. గోవాలో నిర్వహించనున్న ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియాలో దీన్ని ప్రదర్శించనున్నారు. ఈ చిత్రాన్ని ఇండియన్ పనోరమ అధికారికంగా ఎంపిక చేసినట్లు ప్రకటించింది. గోవాలోని పనాజీలో నవంబర్ 20 నుంచి 28 వరకు ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా ఈవెంట్ జరగనుంది. ఇందులో మొత్తం 25 చలనచిత్రాలను ప్రదర్శించనున్నారు. దీనికోసం 384 చిత్రాలు ఎంట్రీ చేయగా.. తెలుగు నుంచి '35 చిన్న కథ కాదు' ఎంపికైంది. ఈవిషయాన్ని తెలుపుతూ చిత్రబృందం పోస్ట్ పెట్టింది. ఇది తెలుగు సినిమాకు గర్వకారణమని పేర్కొంది.




కథేంటంటే: ప్రసాద్ (విశ్వదేవ్ రాచకొండ) ఓ బస్ కండక్టర్. ఆయన భార్య సరస్వతి (నివేదా థామస్). తన భర్త, పిల్లలు అరుణ్, వరుణ్.. ఈ ముగ్గురే ప్రపంచంగా బతుకుతున్న ఓ గృహిణి ఆమె. తిరుపతిలో వీళ్ల నివాసం. చిన్నోడు ఫర్వాలేదు కానీ, పెద్దోడు అరుణ్‌కి మాత్రం లెక్కల పాఠాలు ఓ పట్టాన అర్థం కావు. సున్నాకి ఏమీ విలువ లేనప్పుడు దానిపక్కన ఒకటి వచ్చి నిలబడితే పది ఎందుకవుతుందని అడుగుతుంటాడు. తను అడిగే ఇలాంటి కొన్ని ప్రశ్నలకు టీచర్ల దగ్గర కూడా సమాధానాలు దొరకవు. దాంతో లెక్కల మాస్టారు చాణక్య (ప్రియదర్శి) ఫండమెంటల్స్‌ను ప్రశ్నిస్తే మిగిలేది జీరోనే అంటూ అరుణ్‌కి జీరో అని పేరుపెట్టి చివరి బెంచీకి పంపిస్తాడు. ఆరోతరగతిలో ఫెయిల్ కూడా చేస్తాడు. దీంతో తన తమ్ముడి క్లాస్‌లో కూర్చోవాల్సివస్తుంది. ఈసారి అరుణ్ స్కూల్‌లో ఉండాలంటే లెక్కల్లో కనీసం 35 మార్కులు సాధించాల్సిందే. ఆ పరిస్థితుల్లో జీరో అరుణ్.. క్లాస్‌లో హీరో ఎలా అయ్యాడు? తన కొడుక్కి లెక్కల పాఠాలు అర్థం కావాలని టెన్త్ ఫెయిల్ అయిన తల్లి సరస్వతి ఏం చేసింది? అరుణ్ అసలు 35 మార్కులు తెచ్చుకున్నాడా, లేదా? అనేది మిగతా కథ.

## అలాంటి పేర్ల నుంచి బయటపడాలి

%అవకాశాలు వెతుక్కుంటూ రావు. మనమే వాటిని సృష్టించుకోవాలని అంటోంది బాలీవుడ్ నాయిక కృతి సనన్. ఈ ఏడాది 'తేరే బాతోన్ మే ఐసా ఉల్జా జియా', 'క్రూ' లాంటి భిన్నమైన కథలతో తెరపై సందడి చేసిన కథానాయికీమె. ఆమె, కాజోల్ ప్రధాన పాత్రలో శశాంక చతుర్వేది తెరకెక్కించిన చిత్రం 'దో పత్తి'. కృతి తొలిసారి ద్విపాత్రాభినయం, నిర్మాతగా వ్యవహరించడం ఈ సినిమాతోనే కావడం విశేషం. ఈ రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ శుక్రవారం విడుదల కానుంది. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న కృతి.. తన సినీప్రయాణం గురించి కొన్ని ఆసక్తికర సంగతుల్ని పంచుకుంది.



"ఇటీవలే చిత్రపరిశ్రమకు వచ్చి దశాబ్దం పూర్తి చేసుకున్నాను. ఎప్పుడూ నటిగానే పరిమితం కాకుండా ఏదైనా కొత్తగా చేయాలని మొదటి నుంచే అనుకునేదాన్ని. ఏ పని చేస్తే బాగుంటుంది? ఎలాంటి పాత్ర పోషిస్తే అందరికీ నచ్చుతుంది? అని ఆలోచించేదాన్ని. వచ్చిన ప్రతీ అవకాశాన్ని అందుకుంటూ నెమ్మది నెమ్మదిగా నాలో ఉన్న నైపుణ్యాలని ఎలా మెరుగు పరుచుకోవాలో అర్థం చేసుకున్నాను. చిత్ర పరిశ్రమకు వచ్చిన కొత్తలో ఎవ్వరికీ అంత తొందరగా అవకాశాలు రావు. సంవత్సరాలు గడుస్తున్న కొద్దీ సమయం, విజయం, అనుభవంతోనే మీకు అవకాశాలు వస్తాయి. కొన్ని సందర్భాల్లో అవకాశాల్ని మనమే సృష్టించుకోవాల్సి వస్తుంది. 'దో పత్తి'తో వచ్చిన అవకాశంతో నటిగానే కాకుండా నిర్మాతగా నిరూపించుకోవాలనుకున్నాను".

ద్విపాత్రాభినయం ఊహించలేదు..

"నేను నిర్మాతగా మారడానికి రెండు కారణాలున్నాయి. మొదటిది ఇప్పటి వరకూ నేను పోషించని పాత్రల్ని సినిమాల్లో సృష్టించుకునే స్వేచ్ఛ నాకు ఉంటుంది. రెండోది ప్రస్తుతం చిత్రపరిశ్రమలో మహిళా ప్రాధాన్య కథలపై ఎక్కువగా ఆసక్తి చూపించడం లేదు దర్శక నిర్మాతలు. ఇలాంటి సమయంలో నేను ఒక నిర్మాతగా ప్రపంచానికి తెలియని కొత్త కొత్త కథలపై దృష్టిపెడుతూ ప్రేక్షకులకు పరిచయం చేయాలనుకుంటున్నాను. 'మిమీ' తర్వాత నేను లోతైన పాత్రల్లో నటించాలని కోరుకున్నాను. కానీ అస్సలు అలాంటి పాత్రలు మహిళల కోసం రాయట్లేదు. కనికా భిన్నమైన కథలను, పాత్రలను రాస్తుంది కాబట్టి నేను ఆమెతో పనిచేయాలని అనుకుంటున్నానని చెప్పాను. '

# వారంతా క్షేమంగా ఉండాలని ప్రార్థిస్తా: శివ కార్తికేయన్

శివ కార్తికేయన్ హీరోగా నటించిన తాజా చిత్రం 'అమరన్' . రాజ్ కుమార్ పెరియసామి దర్శకత్వంలో ఇది రూపొందింది. ఉగ్రదాడిలో అమరుడైన మేజర్ ముకుంద్ వరదరాజన్ జీవితాధారంగా తెరకెక్కిన ఈ సినిమా ఈనెల 31న ప్రేక్షకుల ముందుకురానుంది. ఇందులో శివ కార్తికేయన్ ముకుంద్ పాత్రలో కనిపించనున్నారు. ఈ నేపథ్యంలో ఆయన ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. తాను మిలటరీ అధికారులతో గడిపిన రోజులను గుర్తుచేసుకున్నారు.

"ఈ సినిమా కోసం కొందరు మిలటరీ అధికారులతో గడిపాను. వారంతా తమ కుటుంబాలకు దూరంగా ఉండి ఎంత కష్టపడుతున్నారో వివరించారు. ఈ సినిమాలో రాష్ట్రీయ రైఫిల్ దళాన్ని చూపించాం. వారు మిషన్‌కు వెళ్లేవారు. ఒక రోజు నేను అక్కడ ఉన్నప్పుడే ఇంటెలిజెన్స్ సమాచారం అందుకొని మిషన్‌కు వెళ్లారు. వాళ్లతో కొన్ని రోజులు గడిపిన కారణంగా.. ఆ మిషన్‌కు వెళ్లినవారంతా క్షేమంగా తిరిగి రావాలని కోరుకున్నా. వాళ్లు క్షేమంగా ఉండాలని రోజూ ప్రార్థిస్తాను. వారు వచ్చాక ఒక అధికారి మరణించినట్లు చెప్పారు. ఒక రాత్రి వాళ్లను ఎంత ప్రభావితం చేసిందో వివరించారు. రాష్ట్రీయ రైఫిల్‌లోని అధికారులంతా మానసికంగా ఎంతో దృఢంగా ఉన్నారు. వారు ఎప్పుడు మిషన్‌కు వెళ్తారో.. వెళ్లిన వారిలో ఎవరు తిరిగి వస్తారో తెలియదు" అన్నారు.

ఈ సినిమా కోసం తన లుక్స్‌ను మార్చుకున్నట్లు శివ కార్తికేయన్ తెలిపారు. 'ఇందులో నేను కాలేజీ రోజుల్లో కెప్టెన్‌గా, మేజర్‌గా రెండు రకాలుగా కనిపిస్తా. ముకుంద్ సర్ ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీలో పనిచేసినప్పుడు, మేజర్‌గా చేసినప్పుడు రెండు లుక్స్ ఒకదానికొకటి పూర్తిగా భిన్నంగా ఉంటాయి. సినిమా ప్రారంభమైనప్పుడు నేను 72 కిలోలు ఉన్నాను. తర్వాత ముకుంద్ ఆఫీసర్ ట్రైనింగ్ అకాడమీలో ఉన్నట్లు చూపిన సన్నివేశాల కోసం 80 కిలోలకు పెరిగాను. ఆ తర్వాత ఆయన మేజర్‌గా ఉన్నప్పటి సీన్స్ కోసం 75 కిలోలకు వచ్చాను. ఈ సినిమా వల్ల నేను కూడా మానసికంగా దృఢంగా మారాను.



# 'సండేని సన్-డ్యూటీ'గా మార్చాలేమో: 90 పని గంటలపై హర్ష్ గొయెంకా

వారానికి 90 గంటల పాటు పని చేయాలని, ఆదివారం సెలవునూ వదిలేయాలని ఎల్ అండ్ టీ ఛైర్మన్ ఎస్.ఎన్. సుబ్రహ్మణ్యన్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చకు దారితీశాయి. ఈ అంశంపై ప్రముఖ పారిశ్రామికవేత్త, ఆర్‌పీజీ గ్రూప్ ఛైర్మన్ హర్ష్ గొయెంకా స్పందించారు. 'ఇది వినాశనానికే గానీ.. విజయానికి కాదు' అంటూ తన అభిప్రాయాన్ని 'ఎక్స్' వేదికగా వెల్లడించారు.

''వారానికి 90 రోజుల వనా? సండేను సన్–డ్యూటీ అని.. 'డే ఆఫ్'ను ఓ 'ఊహాజనిత భావన' అని ఎందుకు మార్చకూడదు. కష్టపడి తెలివిగా పని చేయడంపై నాకు నమ్మకం ఉంది. కానీ, జీవితాన్ని శాశ్వతమైన ఆఫీసు షిఫ్టుగా మారిస్తే అది వినాశనానికి దారితీస్తుందే తప్ప విజయాన్ని తీసుకురాదు. వర్క్–లైఫ్ బ్యాలెన్స్ అనేది ఆప్షన్ కాదు. అవసరం అని నా అభిప్రాయం" అని హర్ష్ గొయెంకా 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేశారు. 'వర్క్ స్మార్ట్ నాట్ స్లేవ్' అంటూ హ్యాష్‌ట్యాగ్‌ను జత చేశారు. ప్రస్తుతం గొయెంకా పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది.

మరోవైపు సెలబ్రిటీలు దీనిపై స్పందిస్తున్నారు. ఈ వ్యాఖ్యలపై తాజాగా బాలీవుడ్ అగ్ర కథానాయిక దీపికా పదుకొణె (%ఐవవజూఅఎఖ ౹ఖఎబఎశీఅవ%) అసహనం వ్యక్తంచేస్తూ పోస్ట్ పెట్టారు. ఉన్నత హోదాలో ఉన్న వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలు చేయడంతో ఆశ్చర్యానికి గురయ్యా అని ఆమె పేర్కొన్నారు.

ఈ విషయంపై భారత మాజీ బ్యాడ్మింటన్ స్టార్ గుత్తా జ్వాలా () సోషల్ మీడియా వేదికగా స్పందించారు. విద్యావంతులు, ప్రముఖ కంపెనీలో ఉన్నత స్థాయిలో ఉన్న వ్యక్తులే ఇలా మాట్లాడడం సబబు కాదు అని పేర్కొన్నారు. మానసిక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత వంటి విషయాలను పట్టించుకోకపోవడమే కాకుండా స్త్రీల పట్ల విద్వేషపూరిత ప్రకటనలు చేయడం చాలా విచారకరం అని అభిప్రాయపడ్డారు.

ఎల్ అండ్ టీ ఛైర్మన్ ఎస్.ఎన్.సుబ్రహ్మణ్యన్ చేసిన వ్యాఖ్యలపై కంపెనీ స్పష్టతనిచ్చింది. 'ఎనిమిది దశాబ్దాలుగా జాతి నిర్మాణమే ఎల్ అండ్ టీకి ప్రధాన లక్ష్యంగా ఉంది. భారత మౌలిక వసతులు, పరిశ్రమలు, సాంకేతిక సామర్థ్యాలను ఎల్ అండ్ టీ మెరుగుపరిచింది. అభివృద్ధి చెందిన దేశంగా ఎదిగేక్రమంలో అసాధారణ లక్ష్యాలను చేరుకోవాలంటే అసాధారణ కృషి అవసరం. ఈ విస్తృత లక్ష్యాన్నే ఛైర్మన్ వ్యాఖ్యలు ప్రతిబింబిస్తాయ'ని కంపెనీ ప్రతినిధి ఒకరు వివరణ ఇచ్చారు.

# క్విక్ కామర్స్ రంగంలో 2027 కల్లా 24 లక్షల ఉద్యోగాలు




దిల్లీ: క్విక్ కామర్స్ రంగం వేగంగా వృద్ధి చెందే అవకాశం ఉండటంతో బ్లూకాలర్ ఉద్యోగ నియామకాలు పెరగాల్సిన అవసరాన్ని సృష్టించిందని నియామకాల ప్లాట్‌ఫామ్ ఇండీడ్ తన నివేదికలో తెలిపింది. భారత్‌లో 2027 నాటికి ఈ తరహా ఉద్యోగాలు 24 లక్షలు అవసరం అవుతాయని అంచనా వేసింది. పండగ సీజనులో ఇ–కామర్స్ ద్వారా కొనుగోళ్లు ఎక్కువగా జరుగుతుండటాన్ని దృష్టిలో ఉంచుకొని గత త్రైమాసికంలో క్విక్ కామర్స్ కంపెనీలు 40,000 మందిని నియమించుకున్నాయని ఇండీడ్ ఇండియా సేల్స్ హెడ్ శశి కుమార్ తెలిపారు. బ్లూకాలర్ ఉద్యోగాలు.. శారీరక శ్రమతో కూడుకున్నవి. డెలివరీ డ్రైవర్లు, రిటైల్ కేంద్రాల్లో పనిచేసే సిబ్బంది తరహా ఉద్యోగాలు వీటి కిందకు వస్తాయి. విద్య కంటే అనుభవం ప్రాధాన్యంగానే ఈ ఉద్యోగ నియామకాలు ఉంటాయి. 'భారత్‌లో క్విక్ కామర్స్ పరిశ్రమ వేగవంత వృద్ధి దిశలో సాగుతోంది. ఈ వృద్ధికి తగ్గట్లుగా గిరాకీ అవసరాలను తీర్చేందుకు బ్లూకాలర్ నియామకాలు చేపట్టడమూ గణనీయంగా పెరుగుతుంద'ని పీటీఐ వార్తా సంస్థకు ఆయన తెలియజేశారు. పరిశ్రమ మరింతగా విస్తరించడం కొనసాగితే.. నైపుణ్యం, పాక్షిక నైపుణ్యమున్న ఉద్యోగులకు గిరాకీ పెరుగుతుంది. ఈ పరిణామంతో నియామకాల విపణిలో పోటీ తీవ్రం అవుతుంది. వేగవంతంగా సాంకేతికత ఆధారిత పరిస్థితులను అందిపుచ్చుకునే నిపుణుల కోసం ఉద్యోగ యాజమాన్యాల అన్వేషణ పెరుగుతుంద'ని వివరించారు.

ఇండీడ్ సర్వే ప్రకారం.. బ్లూకాలర్ ఉద్యోగులకు సగటున నెలకు మూల వేతనం దాదాపు రూ.22,600గా ఉంటుంది.

చెన్నై, పుణె, బెంగళూరు, ముంబయి, దిల్లీ లాంటి ప్రధాన నగరాల్లో నియామకాలు ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయని, క్విక్ కామర్స్ రంగం వేగంగా విస్తరిస్తుండటమే ఇందుకు కారణమని సర్వే తెలిపింది.

చండీగఢ్, అహ్మదాబాద్ లాంటి రెండో అంచె నగరాల్లోనూ ఉద్యోగావకాశాల్లో వృద్ధి కనిపిస్తోందని పేర్కొంది.

# టీసీఎస్ లాభం రూ.12,380 కోట్లు



ముంబయి: టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబరు త్రైమాసికంలో రూ.12,380 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. అంత క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాల లాభం రూ.11,058 కోట్లతో పోలిస్తే ఇది 11.95 శాతం అధికం. సెప్టెంబరు త్రైమాసికంలో రూ.11,909 కోట్ల లాభాన్ని ప్రకటించింది. కంపెనీ ఆదాయం రూ.60,583 కోట్ల నుంచి 5.6 శాతం పెరిగి రూ.63,973 కోట్లకు చేరింది. సెప్టెంబరు త్రైమాసికంలో ఇది రూ.64,259 కోట్లు. నిర్వహణ లాభం మార్జిన్ 24.1 శాతం నుంచి 24.5 శాతానికి పెరిగింది.

ఫలితాల సందర్భంగా ఒక్కో షేరుకు రూ.10 మధ్యంతర డివిడెండ్‌తో పాటు రూ.66 చొప్పున ప్రత్యేక డివిడెండ్‌ను కలిపి రూ.76 చెల్లిస్తామని కంపెనీ తెలిపింది. ఇందుకు జనవరి 17 రికార్డు తేదీ.

సమీక్షా త్రైమాసికంలో భారత్ నుంచి లభించిన ఆదాయంలో గణనీయంగా బీఎస్ఎన్ఎల్ నుంచే వచ్చిందని కంపెనీ తెలిపింది. 'బీఎస్ఎన్ఎల్‌తో చేసుకున్న రూ.15,000 కోట్ల భారీ ఒప్పందం చివరి దశకు చేరుకుంది. నాలుగో త్రైమాసికం నుంచి ఆదాయంపై ప్రభావం పడే అవకాశం ఉంది. దీన్ని అధిగమించేందుకు ఇతర అవకాశాల కోసం చూస్తున్నామ'ని కృతివాసన్ వెల్లడించారు. దేశ వ్యాప్తంగా డేటా సెంటర్లు, 4జీ సైట్ల ఏర్పాటు కోసం బీఎస్ఎన్ఎల్‌తో టీసీఎస్ ఒప్పందం కుదుర్చుకున్న సంగతి విదితమే. మరోవైపు బీఎఫ్ఎస్ఐ విభాగం, వినియోగదారు వ్యాపారాల్లో కొత్త ఆర్డర్లు వరుసగా 3.2 బి.డాలర్లు, 1.3 బి.డాలర్లకు చేరాయని కంపెనీ పేర్కొంది.

హెచ్–1బీ వీసాలపై పరిమితంగానే ఆధారపడినందున, అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ బాధ్యతలు స్వీకరించిన తర్వాతా కంపెనీ వ్యాపారం యథావిధిగా కొనసాగుతుందని కృతివాసన్ తెలిపారు.

టాటా గ్రూప్ కంపెనీ నుంచి బెంగళూరులో రూ.1,625 కోట్లతో భూమిని కొనుగోలు చేసినట్లు టీసీఎస్ తెలిపింది.

వచ్చే ఏడాది పెద్ద ఎత్తున ప్రాంగణ నియామకాలు

అక్టోబరు–డిసెంబరు లో ఉద్యోగులు 5,000కు పైగా తగ్గి డిసెంబరు ఆఖరుకు 6.07 లక్షలకు పరిమితమయ్యారు. వలసల రేటు 13 శాతంగా నమోదైంది. జెన్ ఏఐతో ఉద్యోగాలు కోల్పోయే పరిస్థితులు రావని, కొత్త సాంకేతికతతో నికరంగా ఉద్యోగాలు పెరుగుతాయని కృతివాసన్ వెల్లడించారు. కంపెనీ చేసుకున్న పెద్ద ఒప్పందాల్లో 10–12 శాతం జెన్ ఏఐ భాగంగా ఉండబోతోందని తెలిపారు. 2024–25లో 40,000 మందిని ప్రాంగణ నియామకాల ద్వారా నియమించుకోవాలనే లక్ష్యం ప్రణాళిక ప్రకారమే సాగుతోందని తెలిపారు. వచ్చే ఏడాది ఇంతకు మించి ప్రాంగణ నియామకాలు ఉంటాయన్నారు.

# వాల్‌స్ట్రీట్‌లో 2 లక్షల ఉద్యోగాలకు ఏఐ కత్తెర..




: గ్లోబల్ బ్యాంక్‌లు వచ్చే మూడు నుంచి ఐదేళ్లలో దాదాపు 2 లక్షల ఉద్యోగాలను కత్తిరించొచ్చని బ్లూమ్‌బెర్గ్ ఇంటెలిజెన్స్ వెల్లడించింది. ఆ సంస్థ టెక్నాలజీ ఆఫీసర్ల సర్వే ఆధారంగా కనీసం 3శాతం మేరకు ఉద్యోగాల కోత ఉండొచ్చు. ఈ అంచనాలు గురువారం పబ్లిష్ చేసింది.

ముఖ్యంగా బ్యాక్‌ఆఫీస్, మిడిల్ ఆఫీస్, ఆపరేషన్స్ వంటి విభాగాల్లో ఉద్యోగుల తగ్గింపు చోటుచేసుకొనే ప్రమాదం ఉంది. ఇక కస్టమర్ సర్వీసులో బాట్ మెసేజ్ విభాగాల్లో మార్పులు చోటుచేసుకొంటాయని ఈ నివేదిక తయారుచేసిన టోమన్ నోయెట్జెల్ వెల్లడించారు. నో యూవర్ కస్టమర్ విభాగం కూడా కృత్రిమ మేధ కారణంగా ప్రభావితం కావచ్చని తెలిపారు. రొటీన్‌గా ఒకేరకమైన పనిచేసే ఏ ఉద్యోగమైనా రిస్క్‌లో ఉన్నట్లే అని వెల్లడించారు. అలాగని అన్ని ఉద్యోగాలను తీసేయకపోయినా.. ఉద్యోగుల ట్రాన్స్‌ఫర్మేషన్‌కు దారితీయొచ్చని వెల్లడించారు.

దాదాపు బ్లూమ్‌బెర్గ్ సర్వేలో సమాధానం చెప్పినవారిలో 93 మంది 5–10శాతం ఉద్యోగుల సంఖ్య తగ్గొచ్చని అభిప్రాయపడ్డారు. వీరు అంచనాలు తయారు చేసిన సంస్థల్లో సిటీగ్రూప్, జేపీ మోర్గాన్ ఛేస్, గోల్డ్‌మన్‌శాక్స్ వంటివి ఉన్నాయి. ఇక బ్యాంకుల్లో టెక్నాలజీ మార్పులు 2027 నాటికి వాటి లాభదాయకతను పెంచి 12–17శాతం వద్దకు చేర్చవచ్చు. వచ్చే మూడు నుంచి ఐదేళ్లలో జనరేటీవ్ ఏఐ ద్వారా ఆదాయాలు 5శాతం వరకు వృద్ధి చెందొచ్చని అంచనా వేసింది.

ఇప్పటికే ఏళ్లతరబడి ఆధునికీకరణ, ఐటీ సిస్టమ్స్‌పై వెచ్చించిన బ్యాంకులు తాజాగా ఏఐ టూల్స్ వైపు మొగ్గు చూపుతున్నాయి. మిగిలిన రంగాలతో పోలిస్తే బ్యాంకింగ్‌లోనే అధిక ఉద్యోగాలు ఏఐతో ప్రభావితం కానున్నాయి. దాదాపు 54శాతం ఉద్యోగాలు ఆటోమేషన్ కావచ్చని సిటీ గ్రూప్ అభిప్రాయపడింది.

# ఐఓసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్‌కు రూ.35,000 కోట్ల ఎల్‌పీజీ సబ్సిడీ

దిల్లీ: ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ), భారత్ పెట్రోలియమ్ కార్పొరేషన్ (బీపీసీఎల్), హిందుస్థాన్ పెట్రోలియమ్ కార్పొరేషన్ (హెచ్‌పీసీఎల్)లకు రూ.35,000 కోట్ల సబ్సిడీని ప్రభుత్వం అందించే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఎల్‌పీజీని విక్రయించడం ద్వారా వచ్చిన నష్టాల భర్తీకి ఈ నిధులను అందించనున్నట్లు వెల్లడించాయి. ముడి సరకు వ్యయాలు పెరిగినప్పటికీ.. 2024 మార్చి నుంచి 14.2 కిలోల వంట గ్యాస్ సిలిండర్ ధరలో ఎలాంటి మార్పు చేయకుండా ఈ మూడు సంస్థలు కొనసాగిస్తూ వచ్చాయి. దీనివల్ల ఎల్‌పీజీ విక్రయాలపై ఈ సంస్థలు నష్టాలను చవిచూడటంతో పాటు వాటి ఏప్రిల్–సెప్టెంబరు లాభాలపైనా గణనీయ ప్రభావం పడింది. ఎల్‌పీజీ విక్రయాలపై ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.40,500 కోట్లు నష్టం వచ్చినట్లు అంచనా. ఈ నష్టంలో కొంత మొత్తాన్ని భర్తీ చేసే నిమిత్తం రెండు ఆర్థిక సంవత్సరాల కాలానికి రూ.35,000 కోట్ల సబ్సిడీని ప్రభుత్వం అందించే అవకాశం ఉందని ఈ పరిణామాన్ని దగ్గర నుంచి గమనిస్తున్న వర్గాలు తెలిపాయి.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఐఓసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్‌కు రూ.10,000 కోట్లు, వచ్చే ఆర్థిక సంవత్సరంలో మిగతా రూ.25,000 కోట్లు లభిస్తాయని పేర్కొన్నాయి. ఈ సబ్సిడీకి సంబంధించిన ప్రతిపాదనను ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టబోయే వార్షిక బడ్జెట్లో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ పొందుపరిచే అవకాశం ఉంది. 14.2 కిలోల వంట గ్యాస్ సిలిండర్‌ను ప్రస్తుత ధర వద్ద విక్రయించడం వల్ల ఒక్కో సిలిండర్‌పై రూ.240 వరకు చమురు విక్రయ సంస్థలకు నష్టం వస్తున్నట్లు ఆ వర్గాలు తెలిపాయి.




# కొనేముందు పోల్చి చూసుకోండి

డబ్బును ఆదా చేసేందుకు మనం ఎప్పుడూ ప్రయత్నిస్తూనే ఉంటాం. అదే సమయంలో నాణ్యతపైనా రాజీపడం. ఏదైనా వస్తువును కొనేముందు పోల్చి చూసుకోవడం చాలాసార్లు మర్చిపోతుంటాం. సామాజిక వేదికలు, తదితరాల ద్వారా ఇతరులు మనల్ని ప్రభావితం చేస్తున్న సందర్భాలు అనేకం. ఇలాంటప్పుడే కొనుగోలు నిర్ణయాలను ఒకటికి రెండుసార్లు తనిఖీ చేసుకోవాలి.

ఒక వస్తువును తక్కువ ధరకు కొనేందుకు ఇప్పుడు అనేక మార్గాలున్నాయి. వీటి గురించి ఒకసారి పరిశీలించి చూడండి. ఒకే వస్తువు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో వేర్వేరు రాయితీలతో లభిస్తుంటుంది. సందర్భానుసారంగా ఎక్కడ కొనాలనేది నిర్ణయించుకోవాలి.

ఆ వస్తువును మీ బంధువులు, స్నేహితులు ఎవరైనా కొన్నారా తెలుసుకోండి.

మీరు అనుకున్న వస్తువుకు ప్రత్యామ్నాయం ఉందా? తక్కువ ధరకు దొరికే అవకాశాలున్నాయా చూడండి. అదే నాణ్యతతో ఉంటే ఒకసారి ఆలోచించండి.

ఆన్‌లైన్‌లో పలు వెబ్‌సైట్లు ధరలను పోల్చి చూసుకునే వెసులుబాటును కల్పిస్తుంటాయి. ఇలాంటి వాటిని పరిశీలించవచ్చు.

విద్యుత్ ఉపకరణాలు, ఇతర విలువైన వస్తువులు కొనేటప్పుడు అవసరమైన మేరకు పరిశోధన చేయడం మంచిది. సమీక్షలు చదవండి. తక్కువ ధరకు కొనడం మంచిదే. కానీ, నాణ్యత విషయాన్నీ పరిశీలించాలి. దీర్ఘకాలిక నిర్వహణ, మరమ్మతు ఖర్చులనూ చూసుకోవాలి.

క్రెడిట్, డెబిట్ కార్డులతో కొన్నప్పుడు నగదు వాపసు, ప్రత్యేక రాయితీలు లభిస్తుంటాయి. ఇలాంటి ఆఫర్లు ఏమైనా ఉన్నాయా అని తెలుసుకోవాలి.

అవసరమైతే రెండుమూడు స్టోర్లను తిరిగి చూడండి. కొన్ని స్టోర్ల వాళ్లు ధర తగ్గించకపోయినా ఎక్కువ ఉచిత సర్వీసులు ఇవ్వడం, ఆ వస్తువుకు బీమా సదుపాయం, బహుమతిగా మరికొన్ని వస్తువులు, రివార్డు పాయింట్లు ఇవ్వడంలాంటివి చేస్తుంటారు. ఇవన్నీ తెలుసుకోండి.పోల్చి చూసి కొనడం వల్ల మీ సొమ్ముకు గరిష్ఠ విలువ దక్కుతుంది.

# నా ఫ్యామిలీని వేధించాడు.. అందుకే గంభీర్ ‘హిపోక్రైట్’: మనోజ్ తివారీ



భారత క్రికెట్ జట్టు ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్‌పై ( ఒకప్పటి సహచరుడు మనోజ్ తివారీ తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్నాడు. ఇప్పటికే గంభీర్‌ను ‘హిపోక్రైట్’గా అభివర్ణించిన తివారీ.. అందుకుగల కారణాలను వెల్లడించాడు. 2015 రంజీ ట్రోఫీ సమయంలో తనకు, గంభీర్ మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నట్లు గుర్తు చేసుకున్నాడు. పైకి ఒకటి మాట్లాడే గంభీర్.. దానిని అస్సలు పాటించడని అందుకే కపట వ్యక్తి అంటూ మరోసారి తివారీ వ్యాఖ్యానించాడు.

“నేనెందుకు గంభీర్‌ను హిపోక్రైట్ అని పిలుస్తాను? ఎందుకంటే అతడు గతంలో ఇచ్చిన ఇంటర్వ్యూల్లో మాట్లాడిన మాటలే అందుకు కారణం. ‘విదేశాల నుంచి వచ్చే కోచ్‌లకు ఎలాంటి భావోద్వేగాలు ఉండవు. అనుభూతులు ఉండవు. డబ్బు సంపాదించుకోవడానికి వస్తారు. ఎంజాయ్ చేసి వెళ్తారు’ అని గంభీర్ అన్నాడు. ఇప్పుడు తాను ప్రధాన కోచ్‌గా ఉన్నప్పుడు భారత్‌కు చెందినవారిని సహాయక కోచ్‌లుగా తీసుకోవచ్చు కదా.. కానీ, రైన్ టెన్ డస్కెటే, మోర్నీ మోర్కెల్‌ను తీసుకున్నాడు. గంభీర్ చేసే పనులకు.. చెప్పే మాటలకు పొంతన ఉండదు. అందుకే అలా పిలుస్తా” అని వెల్లడించాడు.

కోచ్‌గా అనుభవం లేకపోతేనే ఇలా..

“గంభీర్ ప్రధాన కోచ్‌గా సాధించిన ఫలితాలను ప్రతిఒక్కరూ చూస్తున్నారు. అత్యంత తక్కువ వ్యవధిలోనే ఎక్కువ టెస్టుల్లో జట్టు ఓడింది. బోర్డర్ - గావస్కర్ ట్రోఫీని కోల్పోయాం. కివీస్‌తో స్వదేశంలో సిరీస్‌ను కోల్పోయాం. ఆసీస్‌పై అంటే ఒకే కుర్రాళ్లు ఉన్నారు.. స్టార్ బ్యాటర్లు విఫలమయ్యారు. మరి స్వదేశంలో సిరీస్ సంగతేంటి? ఇక్కడ ఓడిపోవడం మాత్రం ఆమోదయోగ్యం కాదు. కానీ, క్రికెట్‌లో గెలుపోటములు సహజం. కానీ, ఓడినప్పుడు ఏం జరిగిందనే దానిపై సమీక్షించుకోవాలి. అప్పుడే మరోసారి అవి పునరావృతం కాకుండా ఉంటాయి. రాహుల్ ద్రవిడ్ జట్టుకు అద్భుత విజయాలు అందించి ఆ బ్యాటన్‌ను గంభీర్‌కు అందించాడు. ముందుకుతీసుకెళ్లాల్సిన గంభీర్ దాన్ని వెనక్కి మళ్లిస్తున్నట్లు అనిపిస్తోంది. కోచింగ్‌లో అనుభవం లేకపోవడమే దీనికి కారణం” అని తివారీ (%మీఱఅశీయ ుఱఱష్ఱతీఎ%) వ్యాఖ్యానించాడు.

ఆ రెండూ ఒకటి కాదు..

‘‘ప్రధాన కోచ్‌గా బాధ్యతలు చేపట్టకముందు గంభీర్‌కు ఏమైనా అనుభవం ఉందా? కనీసం ఫస్ట్‌క్లాస్ క్రికెట్ లేదా ఐపీఎల్‌లో ఎక్కడైనా కోచ్‌గా చేశాడా? అంటే అదీలేదు. జట్టుకు మెంటార్‌గా ఉండటం.. కోచ్‌గా ఉండటం చాలా భిన్నం. అభిమానులతోపాటు చాలామంది విశ్లేషకులు ఈ రెండింటినీ కలిపి చెప్తారు. కానీ, అలా కాదు. అందుకే, అనుభవం లేనప్పుడు అతడి నుంచి మనం ఫలితం ఎలా ఆశిస్తాం? భవిష్యత్తులోనైనా మార్పు రావాలంటే కాస్త సమయం పడుతుంది. ఈలోగా గంభీర్ తన పొరపాట్ల నుంచి నేర్చుకోవాలి. లేకపోతే మాత్రం మరింతకాలం కొనసాగడం కష్టమే” అని తెలిపాడు.

నాపైనే కాదు.. గంగూలీపైనా వ్యాఖ్యలు

‘‘రంజీ ట్రోఫీ 2015 సీజన్‌లో గంభీర్‌తో నాకు వాగ్వాదం జరిగింది. దిల్లీ వేదికగా ఓ మ్యాచ్ జరిగింది. అప్పుడు గంభీర్ నోటినుంచి దారుణమైన పదాలు వచ్చాయి. నా కుటుంబసభ్యులపైనా నోరు పారేసుకున్నాడు. నన్నే కాదు.. సౌరభ్ గంగూలీని కూడా వదల్లేదు. ఏవో చెత్త పదాలు వాడాడు. ఆ సమయంలో ఇతర క్రికెటర్లు అతడిని కాపాడారు. లేకపోతే పరిస్థితి విభిన్నంగా ఉండేది’’ అని వ్యాఖ్యానించాడు.

# టెస్టుల్లో 9,999 పరుగులు.. ఓవైపు సంతోషం.. మరోవైపు బాధ: స్టీవ్ స్మిత్



ఆస్ట్రేలియా టెస్టు చరిత్రలో పది వేల పరుగులను ముగ్గురు మాత్రమే సాధించారు. ఓవరాల్‌గా 14 మంది ఈ ఘనతను అందుకొన్నారు. అయితే ఆ లిస్ట్‌లోకి చేరేందుకు ఆసీస్ బ్యాటర్ స్టీవ్ స్మిత్ ఒక్క పరుగు దూరంలో ఆగిపోయాడు. ఇటీవల ముగిసిన బోర్డర్ - గావస్కర్ ట్రోఫీలో భాగంగా సిడ్నీ టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో 4 పరుగులకే పెవిలియన్‌కు చేరాడు. స్మిత్‌ను భారత పేసర్ ప్రసిధ్ కృష్ణ ఔట్ చేశాడు. స్వదేశంలో మైలురాయి చేజారినందుకు బాధగానే ఉన్నప్పటికీ.. ఆ మ్యాచ్‌లో విజయం సాధించడం ఆనందంగా ఉందని స్మిత్ తెలిపాడు. బిగ్‌బాష్ లీగ్‌లో సిడ్నీ సిక్సర్స్ తరఫున స్మిత్ ఆడనున్నాడు. శనివారం పెర్త్ స్కార్చర్స్‌తో బరిలోకి దిగనున్నాడు. ఈక్రమంలో ఫాక్స్ స్పోర్ట్స్‌తో స్మిత్ (%హ్‌వజవ రాఎఫ్త్ర%) మాట్లాడాడు.

“టెస్టుల్లో 10వేల మైలురాయి మిస్ కావడం కొద్దిగా బాధించింది. కానీ, చివరికి విజేతగా నిలవడం మాత్రం ఆనందం కలిగించింది. కీలక విషయం అదే. సిరీస్‌ను సొంతం చేసుకోగలిగాం. కేవలం ఒక్క పరుగు దూరంలో ఆగిపోయా. స్వదేశంలో స్నేహితులు, కుటుంబసభ్యుల మధ్య సంబరాలు చేసుకొనే అవకాశం చేజారింది. అలా జరిగిఉంటే చాలా సంతోషించేవాడిని. అయితే, శ్రీలంకతో గాలె వేదికగా జరగబోయే తొలి టెస్టు మొదటి ఇన్నింగ్స్‌లోనే ఈ మార్క్‌ను దాటేస్తానని భావిస్తున్నా” అని వెల్లడించాడు. శ్రీలంకతో సిరీస్‌కు ఆసీస్ కెప్టెన్‌గా స్మిత్ జట్టును నడిపించనున్నాడు.

మిగతావి పట్టించుకోను .. కానీ

“నేనెప్పుడూ రికార్డుల కోసం ఆడను. అయితే, టెస్టుల్లో పదివేల పరుగుల మైలురాయి గురించి మాత్రం ఆలోచిస్తూనే ఉన్నా. టెస్టుల్లో సుదీర్ఘంగా కొనసాగుతూ పరుగులు చేయడం చాలా కష్టం. నిలకడగా ఆడాల్సిన అవసరం ఉంటుంది. అందుకే, 10 వేల పరుగుల మార్క్‌ను తాకితే నేను కుదుటపడతా. ఇప్పటికీ నేను అత్యుత్తమంగా మెరుగ్గానే ఆడుతున్నట్లు భావిస్తా. సెంచరీలు చేశా. ప్రతిసారీ కూడా మీకు (మీడియాను ఉద్దేశించి) బంతిని చూసి సరిగ్గా ఆడానని చెబుతుంటా. నేను పేలవంగా ఆడిన రోజులూ ఉన్నాయి. పరుగులు చేయకుండా ఇబ్బందిపడిన సందర్భాలు చూశా. మంచి ఇన్నింగ్స్ ఆడితే ఆటోమేటిక్‌గా సర్దుకోవచ్చు. జట్టు విజయంతో భాగస్వామి కావడమే అత్యంత ముఖ్యం’’ అని స్మిత్ వ్యాఖ్యానించాడు. ఇప్పటివరకు స్మిత్ 114 టెస్టుల్లో 55.86 సగటుతో 9,999 పరుగులతో కొనసాగుతున్నాడు. ఇందులో 34 సెంచరీలు, 41 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. అత్యుత్తమ వ్యక్తిగత స్కోరు 239 పరుగులు.



# 2036 ఒలింపిక్స్ వివిధ నగరాల్లో

దిల్లీ: భారత్ 2036 ఒలింపిక్స్ నిర్వహణపై ఆసక్తి ప్రదర్శిస్తోన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే తన ఆసక్తిని వెల్లడిస్తూ అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీకి లేఖను సమర్పించింది. అహ్మదాబాద్‌లో ఈ విశ్వ క్రీడలను నిర్వహించాలన్నది ఆలోచన. అయితే ఒకవేళ బిడ్ గెలిస్తే.. ఒక్క అహ్మదాబాద్‌లోనే కాకుండా దేశంలోని వివిధ నగరాల్లో పోటీలను నిర్వహించడంపై చర్చలు జరుగుతున్నాయి. ఇప్పటికే దేశంలో ఉన్న క్రీడా సౌకర్యాలను ఉపయోగించుకోవాలన్నది ఉద్దేశం. ఈ ప్రణాళిక అమలైనా.. అహ్మదాబాద్ ప్రధాన కేంద్రంగానే ఆటలుంటాయి. క్రీడా గ్రామాన్ని అక్కడే నిర్మిస్తారు.

భారత్ చివరిసారి 2010 (కామన్వెల్త్ క్రీడలు)లో బహుళ క్రీడల టోర్నీకి ఆతిథ్యమిచ్చింది. ఒలింపిక్ ఆతిథ్య హక్కులు దక్కితే.. భారత్‌లో వివిధ నగరాల్లో ఉన్న క్రీడా వసతులకు తగినట్లుగా ఈవెంట్లను నిర్వహిస్తారు. ఉదాహరణకు హాకీ కేంద్రంగా పేరున్న ఒడిశాలో అత్యధిక హాకీ మ్యాచ్‌లను ఆడిస్తారు. అలాగే.. రోయింగ్ ఈవెంట్లను భోపాల్‌లో, కనోయింగ్, కయాకింగ్‌లకు పుణె వేదికవుతుంది. ఖర్చును తగ్గించడం కోసం ఏ ఆతిథ్య దేశమైనా ఒలింపిక్ క్రీడలను ఒకటి కంటే ఎక్కువ నగరాల్లో నిర్వహించడానికి వీలు కల్పించే ప్రతిపాదనకు అంతర్జాతీయ ఒలింపిక్ సంఘం (ఐఓసీ) 2014లోనే ఆమోదం తెలిపింది.

క్రికెట్ కోసం..: క్రికెట్, రెజ్లింగ్, బ్యాడ్మింటన్ వేదికలకు సంబంధించి ప్రభుత్వం, క్రీడా మంత్రిత్వశాఖ మధ్య చర్చలు జరుగుతున్నాయి. క్రికెట్ టోర్నీని నిర్వహించేందుందుకు దిల్లీ, ముంబయి, అహ్మదాబాద్‌లు రేసులో ఉన్నాయి. ఇక ఇండోర్ ఈవెంట్లలో చాలా వరకు అహ్మదాబాద్‌లోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగే అవకాశముంది. పెద్ద మొత్తంలో ఈవెంట్లను నిర్వహించడానికి అవసరమైన అత్యాధునిక వసతులు అక్కడ ఉన్నాయి. ఒలింపిక్స్ నిర్వహణకు సంబంధించిన సమగ్ర ప్రణాళికను అధికారులు త్వరలోనే ఐసీసీకి సమర్పించనున్నారు. 2028 ఒలింపిక్స్‌కు లాస్‌ఏంజెలెస్, 2032 ఒలింపిక్స్‌కు బ్రిస్బేన్ ఆతిథ్యమివ్వనున్నాయి. 2036 ఒలింపిక్ నిర్వహణ హక్కుల కోసం భారత్‌తో పాటు మెక్సికో, ఇండోనేసియా, తుర్కియే, పోలెండ్, ఈజిప్ట్, దక్షిణ కొరియా పోటీపడుతున్నాయి.

# డబ్బులు తీసుకున్న కుక్కలు మొరుగుతాయ్.. హర్భజన్ సింగ్ పోస్ట్ వైరల్



బోర్డర్-గావస్కర్ ట్రోఫీలో సరైన ప్రదర్శన చేయలేక విఫలమైన టీమ్‌ఇండియా సీనియర్ ఆటగాళ్లపై విమర్శలు వెల్లువెత్తుతూనే ఉన్నాయి. దీనిపై ఇటీవల మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ ( కాస్త ఘాటుగా స్పందించాడు. టీమ్‌ఇండియా సూపర్‌స్టార్ సంస్కృతిని వీడాలని అతడు చేసిన సూచన చర్చకు దారితీసింది. ఈనేపథ్యంలోనే తాజాగా అతడు మరో పోస్ట్ చేశాడు. “మార్కెట్లో ఏనుగు నడిచివెళ్తుంటే.. డబ్బులు తీసుకున్న కుక్కలు మొరుగుతూనే” ఉంటాయి అనే సామెతను రాసుకొచ్చాడు.

ప్రస్తుతం భజ్జీ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది. ఎవరిని ఉద్దేశించి అతడు ఈ పోస్ట్ పెట్టాడా? అని నెటిజన్లు గందరగోళానికి గురవుతున్నారు. ఇలాంటి వ్యాఖ్యలు చేయడం తగదని, కాస్త మాటలు అదుపులో పెట్టుకోవాలని మరికొందరు క్రికెట్ అభిమానులు హర్భజన్‌కు సూచిస్తున్నారు.

బోర్డర్-గావస్కర్ ట్రోఫీ సిరీస్‌పై ఈ మాజీ క్రికెటర్ ఇటీవల తన యూట్యూబ్ ఛానల్‌లో విశ్లేషించిన సంగతి తెలిసిందే. రాహుల్ ద్రవిడ్ టీమ్‌ఇండియా ) కోచ్‌గా ఉన్నంతకాలం అంతా బాగుందని, ఈ ఆరు నెలల్లో ఏమైంది? అని ప్రశ్నించాడు. ఇక, ఆసీస్ పర్యటనలో విఫలమైన సీనియర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీని జట్టు నుంచి తప్పించాలనే డిమాండ్లపై భజ్జీ స్పందిస్తూ.. “ప్రతి ఆటగాడికి ఎంతో కొంత పాపులారిటీ, పేరు ప్రఖ్యాతులు ఉంటాయి. అయితే, ఆట కంటే ఏదీ ముఖ్యం కాదు. కపిల్‌దేవ్, అనిల్ కుంబ్లే లాంటి పెద్ద పెద్ద మ్యాచ్ విన్నర్లు కూడా జట్టు నుంచి తప్పుకోవాల్సిన సమయం వచ్చిందని అప్పట్లోనే బీసీసీఐ, సెలక్టర్లు చెప్పారు. టీమ్ఇండియా సూపర్‌స్టార్ సంస్కృతిని వదిలిపెట్టాలి. అభిమన్యు ఈశ్వరన్‌ను ఆస్ట్రేలియా టూర్‌కు ఎంపిక చేసి ఒక్క మ్యాచ్‌లోనూ ఆడించలేదు. సర్ఫరాజ్ ఖాన్ పరిస్థితి అంతే. పేరున్న ఆటగాళ్లని కాకుండా బాగా ఆడే ప్లేయర్లనే ఎంపిక చేయాలి’ అని హర్భజన్ ( సూచించాడు.

# హిందీ జాతీయ భాష కాదు.. అశ్విన్ వ్యాఖ్యలు వైరల్

ఇటీవలే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన సీనియర్ ఆటగాడు రవిచంద్రన్ అశ్విన్ ( మరోసారి వార్తల్లో నిలిచాడు. ఓ కాలేజీ ఈవెంట్‌లో హిందీ భాష పై అతడు చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. హిందీ జాతీయభాష కాదని క్రికెటర్ అన్నాడు.

చెన్నై ( లో జరిగిన ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీ స్నాతకోత్సవానికి అశ్విన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతడు కొంతసేపు విద్యార్థులతో ముచ్చటిస్తూ ఇంగ్లీష్, తమిళ్, హిందీ భాషలు ఎంతమందికి అర్థమవుతాయని అడిగారు. హిందీ గురించి అడగ్గా కొంతమంది నుంచి మాత్రమే సమాధానం వచ్చింది. అప్పుడు క్రికెటర్ దానిపై స్పందిస్తూ.. “ఇక్కడ మీకో విషయం చెప్పాలి. హిందీ అధికారిక భాష మాత్రమే. జాతీయ భాష కాదు” అని అన్నాడు.

# యువరాజ్ కెరీర్ ముగియడంలో విరాట్ ‘కెప్టెన్సీ’దే పాత్ర: రాబిన్ ఉతప్ప


ﱬ: సారథ్యంలో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మల మార్గాలు విభిన్నమైనవి. ఈ మాట అంటున్నది మాజీ క్రికెటర్ రాబిన్ ఉతప్ప వారిద్దరి కెప్టెన్సీని పోల్చే క్రమంలో.. భారత మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ్ కెరీర్‌పై సారథిగా విరాట్ వ్యవహరించిన తీరు కీలకపాత్ర పోషించిందని ఉతప్ప వ్యాఖ్యానించాడు. క్యాన్సర్‌తో పోరాడి 2017లో అంతర్జాతీయ క్రికెట్‌లోకి పునరాగమనం చేసినప్పుడు అతనికి మద్దతుగా నిలవలేదని గుర్తు చేసుకున్నాడు. వన్డే, టీ20 ప్రపంచకప్‌లను టీమ్‌ఇండియా గెలుచుకోవడంలో యువీ (ముఖ్య భూమిక పోషించిన విషయం తెలిసిందే. ఈ రెండు కప్‌లు కూడా ఎంఎస్ ధోనీ నాయకత్వంలో టీమ్‌ఇండియా సొంతం చేసుకుంది.

‘‘విరాట్ కోహ్లీ (%ఎఱతీఖ్ ఖశీష్త్రశ్రీఱ%) సారథ్యశైలి ఇతరులతో పోలిస్తే విభిన్నంగా ఉంటుంది. అందరూ అతడి ప్రమాణాలను చేరుకోవాలని కోరుకుంటాడు. అది క్రికెటైనా, ఫిట్‌నెస్, పాటలు వినడమైనా, ఏదైనా విషయం అంగీకరించడంలోనైనా సరే అవే స్టాండర్డ్స్ పాటించాలని అనుకుంటాడు. నాయకుల్లో రెండు రకాలు ఉంటారు.



# ఆస్థమా శాపం కాదు

ఆస్థమా దీర్ఘకాల సమస్యే కావొచ్చు. జీవితాంతం వేధించేదే కావొచ్చు. అంతమాత్రాన భయపడాల్సిందేమీ లేదు. శాపంగా భావించాల్సిన పనీ లేదు. దీనికిప్పుడు మంచి మందులు అందుబాటులో ఉన్నాయి. వీటిని క్రమం తప్పకుండా వాడుకుంటే ఆస్థమాను చాలావరకు నియంత్రణలో ఉంచుకోవచ్చు. అయితే మనదేశంలో మందులపై సరైన అవగాహన లేకపోవటం.. జబ్బు మీద అపోహలు, భయాలు నెలకొనటం పెద్ద సమస్యగా పరిణమిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆస్థమా బాధితులతో పోలిస్తే మనదేశంలో 13% మంది దీంతో బాధపడుతుండగా.. ఆస్థమా మరణాల్లో 42% మనదగ్గరే సంభవిస్తుండటం గమనార్హం. ఇలాంటి వ్యత్యాసాలను తగ్గించే ఉద్దేశంతోనే 'ఆస్థమా చికిత్స అందరికీ' అని వరల్డ్ ఆస్థమా డే నినదిస్తోంది. ఈ నేపథ్యంలో ఆస్థమా ఎందుకు వస్తుంది? ఎలా నియంత్రణలో ఉంచుకోవచ్చు? అనేవి తెలుసుకొని ఉండటం మంచిది.



ఆస్థమా ప్రధానంగా ఊపిరితిత్తుల్లోని గాలి గొట్టాల సమస్య. దీనికి మూలం అలర్జీ. కంట్లో నలుసు పడితే దురద పుడుతుంది కదా. కన్ను ఎరుపెక్కటం, నీరు కారవటమూ మొదలవుతాయి. సరపడని పదార్థాలు తగిలినపుడు ఊపిరితిత్తుల్లోనూ ఇలాగే జరుగుతుంది. మనం ముక్కుతో పీల్చుకునే గాలి శ్వాసనాళం ద్వారా ఊపిరితిత్తుల లోపలికి చేరుకుంటుంది. ఈ శ్వాసనాళం పైనుంచి రెండుగా చీలుతూ వచ్చి.. మళ్లీ చిన్నచిన్న గొట్టాలుగా విడిపోతూ.. అతి సూక్ష్మమైన గాలిగదుల్లోకి గాలిని చేరవేస్తుంది. సాధారణంగా దుమ్ము ధూళి ఉన్న ప్రాంతాలకు వెళ్లినప్పుడు దగ్గు రావటం మామూలే. ఇది హాని కారకాలు లోపలికి ప్రవేశించకుండా, వాటిని బయటకు నెట్టివేయటానికి శరీరం చేసే ప్రయత్నమే. అయితే ఆస్థమా వచ్చే స్వభావం (అటోపీ) గలవారికి ఇలాంటి మామూలు విషయాలే పెద్ద సమస్యగా మారతాయి. దుమ్మూ ధూళి, పుప్పొడి, రసాయనాల వంటివి తగిలినప్పుడు లోపల అలర్జీ ప్రేరేపితమై గాలిగొట్టాలు విపరీతంగా స్పందిస్తుంటాయి. ఆస్థమాకు మూలం ఇదే. గాలిగొట్టాలకు అలర్జీ కారకాలు తగిలినప్పుడు రోగనిరోధక కణాలు అతిగా స్పందిస్తాయి. దీంతో వాపు ప్రక్రియ (ఇన్‌ఫ్లమేషన్) మొదలవుతుంది. అప్పుడు గాలిగొట్టాల గోడలు ఉబ్బి, లోపలి మార్గం సన్నబడుతుంది. గాలి గొట్టాల్లో జిగురుద్రవం ఉత్పత్తీ పెరుగుతుంది. ఇది లోపలే చిక్కుకు పోతుంది. చుట్టుపక్కలా వాపు మాదిరి మార్పులు మొదలవుతాయి. దీంతో శ్వాస తీసుకోవటం, వదలటం కష్టమైపోతుంది. ఫలితంగా దగ్గు, పిల్లికూతలు, ఊపిరి అందక ఉక్కిరిబిక్కిరి అవటం వంటి ఇబ్బందులు తలెత్తుతాయి. ఈ లక్షణాలు కొందరిలో కొద్దిసేపే ఉండొచ్చు. ఒకట్రెండు లక్షణాలే ఉండొచ్చు. కొందరికి ప్రత్యేకించి కొన్ని సమయాల్లోనే తలెత్తొచ్చు. కొందరికి నిరంతరం వేధిస్తుండొచ్చు. కొందరికి ఎలాంటి లక్షణాలు లేకుండానూ ఆస్థమా ఉండొచ్చు (సైలెంట్ చెస్ట్).

ఎవరికి? ఎందుకు?

పిల్లల దగ్గర్నుంచి వృద్ధుల వరకూ ఎవరికైనా ఆస్థమా రావొచ్చు. అయితే ఆస్థమా బాధితుల్లో సుమారు సగం మందికి పదేళ్ల వయసులోపే తొలి లక్షణాలు మొదలవుతుంటాయి. ఆస్థమాతో బాధపడే పిల్లల్లో చాలామందిలో ఆరేళ్లలోపే తొలిసారి ఆస్థమా దాడి చేయటం చూస్తుంటాం. దీనికి ప్రధాన కారణం వంశపారంపర్యంగా సంక్రమించే జన్యువులు. అయితే తల్లిదండ్రులకు ఆస్థమా ఉన్నంత మాత్రాన పుట్టే పిల్లలకు తప్పకుండా రావాలనేమీ లేదు. తల్లిదండ్రులిద్దరికీ ఆస్థమా ఉంటే పిల్లలకు 70% వరకు రావొచ్చు. తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరికే ఆస్థమా ఉంటే 30% వరకు వచ్చే అవకాశముంది. అదేపనిగా అలర్జీ కారకాలకు గురవుతున్నప్పుడు జన్యువులు లేకపోయినా ఆస్థమా దాడి చేయొచ్చు. ఆస్థమా బాధితుల్లో సుమారు 6% మంది ఇలాంటివారే. పుట్టుకతో ఆస్థమా జన్యు స్వభావం ఉన్నా అందరికీ సమస్యలు తెచ్చిపెట్టకపోవచ్చు. చాలావరకు నిద్రాణంగానే ఉంటుంది. అలర్జీ కారకాల ప్రభావానికి గురైనప్పుడు ఈ జన్యు స్వభావం బయటపడుతుంది. ఎండుగజ్జి లేదా ఆహార అలర్జీ గల పిల్లలకు ఆస్థమా ముప్పు ఎక్కువ. మానసిక ఆందోళన, ఒత్తిడి, కొన్నిరకాల వృత్తులు, ఇన్‌ఫెక్షన్ల వంటివీ ఆస్థమాను ప్రేరేపించొచ్చు.

లక్షణాలేంటి?

దగ్గు.. ముఖ్యంగా పడని వాతావరణంలో దగ్గు వస్తుంటుంది. శ్వాస తీసుకోవటం, వదలటంలో ఇబ్బంది కలుగుతుంది. ఛాతీ బరువుగా, బిగుతుగానూ అనిపించొచ్చు. శ్వాసిస్తున్నప్పుడు, దగ్గినప్పుడు పిల్లికూతలు వస్తుంటాయి. అయితే అందరిలో అన్ని లక్షణాలూ ఉండాలనేమీ లేదు. కొందరికి దగ్గు ఒక్కటే ఉండొచ్చు. పిల్లికూతలు, ఆయాసం అంతగా ఉండకపోవచ్చు. దీని లక్షణాలూ వస్తూ పోతుంటాయి కూడా. కొందరికి ఉన్నట్టుండి తలెత్తొచ్చు. తీవ్రంగానూ ఉండొచ్చు. ఇలాంటి సమయంలో శ్వాస తీసుకోవటం చాలా కష్టమైపోతుంది.

ఇన్‌హేలర్లపై అనుమానాలొద్దు

ఇన్‌హేలర్లు సురక్షితం. ఆందోళన, అనుమానాలు వద్దు. ఆస్థమా చాలా తీవ్రంగా ఉంటేనే, చివరిదశలోనే ఇన్‌హేలర్లు వాడుతారని అనుకోవద్దు. ఇవి ప్రాథమిక, ఉత్తమ చికిత్స సాధనాలని తెలుసుకోవాలి. వీటితో తీసుకునే మందు మోతాదు మైక్రోగ్రాముల్లో ఉంటుంది. నేరుగా శ్వాసమార్గాల్లోకే చేరుకుంటుంది. కాబట్టి పెద్దగా నష్టమేమీ ఉండదు. ఈ మందులకు అలవాటు పడటమనేది ఉండదు.

ఆస్థమా పిల్లల విషయంలో– 'పెరిగే వయసు కదా. ఇప్పట్నుంచే ఇన్‌హేలర్లు ఎందుకు?' అని కొందరు వెనకాడుతుంటారు. స్టిరాయిడ్ల వాడకంతో ఎదుగుదల కుంటుపడుతుందని భయపడుతుంటారు. ఇది తప్పు. ఆస్థమా నియంత్రణలో లేకపోతేనే ఎదుగుదల దెబ్బతింటుంది. డాక్టర్ సూచించిన మోతాదులో మందు వాడితే ఎలాంటి దుష్ప్రభావాలూ ఉండవు.

ఇన్‌హేలర్లు ఖరీదైనవని మరికొందరి అభిప్రాయం. మాత్రలతో పోలిస్తే వీటి ధర ఎక్కువే కావొచ్చు. కానీ వీటిని సరిగా వాడకపోవటం వల్ల ఆసుపత్రిలో చేరితే అయ్యే ఖర్చుతో పదేళ్లకు సరిపడిన ఇన్‌హేలర్ మందులు కొనుక్కోవచ్చు.

బయటి ఊళ్లకు వెళ్లినా వెంట ఇన్‌హేలర్లు తీసుకెళ్లాలి. వీటి వాడుకోవటాన్ని నామోషీగా భావించొద్దు. ఇన్‌హేలర్ వాడకంలో తప్పులు చేయొద్దు. దీన్ని నొక్కుతూనే మందును లోనికి పీల్చుకోవాల్సి ఉంటుంది. ఇన్‌హేలర్‌కు స్పేసర్‌ను జోడించి మందు పీల్చుకోవటం అన్ని విధాలా మంచిది.

# ఎండకు బాల గుండెలు జాగ్రత్త

ఎండ వేడిని తట్టుకోవటం ఎవరికైనా కష్టమే. గుండెలో రంధ్రాలతో పుట్టిన పిల్లలకైతే మరీ కష్టం. పుట్టిన తర్వాత గుండెజబ్బుల బారినపడే చిన్నారులకూ ఇబ్బందే. అందువల్ల వేసవిలో ఇలాంటి పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకోవటం తప్పనిసరి.



సాధారణంగా ఆక్సిజన్‌తో కూడిన 'మంచి' రక్తం, ఆక్సిజన్‌ను కణాలు వాడుకున్నాక మిగిలే 'చెడు' రక్తం ధమనుల్లో, సిరల్లో వేర్వేరుగా ప్రవహిస్తుంటుంది. గుండెలోనూ వేర్వేరు గదులు ఇవి కలిసిపోకుండా చూస్తాయి. అయితే గుండె గదుల మధ్య గోడలకు రంధ్రాలు గల పిల్లల్లో మంచి, చెడు రక్తం కలిసిపోతుంటాయి. దీంతో రక్తంలో ఆక్సిజన్ మోతాదు తగ్గిపోతుంది. ఫలితంగా అవయవాలకు తగినంత ఆక్సిజన్ అందదు. అప్పుడు రక్తం సరిపోవటం లేదనే ఉద్దేశంతో శరీరం మరింత ఎక్కువగా రక్తం ఉత్పత్తయ్యేలా చేస్తుంది. దీంతో ఎర్ర రక్తకణాలు ఎక్కువగా ఉత్పత్తి అవుతాయి. వీటి సంఖ్య మరీ ఎక్కువైతే రక్తం బాగా చిక్కగా అవుతుంది. ఎండాకాలంలో దీని ముప్పు మరింత ఎక్కువవుతుంది.

రక్తం చిక్కబడితే ప్రమాదం

వేసవిలో వాతావరణ ఉష్ణోగ్రత బాగా పెరుగుతుంది. వేడిని తట్టుకోవటానికి ఒంట్లోని నీరు చెమట రూపంలో ఎక్కువగా బయటకు పోతుంది. దీంతో ఒంట్లో నీటిశాతం తగ్గి, రక్తం చిక్కబడే ముప్పు తలెత్తుతుంది. ఒకవేళ వాంతులు, విరేచనాలు అవుతుంటే ఇది మరింత ఎక్కువవుతుంది కూడా. రక్తం చిక్కబడినప్పుడు తలనొప్పి, తీవ్రమైన అలసట, మగ వంటి లక్షణాలు (హైపర్ విస్కాసిటీ సిండ్రోమ్) తలెత్తుతాయి. రక్తం సిరల్లో గడ్డకట్టే ప్రమాదమూ (వీనస్ థ్రాంబోసిస్) ఉంటుంది. తలలోని సిరల్లో రక్తం గడ్డలు ఏర్పడితే మెదడులో చీము పట్టి పరిస్థితి తీవ్రమవుతుంది. కాబట్టి గుండె లోపాలతో పుట్టిన పిల్లల విషయంలో వేసవిలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి.

జాగ్రత్తగా ఉండాలి

గుండె లోపాలు గల పిల్లలను ఎండలో ఎక్కువగా తిరగనీయొద్దు. వీరిని చెమట ఎక్కువగా పట్టే బీచ్‌ల వంటి చోట్లకు తీసుకెళ్లటం మంచిది కాదు.

నీరు, ద్రవాలు ఎక్కువగా తాగించాలి. పండ్ల రసాలు కూడా మంచివే.

వాంతులు, విరేచనాలు అవుతుంటే వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లాలి. అవసరమైతే సెలైన్ ఎక్కించాల్సి ఉంటుంది.

గుండెలో రంధ్రం గల పిల్లలు తలనొప్పి వస్తుందన్నా, రోజూ జ్వరం వస్తున్నా, కళ్లు సరిగా కనిపించటం లేదన్నా తాత్సారం చేయకుండా ఆసుపత్రికి తీసుకెళ్లాలి. అవసరమైతే సీటీ స్కాన్ చేయించాలి. మెదడులో చీము, మెదడు సిరల్లో రక్తం గడ్డలుంటే తక్షణం చికిత్స చేయించాలి.

తలనొప్పి ఎక్కువగా ఉన్నప్పుడు.. మగత, ఆయాసం, అలసట ఉన్నప్పుడు రక్తం చిక్కదనాన్ని తెలిపే పీసీవీ పరీక్ష చేయించాలి. చిక్కదనం మరీ ఎక్కువైతే కొన్నిసార్లు కొంత రక్తాన్ని బయటకు తీయాల్సి రావొచ్చు.

రక్తంలో ఆక్సిజన్ శాతం తగ్గటం వల్ల కొందరు పిల్లలు నీలంగా మారుతుంటారు (బ్లూ బేబీస్). బిగ్గరగా ఏడ్చినా కూడా పెదవులు, గోళ్లు, ముఖం వంటివి నీలంగా మారుతుంటాయి. ఇలాంటి పిల్లలకు చిన్నప్పుడు షంట్ ఆపరేషన్ చేసి, కొద్ది సంవత్సరాల తర్వాత పెద్ద ఆపరేషన్ చేస్తుంటారు. వీరి విషయంలో వేసవిలో ఇంకాస్త ఎక్కువ జాగ్రత్తగా ఉండాలి. ఎందుకంటే రక్తం చిక్కబడి, షంట్ మూసుకుపోయే ప్రమాదముంది. వీరికి అవసరాన్ని బట్టి డాక్టర్లు ఆస్ప్రిన్ మాత్రలు సూచిస్తుంటారు. వీటిని క్రమం తప్పకుండా వేసుకునేలా చూడాలి.

పుట్టిన తర్వాత– గుండె వైఫల్యం (కార్డియో మయోపతీ) తలెత్తిన పిల్లలకు దీర్ఘకాలం వైద్యం అవసరం. వీరికి డాక్టర్లు ఒంట్లోంచి నీరు ఎక్కువగా బయటకు పోవటానికి మందులు సూచిస్తుంటారు. ఈ మందులు వేసుకునేవారికి ఎండాకాలంలో మరింత ఎక్కువగా ఒంట్లోంచి నీరు బయటకు పోయి, ఖనిజ లవణాలు తగ్గిపోవచ్చు. దీంతో బాగా నీరసిస్తారు. కొన్నిసార్లు గుండె లయ తప్పొచ్చు. ఇది చాలా ఇబ్బందులకు దారితీయొచ్చు. కాబట్టి వీరి విషయంలో ముందే డాక్టర్‌ను సంప్రదించి, మందుల మోతాదులో అవసరమైన మార్పులు చేసుకోవాలి. పల్మనరీ హైపర్‌టెన్షన్‌తో బాధపడే పిల్లల విషయంలోనూ జాగ్రత్తగా ఉండాలి. ఎండలో ఎక్కువగా తిరిగితే వీరికి వేసోవేగల్ సింకోప్ సమస్య తలెత్తొచ్చు. ఇందులో ఉన్నట్టుండి రక్తపోటు తగ్గిపోయి, పిల్లలు కింద పడిపోవచ్చు. కొన్నిసార్లు మరణించే ప్రమాదమూ ఉంటుంది. కాబట్టి పల్మనరీ హైపర్‌టెన్షన్ గల పిల్లలను ఎండలో ఎక్కువగా తిరగనీయకూడదు.

# సురక్షిత క్యాన్సర్ మందుల దిశగా..

సురక్షిత క్యాన్సర్ మందుల ఆవిష్కరణ దిశగా మరో ముందడుగు పడింది. కొన్ని క్యాన్సర్ చికిత్సలు గుండెను దెబ్బతీయటానికి గల కారణాన్ని యూసీఎల్ పరిశోధకులు గుర్తించారు మరి. క్యాన్సర్ చికిత్సలో అధునాతన ఔషధాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. మరణాల నుంచి కాపాడుతున్నాయి. జీవనకాలాన్ని పెంచుతున్నాయి. అయితే కొన్ని క్యాన్సర్ చికిత్సలు గుండెను దెబ్బతీస్తుంటాయి. ఇది రకరకాల రూపాల్లో ఉండొచ్చు. కొందరిలో గుండె పంపింగ్ సామర్థ్యం తగ్గితే.. కొందరిలో గుండె వైఫల్యం సంభవించొచ్చు. కానీ ఈ మందులు గుండెను ఎలా దెబ్బతీస్తున్నాయనేది తెలియకుండానే ఉండిపోయింది. దీని విషయంలో యూసీఎల్ పరిశోధకులు ఓ కొత్త విషయాన్ని గుర్తించారు. గుండెజబ్బు ముప్పు పెరగటానికి దోహదం చేసే రక్తంలోని ప్రొటీన్లు క్యాన్సర్ చికిత్సలో వాడే మందులతోనూ ప్రభావితమవుతున్నాయని కనుగొన్నారు. ఈ మందులు గుండెను ఎలా దెబ్బతీస్తున్నాయో విశ్లేషించటానికి, గుండెజబ్బు ముప్పు గలవారిని గుర్తించటానికి తమ అధ్యయన ఫలితాలు తోడ్పడగలవని పరిశోధకులు చెబుతున్నారు. ముున్ముందు సురక్షిత క్యాన్సర్ మందుల ఆవిష్కరణకూ దారితీయగలవని ఆశిస్తున్నారు. గుండె వైఫల్యం వంటి గుండె జబ్బుల చికిత్సకు కొత్త మందుల రూపకల్పనకూ ఈ అధ్యయనం దారులు తెరచింది. గుండెజబ్బు ముప్పుతో ముడిపడిన ప్రొటీన్లను అడ్డుకోవటం లేదా ముప్పును తగ్గించే ప్రొటీన్లను ప్రేరేపితం చేయగలిగే మందులతో మంచి ఫలితం కనిపించొచ్చని భావిస్తున్నారు.



# కాలుష్యంతో గర్భిణుల్లో ఫ్లూ

వాయు కాలుష్యం బారినపడకుండా గర్భిణులను కాపాడుకోవటం ఎంతైనా అవసరమని తాజా అధ్యయనం సూచిస్తోంది. గాలిలోని అతి సూక్ష్మ రేణువుల (యూఎఫ్‌పీలు) మూలంగా గర్భిణుల్లో శ్వాసకోశ వైరల్ ఇన్‌ఫెక్షన్ ముప్పు పెరుగుతున్నట్టు తేలటమే దీనికి కారణం. వాయు కాలుష్యం



ఊపిరితిత్తుల్లోని రక్షణ వ్యవస్థను ప్రభావితం చేస్తుంది. ఫలితంగా వైరల్ ఇన్‌ఫెక్షన్ల ముప్పూ పెరుగుతుంది. మామూలుగానే గర్భిణులకు తీవ్ర ఫ్లూ ముప్పు ఎక్కువ. అయినా కూడా వాయు కాలుష్యం, ఇన్‌ఫ్లూయెంజా మధ్య సంబంధంపై ఇప్పటివరకూ పెద్దగా అధ్యయనాలు జరగలేదు. దీనిపై లోతుగా దృష్టి సారించాలని.. తల్లుల ఆరోగ్యం మీద స్వల్పకాలంలో, దీర్ఘకాలంలో పడే ప్రభావాలను నివారించటానికిది అవసరమని పరిశోధకులు చెబుతున్నారు. గర్భిణుల్లో రక్తం మరింత ఎక్కువగా పంప్ కావటం.. శ్వాసించేటప్పుడు ఎక్కువ మొత్తంలో గాలిని తీసుకోవటం, వదలటం.. పిండాన్ని రక్షించటానికి తోడ్పడే కొన్ని రోగనిరోధక కణాల్లో మార్పులు సంభవించటం వంటివన్నీ వీరిలో వైరల్ ఇన్‌ఫెక్షన్ ముప్పు పెరగటానికి దోహదం చేస్తున్నాయని వివరిస్తున్నారు. ఫ్లూ టీకా సమర్థమైంది, సురక్షితమైంది అయినప్పటికీ గర్భిణుల్లో దీని సామర్థ్యం 50% కన్నా తక్కువగానే ఉంటుంది. అందువల్ల టీకా తీసుకున్నప్పటికీ వీరికి శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్ ముప్పు ఎక్కువగానే ఉంటుందని పరిశోధకులు గుర్తుచేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి పది అకాల మరణాల్లో తొమ్మిదింటికి కాలుష్యమే కారణమవుతోంది. వాయు మిశ్రమాలు, అతి సూక్ష్మ రేణువులు ఎంతోమందికి ప్రాణాంతకంగా పరిణమిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వాయు కాలుష్యంతో ప్రమాదం ఎక్కువగా గలవారిని గుర్తించి, కాపాడుకోవాల్సిన అవసరముందని పరిశోధకులు చెబుతున్నారు. ముఖ్యంగా ఫ్లూ, యూఎఫ్‌పీలు ఎక్కువగా ఉండే పట్టణ ప్రాంతాల్లో గర్భిణులను కాపాడుకోవటానికి కాలుష్య నియంత్రణ చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

# పాత జలుబు కొత్తగా..

ఇదిగో జలుబు అంటే అదిగో కరోనా అన్నట్టుగా మారింది పరిస్థితి. ఏ కొత్త వైరస్ విజృంభించినా మహమ్మారిలా మారుతుందేమోననే వణికిపోతున్నాం. కొవిడ్ అంతలా భయపెట్టింది! అందుకేనేమో మామూలుదైన హెచ్3ఎన్2 వైరస్‌కూ ఇప్పుడు బెంబేలెత్తిపోతున్నాం. నిజానికి అంత ఆందోళన అవసరం లేదు. కొవిడ్‌లా ఇదేమీ కొత్తది కాదు. ఏటా వచ్చే సీజనల్ ఫ్లూనే. అలాగని అసలే ప్రమాదం లేదనుకోలేం. కొందరికి తీవ్రంగానూ పరిణమించొచ్చు. కాబట్టి జాగ్రత్త అవసరం.

ఏటా కాలాల వారీగా వచ్చే ఫ్లూ మనదేశంలో అంత ప్రమాదకరమైంది కాదు. దీన్ని అంతగా పట్టించుకునేవారూ కాదు. స్వైన్‌ఫ్లూ రాకతో ఇదెంత ప్రమాదకరమైందో తెలిసొచ్చింది. అది కొందరిలో న్యుమోనియాకు దారితీయటం, ప్రాణాంతకంగా పరిణమించటం తెలిసిందే. అప్పటి నుంచీ ఫ్లూ విషయంలో నిర్లక్ష్యం తగదనే అవగాహన పెరిగింది. ఆసుపత్రుల్లోనూ ప్రత్యేకించి దీనిపై దృష్టి సారిస్తున్నారు. ప్రస్తుతం హెచ్3ఎన్2 కొత్తగా విజృంభిస్తుండటంతో కలకలం మొదలైంది. కాలాల వారీగా వచ్చే ఫ్లూలో ఇదొకరకం.

# ఇదేం కడుపునొప్పి?

మీరు ఎండోస్కోపీ, కొలనోస్కోపీ చేయించుకున్నారు. పెద్దగా సమస్యలేమీ బయటపడలేదు. కాబట్టి ప్రమాదకరమైన జబ్బేదీ లేకపోవచ్చు. మీరు వాడుతున్న మందులతో అన్నవాహికలోకి జీర్ణరసాలు ఎగదన్నుకొని రావటం (రిఫ్లక్స్), డ్యుయోడినమ్ అల్సర్ సమస్యలు ఇప్పటికే తగ్గిపోయి ఉండాలి. అయినా నొప్పి, మంట తగ్గలేదంటే ఇతరత్రా సమస్యలేవైనా ఉన్నాయేమో చూడాల్సి ఉంటుంది. మీరు తెలిపిన లక్షణాలను బట్టి ఇరిటబుల్ బవల్ సిండ్రోమ్ (ఐబీఎస్) లేదా నాన్ అల్సర్ డిస్‌పెప్సియాలో ఏదో ఒకటి ఉండొచ్చని అనిపిస్తోంది. ఐబీఎస్‌లో రకరకాల లక్షణాలుంటాయి. వీటిల్లో ఒకటి తరచూ నొప్పి రావటం. విరేచనాలు, మలబద్ధకం కూడా ఉండొచ్చు. కొందరిలో ఇవి రెండూ కలిసి ఉండొచ్చు. నాన్ అల్సర్ డిస్‌పెప్సియాలో పుండు లేకపోయినా అజీర్ణం, మంట వంటివి వేధిస్తుంటాయి. కాబట్టి ఆయా లక్షణాలను బట్టి చికిత్స చేయాల్సి ఉంటుంది. నొప్పి, మంట తగ్గటానికి ఒమిప్రాజోల్ ఒక్కటే కాదు.. ఇతరత్రా మందులూ ఉన్నాయి. ముఖ్యంగా ప్రొకైనటిక్స్ రకం మందులు మేలు చేస్తాయి. ఇరిటబుల్ బవల్ సిండ్రోమ్ అయితే పేగుల కదలికలను నియంత్రించే మందులు ఉపయోగపడతాయి. వీటిని వైద్యుల పర్యవేక్షణలో ఆరంభించాల్సి ఉంటుంది. ముందుగా ఏ మందు పనిచేస్తుందో గుర్తించి, వాటిని వాడుకోవాల్సి ఉంటుంది. కొన్నిసార్లు మానసిక ఒత్తిడితోనూ నొప్పి, మంట వంటివి తలెత్తొచ్చు. కాబట్టి యోగా, ధ్యానం వంటి వాటితో మానసిక ప్రశాంతత సాధించేందుకు ప్రయత్నించాలి. ఏవైనా పదార్థాలు తిన్నప్పుడు ప్రత్యేకించి నొప్పి, మంట వస్తున్నట్టు గుర్తిస్తే ఆపెయ్యాలి. ఐబీఎస్ గలవారికి త్వరగా జీర్ణం కాని పిండి పదార్థాలు



తక్కువగా ఉండే లో ఫాడ్‌మ్యాప్ ఆహార పద్ధతి ఉపయోగపడుతుంది. దీని గురించి డాక్టర్‌ను అడిగి తెలుసుకోవాలి. కొన్ని జబ్బులు పరీక్ష చేసినప్పుడు చిన్నగా ఉండటం వల్ల కనిపించకపోవచ్చు. కొంతకాలం తర్వాత బయటపడొచ్చు. కాబట్టి మీరు క్రమం తప్పకుండా వైద్యుడిని సంప్రదిస్తూ ఉండటం మంచిది.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed at Sri Muktheswara Publications, D.No. 10-1-70/A, Lingojiguda, Opp. H.P Gas Agency, Karmanghat, Saroornagar ,RangaReddy( Dist.), Hyderabad - 500035, Telangana .Published at Plot No.43,Flat No.210,Raja Rjeswari APTS,HUDA Complex,Saroornagar,Ranga Reddy(Dist),Hyderabad.500035, Telangana
Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy